www.andhrajyothy.com

విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి

సంపుటి: 58
సంచిక: 118

శనివారం | 12-8-2017 | పేజీలు: 14 + 20 | వెల: రూ. 5.00 |

శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం; తిథి: పంచమి రా. 10.07 తదుపరి షష్ఠి; నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ. 6.14, రేవతి తె. 5.50; వర్జ్యం: సా. 6.02-7.36; దుర్ముహూర్తం: ఉ. 6.02-6.52; అమృతఘడియలు: తె. 3.29-5.03; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.39

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

కొలువుదీరిన వెంకయ్య

అతిరథుల సమక్షంలో ఉప రాష్ట్రపతిగా ప్రమాణం



ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వెంకయ్యనాయుడు

వాదించండి, విభేదించండి.. కానీ..
బహిష్కరించకండి!

చర్చల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం

సమయాన్ని వృథా చేయకుండా చర్చించాలి

ఉపరాష్ట్రపతి వెంకయ్య తొలి సందేశం

తెలుగుదనానికి సరికొత్త వెలుగు వచ్చింది. పీవీ నరసింహారావు తర్వాత ఇన్నాళ్లకు మరో తెలుగు వాడు ఓ ఉన్నత పీఠాన్ని అలంకరించాడు. ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు శుక్రవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. ఆ వెంటనే రాజ్యసభ ఛైర్మన్‌గానూ బాధ్యతలు చేపట్టారు. తొలి సారిగా సభను నిర్వహించారు. పార్టీలకు అతీతంగా నేతలు వెంకయ్యపై ప్రశంసలు కురిపించారు. 16



తొలి పలుకు

రాజ్యసభ చైర్మన్ సీట్లో వెంకయ్య

"1998లో నేను తొలిసారిగా రాజ్యసభలో అడుగుపెట్టాను. ఇదే సభకు అధ్యక్షుడిని అవుతానని కలలో కూడా ఊహించలేదు. నేను సామాన్య కుటుంబం నుంచి వచ్చాను. ఎలాంటి రాజకీయ వారసత్వం లేదు. అయినప్పటికీ... ఉపరాష్ట్రపతిని కాగలిగానంటే అది భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఘనతే! సభలో ఏ అంశంపైనైనా చర్చిద్దాం... విభేదిద్దాం! కానీ... బహిష్కరించడం మాత్రం వద్దు!"

- రాజ్యసభలో వెంకయ్యనాయుడు

కాలర్ పట్టుకొని నిలదీస్తారు!

మాట తప్పిన నేతల్లో ఆ భయాన్ని కలిగించాలి 6



- బాబు ఒక్క హామీ నెరవేర్చలేదు
- అన్ని వర్గాల్నీ మోసం చేశారు
- గుడి భూములూ దోచారు
- ఓటుకు 5వేలు ఇస్తామన్నారు
- ఓటుతో దెయ్యాలకు గుణపాఠం
- మూడున్నరేళ్ల పాలనపై తీర్పు చెప్పండి: జగన్

జగన్‌ది ఉన్మాదం

- అది ఇప్పుడు తారస్థాయికి చేరింది 6
- మెంటల్ ఆస్పత్రిలో చేర్చాలి.. మంత్రుల ఫైర్
- నంద్యాల రాకుండా నిషేధించాలని డిమాండ్

పీకేపై కేసు?



- టీడీపీ యోచన!
- నకిలీ సోషల్ మీడియా ఖాతాలపై ఆగ్రహం 6



బెట్టింగ్ ఫిట్టింగ్!

రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్.. పోలీసులతో బలమైన బంధం

- భారీగా సంపాదించిన పలువురు అధికారులు
- రియల్ వ్యాపారాలు
- కృష్ణ సింగ్ విచారణతో కదులుతున్న డొంక
- ఆధారాలు సేకరిస్తున్న ఉన్నతాధికారులు
- తదుపరి చర్యలకు రంగం సిద్ధం

'అక్కడెక్కడో పేకాట ఆడుతున్నారు'... ఇది నెల్లూరు పోలీసులకు వచ్చిన సమాచారం!

అక్కడికి వెళ్లిన పోలీసులకు బెట్టింగ్ కింగ్ కృష్ణ సింగ్ కనిపించాడు! 'అరెరె... నువ్వు ఇక్కడున్నావేమిటి! పోపో... పారిపో' అంటూ సేఫ్‌గా పంపించేశారు.

ఈ విషయం జిల్లా ఎస్పీ దృష్టికి రావడంతో తీగ లాగారు. డొంక కదిలింది. బెట్టింగ్ రాయుళ్లతో పోలీసు అధికారుల బంధాలు బయటపడ్డాయి.

రాష్ట్రంలో అనేక మంది పోలీసు అధికారులు బెట్టింగ్ నిర్వాహకులతో చేతులు కలిపారని, విచ్చల విడిగా సొమ్ము పోగేసుకున్నారని తేలింది.

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

బెట్టింగ్ కింగ్ కృష్ణ సింగ్ విచారణతో పెద్ద డొంకే కదులుతోంది. మూలాలు చాలా లోతుగా పాతుకున్నట్లు వెల్లడవుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, గోవా, ఉత్తరాదిలోని పలు రాష్ట్రాలలో కృష్ణ సింగ్ నెట్‌వర్క్ విస్తరించింది. ఈ వ్యవహారంలో ముఖ్యులుగా వ్యవహరిస్తున్న షేక్ షంషీర్, అల్లూరు అనిల్ కుమార్ రెడ్డి, తిన్నేరు రమేశ్ కుమార్, ఊటుకూరు

మిగతా 5వ పేజీలో...

డీఏ పెరిగింది 5

- 3.668% పెంచుతూ ఉత్తర్వులు
- యూజీసీ వేతన జీవులకు 7% పెంపు
- జీపీఎఫ్ ఖాతాలోకి ఏడాది బకాయిలు
- సెప్టెంబరు డీఏ అక్టోబరు వేతనంతో

సులువుగా ఇసుక

- విధానం సరళీకరణ!.. ధరల ఖరారు 6
- లోడింగ్, రవాణా, అన్‌లోడింగ్‌కు ఒకే ధర
- లారీలపై పోలీసు అజమాయిషీకి చెక్



దాంపత్యం 'పచ్చ'గా

నరసన్నపేట: శ్రీకాకుళం జిల్లా నరసన్న పేట మండలం కొల్లవానిపేటలో నూతన వధూవరులు వివాహానికి వచ్చిన వారికి మొక్కలు అందించారు. శుక్రవారం గ్రామానికి చెందిన చంద్రబాబునాయుడు, మీనాక్షిల వివాహం జరిగింది. దీనికి వచ్చిన బంధు, మిత్రులకు నూతన జంట ఒక్కో మొక్కను బహూకరించింది. తమకు కానుకలొద్దని.. వాటిని సంరక్షించి రక్షించాలని కోరింది.

మంటల్లో అపూర్వ టెక్స్‌టైల్స్

చిత్తూరు క్రైం, ఆగస్టు 11: చిత్తూరు చర్చివీధిలో ఉన్న అపూర్వ టెక్స్‌టైల్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు రూ.8 కోట్ల ఆస్తినష్టం జరిగింది. టెక్స్‌టైల్స్ భవనాన్ని ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై వీధిలో కట్టిన బ్యానర్ ఒకటి శుక్రవారం రాత్రి పడిపోవడంతో షార్ట్ సర్క్యూట్ జరిగిందని చెబుతున్నారు. దీంతో మంటలు రేగి అపూర్వ టెక్స్‌టైల్స్‌పై పడడంతో ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేసేలోపే రెండంతస్తుల భవనంలో ఉన్న వస్త్రాలు పూర్తిగా దగ్ధంకాగా, భవనం కూడా నేలమట్టమైంది. టెక్స్‌టైల్స్ ప్రహరీ గోడ విరిగి పూలమార్కెట్ షెడ్‌పై పడడంతో అది కుప్పకూలిపోయింది.



లోకం తీరు



మీరు కూడా విదేశాల్లోకన్నా స్వదేశంలో ఎక్కువ రోజులు ఉంటే బాగుందని అనుకుంటున్నారట సార్!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
శ్రీకాకుళం	22.0	35.0
హైదరాబాద్	22.8	32.4
కడప	24.0	35.0
ఏలూరు	24.0	33.0
గుంటూరు	25.0	32.5
అనంతపురం	25.1	33.2
విజయవాడ	25.4	32.0
కర్నూలు	25.6	33.9
రాజమండ్రి	26.0	34.5
విజయనగరం	26.0	32.0
ఒంగోలు	26.4	35.4
నెల్లూరు	27.0	35.9
విశాఖపట్నం	27.0	34.6
చిత్తూరు	27.0	33.2

కిడ్నాప్ చేసి చంపేశారా?!

- ముంబైలో అదృశ్యమైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
- కృష్ణానదిలో తేలిన మృతదేహం



విజయవాడ/వన్‌టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబంలో పుట్టాడు. అష్టకష్టాలు పడి బీటెక్ పూర్తి చేశాడు. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో కొలువు దక్కించుకున్నాడు. అయితే, ఈ ఆనందాన్ని అనుభవించేలోపే మృత్యు ఒడిని చేరిపోయాడు. ఈ ఘటనతో ఆ యువకుని తల్లిదండ్రులు హతాశులయ్యారు. ముంబైలో కనిపించకుండా పోయిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. సిల్వెంట్ సొంకత్లే(26) విజయవాడలో కృష్ణా నదిలో శవమై కనిపించాడు. అక్కడ అదృశ్యమై.. ఇక్కడ శవమై తేలిన సొంకత్లే ఘటన కన్నీరు పెట్టించింది. వివరాలు.. మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన మల్లికార్జున సొంకత్లే కూలీ. నిరుపేద కుటుంబమైనప్పటికీ తన కుమారుడు సిల్వెంట్‌ను బీటెక్ వరకు చదివించాడు. ఇంజనీరింగ్ పూర్తిచేసిన సిల్వెంట్ ముంబైలోని నిమ్రాటెక్ కంపెనీలో ఇటీవలే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సంపాదించాడు. కొడుక్కి ఉద్యోగం రావడంతో తన కష్టాలన్నీ తీరిపోతాయనుకున్నాడు. అయితే, ఇంతలోనే విధి వక్రించింది! విధులకు వెళ్లిన సిల్వెంట్ ఈ నెల 7 నుంచి కనిపించకుండా పోయాడు. దీనిపై అతడి స్నేహితుడు వర్సీ, కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ఇదిలావుంటే, కనిపించకుండా పోయిన రెండు రోజుల తర్వాత ఈ నెల 9న సిల్వెంట్ తనను ఎవరో నలుగురు వ్యక్తులు కిడ్నాప్ చేశారంటూ స్నేహితుడి సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపాడు. దీంతో పోలీసులు ఈ కిడ్నాప్‌ను ఛేదించే పనిలో పడ్డారు. కాగా, మహారాష్ట్రలో అదృశ్యమైన సిల్వెంట్.. గురువారం రాత్రి 12 గంటల సమయంలో విజయవాడలోని కృష్ణా నదిలో శవమై తేలాడు. విషయం తెలిసిన విజయవాడ వన్‌టౌన్ పోలీసులు మృత దేహాన్ని వెలికి తీసి.. జేబులో ఉన్న ఏటీఎం, ఆధార్‌కార్డు ఆధారంగా సిల్వెంట్‌ను గుర్తించారు.

ఒక్క రూపాయీ మాఫీ చేయలేదు: జైట్లీ

న్యూఢిల్లీ, ఆగస్టు 11: కార్పొరేట్లు తీసుకున్న బ్యాంకు రుణాల్లో కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. అలాగే.. 2014 నుంచి రైతు రుణాలు మాఫీ చేయడానికి ఎలాంటి కేంద్ర పథకమూ లేదని ఆయన తేల్చి చెప్పారు. కార్పొరేట్ల రుణాలు మాఫీ చేసిన కేంద్రం... రైతు రుణాలను మాత్రం మాఫీ చేయలేదని కాంగ్రెస్ సభ్యుడు భూపేందర్ సింగ్ హుడా చేసిన ఆరోపణలను జైట్లీ తిప్పికొట్టారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తూ.. లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రుణాల మాఫీపై ప్రతిపక్షం పూర్తి సమాచారం తెలుసుకుని మాట్లాడాలని జైట్లీ సూచించారు. రుణాల మాఫీ అనేది బ్యాంకుల వాణిజ్యపరమైన విషయమన్నారు. రైతు రుణాల మాఫీ యోచన కేంద్రానికి లేదన్నారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, గ్రామీణ రంగాల్లో రూ.2.92 లక్షల కోట్ల పెట్టుబడి పెడతామని జైట్లీ ప్రకటించారు.

తిరుమలేశా.. ఏమిటీ రగడ!





కత్తులు దూస్తున్న మిరాశీ, సంభావన అర్చకులు

తిరుమల శ్రీ వేంకటేశ్వరుడి ఆలయంలో ఇనుప మెట్ల వంతెన ఏర్పాటు నిర్ణయంతో ఆలయ అర్చకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఈ వంతెన ఏర్పాటు ఆగమ శాస్త్ర సమ్మతమేనని సదరు శాస్త్ర నిపుణులతో కూడిన సలహాదారుల సంఘం ఏకగ్రీవంగా అభిప్రాయపడినప్పటికీ.. అందులోని అర్చక ప్రముఖులు పాత వివాదాలను మనసులో పెట్టుకుని సంబంధం లేని అంశాలపై పరస్పర విమర్శలకు దిగారు. ఇది కొత్తేమీ కాదు. సుదీర్ఘ కాలంగా రగులుతున్న విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి అంతే! ఇనుప మెట్ల వంతెన నిర్ణయంపై టీటీడీ వెనక్కి తగ్గడమే గాక.. ఇంతవరకు జరిగిన నిర్మాణాలను కూడా తొలగించింది. అయినా అర్చకుల విభేదాలు చల్లారే సూచనలు కనిపించడం లేదు.

- ఆగమం పేరుతో వివాదాలు
- నామాల తీరుపై రగడ.. పవిత్రోత్సవాలపైనా రచ్చ
- వీవీఐపీల సేవలో అర్చకులు

తిరుపతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 1987లో తిరుమల ఆలయంలో మిరాశీ వ్యవస్థను అప్పటి ఎన్టీఆర్ ప్రభుత్వం రద్దు చేసింది. అప్పటి దాకా ఆలయ పూజాకైంకర్యాల్లో ప్రధాన పాత్ర పోషిస్తూ, లడ్డూ ప్రసాదాల ఆదాయంలో వాటా పొందుతూ వచ్చిన మిరాశీ అర్చక కుటుంబాలు ఆగ్రహంతో రగిలిపోయాయి. కోర్టులో వ్యాజ్యాలు వేశాయి. 1996లో సుప్రీంకోర్టు మిరాశీ విధానానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం 4 మిరాశీ కుటుంబాలు అర్చక బాధ్యతల్లో కొనసాగుతున్నాయి. కోర్టు కేసులు నడుస్తున్న కాలంలో ఆలయ పూజా వ్యవహారాల బాధ్యతలు నిర్వహించిన అర్చకులను సంభావన అర్చకులని అంటారు. వారికి, మిరాశీ అర్చకులకూ నడుమ అప్పటి నుంచీ విభేదాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం తిరుమల ఆలయంలో మిరాశీ కుటుంబాలకు చెందిన అర్చకులు దాదాపు 30 మంది ఉన్నారు. సంభావన అర్చకుల సంఖ్య 50 వరకు ఉంటుంది. అర్చకులకు రోజువారీ విధుల కేటాయింపు.. ఎవరు ఎక్కడ విధులు నిర్వహించాలో నిర్ణయించడం వంటి అధికారాల విషయంలో ప్రధాన అర్చకుల మధ్య విభేదాలు ఉన్నాయి. ఆదాయం అధికంగా ఉండే వరాహస్వామి ఆలయం, బేడి ఆంజనేయస్వామి ఆలయం, తీర్థం, శఠారి ఇచ్చే ప్రదేశం వంటి చోట్ల తమవారికే అర్చక విధులు అప్పగిస్తున్నారని తరచూ టీటీడీ అధికారులకు పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటూ ఉంటారు. ఆచార సంప్రదాయాలను సరిగా నిర్వర్తించడం లేదంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల వాహన సేవల్లో అర్చక విధుల విషయంలోనూ రచ్చకెక్కుతున్నారు. వీఐపీలు, పారిశ్రామికవేత్తల దృష్టిలో పడేందుకు పోటీలు పడుతూ ఉంటారు. ప్రముఖుల కుటుంబాల్లోని వేడుకలకు హాజరై ఆశీర్వచనాలు అందిస్తుంటారు. దీనిపైనా పరస్పరం విమర్శలు చేసుకుంటూ ఉంటారు. అవసరమైనప్పుడల్లా ఆగమ శాస్త్రాన్ని అస్త్రంగా చేసుకుంటూ ఉంటారు. ఈ తలనొప్పి భరించలేక టీటీడీ అధికారులు కూడా వీరి వ్యవహారంలో పెద్దగా జోక్యం చేసుకోరు. ఇనుప మెట్ల వంతెన వ్యవహారంలో ఆగమానికి అవమానం జరిగిందంటూ చాపకింద నిప్పులు పరచినవారే.. బహిరంగంగా మాత్రం అంతా ఆగమానుసారమే జరిగిందంటూ ప్రకటనలివ్వడం గమనార్హం. అందరూ అనుకూలంగానే ఉన్నా టీటీడీ ఎందుకు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు? అంటే అసలు సమస్య ఇనుప మెట్లు కాదన్నమాట. అర్చకుల నడుమ నడుస్తున్న అనేకానేక ఆధిపత్య విభేదాలకు ఇది బయటకు కనిపించే కారణం మాత్రమే. ఇటువంటి వివాదాలు నిరంతరం పుట్టుకొస్తూ తిరుమల ప్రతిష్ఠకు భంగకరంగా పరిణమిస్తున్నాయి.

వేయి కాళ్ల మండపం...

మాడవీధుల విస్తరణలో భాగంగా అప్పటి ఈవో అజేయ కల్లం హయాంలో వేయి కాళ్ల మండపాన్ని కూల్చివేశారు. తిరిగి నిర్మించేందుకు నిధులు కూడా కేటాయించినా.. కోర్టు జోక్యంతో నిర్మాణం ఆగిపోయింది. త్రిదండి చిన జీయర్ స్వామి అప్పటి నుంచి టీటీడీ అధికారులపై ఆగ్రహంతో ఉన్నారు. ఆ మండపం నిర్మించే వరకు తిరుమలకు రానని శపథం కూడా చేశారు.

వెంకన్న సన్నిధిలో వివాదాలు

పవిత్రోత్సవాలపై రగడ..



నిరుడు ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా పవిత్రోత్సవాలు నిర్వహించారని.. కర్మ చేసిన వారు స్వామి కైంకర్యాల్లో ఎలా పాల్గొంటారని రమణ దీక్షితులు.. వైఖానస ఆగమ పండితుడు సీతారామాచార్యులపై మండిపడ్డారు. ఆయన ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. తన అత్తగారు చనిపోతే కర్మక్రియలు నిర్వహించానని, చనిపోయింది తన తల్లిదండ్రులు కాదు కనుక తనకు ఎలాంటి దోషం లేదని, అందుకే పవిత్రోత్సవాలకు అధ్యక్షత వహించానని సీతారామాచార్యులు వివరణ ఇచ్చారు. పైగా 13 రోజుల తర్వాత ఎలాంటి కార్యక్రమంలోనైనా పాల్గొనవచ్చనే ఆగమపండితుల సూచన మేరకు ఈ బాధ్యతలు చేపట్టానని లేఖ ద్వారా వివరించారు.

నామాల గొడవ..

జీయర్లు, అర్చకుల మధ్య ఎప్పటి నుంచో నామాల వివాదం కొనసాగుతోంది. వడగలై వర్గానికి చెందిన అర్చకులు శ్రీవారికి పూజలు చేస్తారు. వీరు 'యూ' ఆకారంలో ఉండే నామాన్ని ధరిస్తారు. అలాగే పూజలకు సహకరించే తెంగలై వర్గానికి చెందిన జీయంగార్లు 'వీ' ఆకారంలో నామాన్ని దిద్దుకుంటారు. తమ నామాన్నే శ్రీవారికి ధరింపజేయాలని ఇరు వర్గాలూ పట్టుబడుతుంటాయి. మధ్యే మార్గంగా రెండు నామాలకు సరిపడే విధంగా 'వై' రూపంలో నామాన్ని ఏర్పాటు చేశారు. అయినా 2015 శ్రీవారి అభిషేకం సేవలో స్వామివారి నుదుటిపై ఉన్న నామాన్ని యూ ఆకారంలోకి మార్చారని పెద్దజీయర్ స్వామి టీటీడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పట్లో ప్రధాన అర్చకుడు రమణదీక్షితులు కుమారుడిని నాలుగు నెలల పాటు విధుల నుంచి తొలగించారు. గతేడాది నవంబరులో కూడా నామాల్లో మార్పులు చేశారని జీయర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ముఖేశ్ అంబానీ కుమారుడి సేవలో..


నాలుగేళ్ల క్రితం రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ శ్రీవారి దర్శనార్థం తిరుమల వచ్చారు. ఆ సమయంలో ఆలయ ప్రధాన అర్చకుడైన రమణదీక్షితులు స్వయంగా అతిథి గృహానికి వెళ్లి ఆయన్ను వేదమంత్రాలతో ఆశీర్వదించడం వివాదాస్పదమైంది. వీవీఐపీల సేవలో ఆయన తరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. అంబానీ కుటుంబంతో తనకు మంచి స్నేహబంధం ఉండడం వల్లే వెళ్లి కలిశానని ఆయన చెప్పుకొచ్చారు.



నేత్రద్వారాలకు బ్రేక్

శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తుల రద్దీ పెరిగిపోతోందని, అందరికీ దర్శన భాగ్యం కల్పించడం కష్టమవుతోందని, ఈ నేపథ్యంలో నేత్రద్వారాల అంశాన్ని నాటి కార్యనిర్వహణాధికారి (ఈవో)గా ఉన్న ఎల్వీ సుబ్రహ్మణ్యం ప్రతిపాదించారు. మామూలుగా కులశేఖరపడి వరకు అనుమతిస్తే 25 వేల మందికి, లఘు దర్శనంలో రాములవారి మేడవరకు అయితే 50 వేల మందికి, మహాలఘులో జయ విజయుల వరకు అనుమతిస్తే 90 వేల మంది భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం కలుగుతుంది. అంతకన్నా ఎక్కువ మంది భక్తులు కొండకు వస్తే వారు నిరీక్షించకుండా నేత్ర ద్వారాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆలయంలో రెండు వైపులా గోడను పగులగొట్టి రెండు ద్వారాలు ఏర్పాటుచేస్తే అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని భావించారు. దీనిపై 2008లో ఓ సదస్సు కూడా నడిచింది. ఆగమ పండితులు గట్టిగా వ్యతిరేకించారు. ఆలయ ప్రాకారాన్ని పగులగొట్టి ద్వారాలు నిర్మించడం ఆగమ విరుద్ధమని తేల్చిచెప్పడంతో నేత్రద్వారాల ప్రతిపాదనకు తెరపడింది.

ఇంకా..



- శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలిలో ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేయాలని 2007లో అధికారులు ఆలోచించారు. ఈ విధానం అమలుచేస్తే ఎక్కువ మంది భక్తులకు దర్శనం కల్పించవచ్చని నిర్ణయించారు. ఆగమ పండితులు అభ్యంతరం తెలపడంతో ఆలోచన మొగ్గ దశలోనే ఆగిపోయింది.



- దిగువ తిరుపతి నుంచి తిరుమలకు రోప్ వే వేయాలని కూడా అనుకున్నారు. శేషాచలం కొండల్లో పవిత్ర మూర్తులు తపస్సు చేసుకుంటుంటారని, వారిపైగా ఇలాంటి నిర్మాణం మంచిది కాదని అభ్యంతరాలు రావడంతో అది కూడా వెనక్కి వెళ్లింది.



శరద్ యాదవ్‌ను బుజ్జగించే పనిలేదు

శరద్ యాదవ్‌ను బుజ్జగించే ప్రసక్తే లేదు. ఆయన నిర్ణయం ఆయన తీసుకోవచ్చు. పార్టీకి సంబంధించి ఇప్పటికే ఒక నిర్ణయం జరిగింది. బీజేపీతో పొత్తు నిర్ణయం నా ఒక్కడిదే కాదు. పార్టీ ఆమోదంతో తీసుకున్నది. శరద్ యాదవ్‌కు భిన్నమైన అభిప్రాయం ఉంటే.. స్వేచ్ఛగా ఎటువంటి నిర్ణయమైనా తీసుకోవచ్చు.

- బీహార్ సీఎం నితీశ్ కుమార్

సర్వదర్శనానికి 20గంటలు

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 80వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి 20గంటలు, దివ్యదర్శనానికి సుమారు 3గంటల సమయం పడుతోంది. ఆదివారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో శనివారం లాటరీ ద్వారా జారీచేసే సుప్రభాతం: 50, కల్యాణోత్సవం: 80టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆదివారం ఆర్జిత సేవలకు సంబంధించి శనివారం విజయాబ్యాంకులో మధ్యాహ్నం వరకు అందుబాటులో ఉండవచ్చు. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.

-ఆంధ్రజ్యోతి, తిరుమల

అమల్లోకి 'ఒహాయో' ఒప్పందం

- తొలుత రైట్ స్టేట్ వర్సిటీతో ఎంవోయూ: గంటా



అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని 'ఒహాయో' రాష్ట్ర ప్రభుత్వంతో గత ఏడాది నవంబరు 17న రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందం(ఎంవోయూ) అమల్లోకి రానుందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన ఈ ఒప్పందం మేరకు అక్కడి ప్రభుత్వం ఎంవోయూ అమలయ్యేలా చర్యలు చేపట్టిందని చెప్పారు. తొలుత ఈ ఒప్పందం రైట్ స్టేట్ యూనివర్సిటీలో అమలవుతుందని, అనంతరం ఇతర అన్ని వర్సిటీలు విడివిడిగా ఒప్పందం చేసుకుని అమలు చేస్తాయని తెలిపారు. ఉన్నత విద్య సలహాదారు డాక్టర్ వెంకట్ ఈదర, అమెరికాలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి కోమటి జయరాం తదితరులతో కలిసి శుక్రవారం విజయవాడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒహాయో స్టేట్ విద్యార్థులతో సమానంగా మన రాష్ట్ర విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ కల్పించాలన్నది ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఒహాయో రాష్ట్రంలో మొత్తం 272 వర్సిటీలు ఉన్నాయని, ఉన్నతవిద్య కోసం ఆ రాష్ట్రానికి వెళ్లే మన విద్యార్థులకు భారీగా ఆర్థిక స్వాంతన లభించనుందని మంత్రి గంటా తెలిపారు. అక్కడ ఉన్నత విద్యా కోర్సుల్లో చేరే మన విద్యార్థులకు మొత్తం ఫీజులో 75 శాతం రాయితీ లభిస్తుందని వివరించారు. అక్కడ ఉన్నత విద్యను అభ్యసించే మన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు సాయం చేస్తుందన్నారు. కాగా, విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో ఏర్పాటుచేసిన, త్వరలో ఏర్పాటయ్యే మొత్తం 17 ఉన్నత విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.670 కోట్లు ఖర్చు చేస్తుందని మంత్రి గంటా వెల్లడించారు.

80% సంతృప్తి!

- పథకాలు వినియోగించుకుంటున్న కాపులు
- 83శాతం మందికి బ్యాంకు రుణాలు
- రెండేళ్ల అమలుపై సెర్ప్ సర్వేలో వెల్లడి



అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్థికాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన స్వయంఉపాధి పథకాన్ని కాపులు సద్వినియోగం చేసుకుంటున్నారు. 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరాల్లో పథకాల వినియోగంపై సెర్ప్‌తో చేయించిన సర్వేలో 80శాతం సంతృప్తి వ్యక్తమైంది. కాపు కార్పొరేషన్ ద్వారా లబ్ధిపొందిన వారిలో ఎక్కువ శాతం మంది నిధులను సద్వినియోగం చేసుకుని, తద్వారా ఆర్థికస్థితిని మెరుగుపరుచుకునేందుకు వివిధ రకాల స్వయంఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. కార్పొరేషన్ రాయితీతో పాటు బ్యాంకు రుణాలు కూడా అందాయని 83శాతం వెల్లడించారు. కాగా పొందిన లబ్ధికి అనుగుణంగా ఇంకా 20శాతం మంది యూనిట్లు ఏర్పాటు చేయలేదు.

ఇవీ సర్వే వివరాలు...

- 2016-17 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 58వేల మందికి లబ్ధి చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో మార్చి వరకూ 30,368 మందికి కాపు కార్పొరేషన్ రాయితీలు మంజూరు చేసింది. వాటిపై చేపట్టిన సర్వేలో... ఇప్పటివరకు 20,066 యూనిట్లకు జియోట్యాగింగ్ చేయగా... 16,800(81శాతం) మంది నిధులు సద్వినియోగం చేసుకుని యూనిట్లు ప్రారంభించుకున్నారు. అయితే ఇందులో 16,261(83శాతం) మందికి బ్యాంకు రుణాలు అందాయి.
- మొత్తంగా రెండేళ్లలో సుమారు 80శాతం మంది స్వయంఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. స్వయం ఉపాధిలో ఎక్కువ మంది పశుసంవర్థక విభాగంలో యూనిట్లు పెట్టుకున్నారు. గేదెలు, మేకలు కొనుగోలు చేసి తద్వారా ఉపాధి పొందేందుకు ఆసక్తి చూపించారు. 22,405 మంది ఈ రంగంలో యూనిట్లు ఏర్పాటుచేసుకున్నారు.
- 2017-18 ఆర్థిక సంవత్సరంలో 64వేల మందికి స్వయం ఉపాధి కింద లబ్ధి చేకూర్చాలని కాపు కార్పొరేషన్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. మొత్తం రూ.1280కోట్ల లబ్ధి పేదలకు చేరుతుంది. అందులో సగం కార్పొరేషన్ రాయితీ ఇస్తే, మరో సగం బ్యాంకులు రుణాలు మంజూరుచేస్తాయి. ఈ నెల 15 నాటికి లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి, సెప్టెంబరు 15 నుంచి నిధుల మంజూరు ప్రక్రియ చేపడుతుంది. సెప్టెంబరు నెలాఖరులోగా లబ్ధిదారులు యూనిట్లు ప్రారంభించాల్సి ఉంటుంది.

గడువులోగా ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- విద్యుత్ ప్రాజెక్టుల జాప్యంపై సీఎస్ ఆగ్రహం

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో సేకరించే వ్యర్థాల నుంచి విద్యుత్, సేంద్రియ ఎరువుల తయారీకి సంబంధించిన ప్రాజెక్టులను గడువులోపు పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ పురపాలక, నగర పాలక సంస్థల పరిధిలో నెలకొల్పనున్న 63 మెగా వాట్ల విద్యుత్ ప్రాజెక్టు పనుల్లో జాప్యం చోటు చేసుకుంటుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ ప్రాజెక్టులకు అవసరమైన స్థలాన్ని గుర్తించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒప్పందం ప్రకారం గడువులోపు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రాజెక్టులు నెలకొల్పనున్న ప్రాంతాలు మినహాయించి మిగిలిన పురపాలక సంఘాల్లో వ్యర్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేసే కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పురపాలక సంఘాల పరిధిలో తీసుకువచ్చిన సంస్కరణలు, అమలుపై సీఎస్ సంతృప్తి వ్యక్తం చేశారు. బాగా పని చేసే ఉద్యోగులకు సీఎం, మంత్రులు, ఉన్నతాధికారుల చేతుల మీదగా అవార్డులు అందజేస్తామన్నారు.



బి3 విటమిన్‌తో చర్మ క్యాన్సర్‌కు చెక్!

న్యూయార్క్: ప్రమాదకరమైన చర్మ క్యాన్సర్ 'మెలనోమా' చికిత్సకు విటమిన్ థెరపీ సమర్థంగా పనిచేస్తుందని ఓ పరిశోధనలో తేలింది. 'విటమన్ బి3' ఉపయోగించి 'మెలనోమాను' అరికట్టవచ్చని యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ పరిశోధకులు కనుగొన్నారు. యూవీ కిరణాల వల్ల చర్మం ఇన్ఫెక్షన్‌కు గురి కాకుండా, డీఎన్‌ఏ దెబ్బతినకుండా విటమిన్ బి3లోని 'నికోటినమైడ్' అడ్డుకుంటుందని వారి పరిశోధనలో తేలింది. రోజుకు ఒక గ్రాము చొప్పున నికోటినమైడ్‌ను తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. యూవీ రేడియోధార్మికత వల్ల చర్మ లోపలి పొరలో ఉండే మెలనోసైట్‌లోని డీఎన్‌ఏ దెబ్బతింటుంది. ముఖ్యంగా మెలనోమా క్యాన్సర్ రోగులకు ఈ 'నికోటినమైడ్' చాలా ఉపయోగకారిగా ఉంటుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అప్పన్న ఆస్తులకు ఎసరు!

ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో రూ. 100 కోట్ల విలువైన 14 ఎకరాలు

- ఇనాం హక్కుదారుగా సింహాచల దేవస్థానం
- పట్టించుకోకుండా ప్రైవేటు వ్యక్తుల పేరిట రైత్వారీ పట్టా
- సిట్‌కు దేవస్థానం అధికారుల ఫిర్యాదు




రైత్వారీ పట్టాను మంజూరు చేసిన సింహాచలం దేవస్థానం భూమి

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న భూములకు రైత్వారీ పట్టాలు మంజూరు చేసిన ఇనాం అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేపగుంటలో ఏకంగా 14 ఎకరాల దేవస్థానం భూమిని రెవెన్యూ అధికారులు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. ఈ వ్యవహారాన్ని గుర్తించిన దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. ఆర్డీవోకు అప్పీల్ చేసుకున్నా.. ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగానే ఆదేశాలు ఇచ్చారు. ఈ మొత్తం వ్యవహారంలో భారీగా సొమ్ములు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా భూ కుంభకోణాలపై దర్యాప్తు చేస్తున్న సిట్‌కు దేవస్థానం అధికారులు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.100 కోట్ల విలువ చేసే ఈ భూ వ్యవహారానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వేపగుంట రెవెన్యూ పరిధి సర్వే నంబరు 30లో దేవస్థానానికి భూమి వుంది. అందులో 14 ఎకరాలు ఒక మహిళ పేరిట ఇనాం స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ రైత్వారీ పట్టాను 2013లో మంజూరు చేశారు. వాస్తవానికి సింహాచలం దేవస్థానానికి పంచ గ్రామాలైన అడవివరం, వేపగుంట, వెంకటాపురం, పురుషోత్తపురం, చీమలాపల్లిలో 9069.22 ఎకరాల భూములున్నాయి. 1996లో రైత్వారీ పట్టాను దేవస్థానానికి మంజూరు చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి నివాసం వుంటున్న వారి స్థలాలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఈ వివాదం ప్రస్తుతం హైకోర్టులో ఉండడంతోపాటు, ఇనాం బీ రిజిస్టర్‌లో దేవస్థానం ఇనాందారుగా ఉన్న స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి పేరిట రైత్వారీ పట్టాను మంజూరు చేశారు. విషయం తెలుసుకున్న దేవస్థానం అధికారులు అదే ఏడాది రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌కు అప్పీల్ చేశారు. సుమారు నాలుగేళ్లపాటు నడిచిన ఈ వ్యవహారంలో ఇనాం బీ రిజిస్టర్‌ను పరిశీలించకుండా దేవస్థానం అప్పీల్‌ను ఆర్డీవో ఈ ఏడాది జూన్‌లో డిస్మిస్ చేశారు. అడ్డగోలుగా పట్టాలు మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కు ఫిర్యాదు చేశారు.

రూ.100 కోట్ల భూమికి స్కెచ్

వేపగుంట ప్రాంతంలో గజం ధర రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంది. ప్రస్తుతం పట్టాలు మంజూరైన స్థలం. సమీపంలోనే బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ ప్రాజెక్టు పనులు జరుగుతుండడంతో భవిష్యత్తులో ఈ భూముల విలువ మరింత పెరిగే అవకాశం ఉంది. వీటన్నింటినీ దృష్టిలోపెట్టుకునే రూ.100 కోట్ల విలువైన భూమికి పక్కాగా స్కెచ్ వేసినట్టు స్పష్టమవుతోంది. ఈ వ్యవహారంపై సిట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



23నుంచి తిరుచానూరులో చండీ యాగం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 11: నవ్యాంధ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ శ్రీ అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 28 వరకు తిరుచానూరు శిల్పారామంలో శతచండీ యాగం నిర్వహిస్తున్నట్టు ఆశ్రమ పీఠాధిపతి శివానందలహరిస్వామి రాజమహేంద్రవరంలో తెలిపారు.

• 28న రాష్ట్రానికి రానున్న అమిత్ షా

భీమవరం, ఆగస్టు 11 : బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఈ నెల 28, 29, 30 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీజేపీ సమన్వయకర్త పురిఘళ్ళ రఘురామ్ చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ మరింత పటిష్ఠం కావడానికి నరేంద్రమోదీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఉపకరిస్తున్నాయని చెప్పారు. భీమవరం వచ్చిన రఘురామ్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. విజయవాడలో అమిత్‌షాకు ఘనస్వాగతం పలికే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

• 90 శాతం సబ్సిడీతో లింగాకర్షక బుట్టలు

అమరావతి: నాలుగేళ్లుగా పత్తి రైతులను వేధిస్తున్న గులాబీ రంగు పురుగును నిర్మూలించేందుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. వీటి నివారణకు లింగాకర్షక బుట్టలను 90శాతం సబ్సిడీపై పంపిణీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 4.43 లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతోంది. ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలను ఇవ్వనున్నారు. ఈ పురుగు ఉధృతిని బట్టి తొలి విడతలో 6 లక్షల ఫెరమోన్‌ట్రాప్స్‌ను సిద్ధం చేస్తున్నారు.

• వినూత్న ఆవిష్కరణలు చేపట్టండి: డీజీపీ

తాడేపల్లి, ఆగస్టు 11 : సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని డీజీపీ సాంబశివరావు చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో రెండు రోజులపాటు జరుగనున్న యాంత్రిక్-2017 సాంకేతిక ఉత్సవాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచం వేగంగా ముందుకు వెళుతోందని.. దానికి అనుగుణంగా విద్యార్థులు ఆలోచనలు పెంపొందించుకోవాలని సూచించారు.

పలు జిల్లాల్లో భారీ వర్షం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో పలు జిల్లాలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. తూర్పుగోదావరి, విజయనగరం, గుంటూరు జిల్లాల్లో పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ, రాజమహేంద్రవరంలో గంటకుపైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, తుని, కోటనందూరు, రాజానగరం, రంగంపేట, మండపేట మండలాలలో పంటలకు సరిపడా వర్షం కురిసింది. విజయనగరం జిల్లాలో విజయనగరం, పార్వతీపురం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, బొబ్బిలి, సాలూరు, గజపతినగరం, నెల్లిమర్ల, ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. శృంగవరపుకోట, పూసపాటిరేగ మండలాల్లో భారీ వర్షం కురిసింది. గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం 8 గంటల వరకు 36 మండలాల్లో 6.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆనందం వ్యక్తం చేసిన రైతులు



తూర్పు గోదావరి జిల్లా మండపేటలో వర్షం కురుస్తున్న దృశ్యం

ఘనంగా శిద్దా షష్టి పూర్తి వేడుకలు



శిద్దాకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి నారాయణ

ఒంగోలు: రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు షష్టిపూర్తి వేడుకలు శుక్రవారం ఒంగోలులో ఘనంగా జరిగాయి. గుంటూరు రోడ్‌లోని ఏ1 కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, శిద్దా అభిమానులు భారీగా తరలివచ్చారు. శిద్దా రాఘవరావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు జవహర్, నారాయణ, అయ్యన్నపాత్రుడు, పత్తిపాటి, గంటా, రవీంద్ర, దేవినేని, సుజయ్‌కృష్ణ, ఆనంద్‌బాబు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నటులు నందమూరి హరికృష్ణ, గిరిబాబు తదితరులు శిద్దా దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటికో కలాం, వివేకానందుడిని ఇవ్వండి

- జ్ఞానం కోసమే చదువు: లక్ష్మీనారాయణ



హిందూపురం, ఆగస్టు 11: తల్లిదండ్రులు పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది ప్రతి ఇంటి నుంచి ఒక అబ్దుల్‌కలాం, వివేకానందుడిని పంపితే దేశం రూపురేఖలు మారతాయని మహారాష్ట్ర అదనపు డీజీపీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా హిందూపురంలో ఓ ప్రైవేట్ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రుల, గురువుల భూమికపై సుదీర్ఘంగా ప్రసంగించారు. ఎక్కడ పుట్టామన్నది కాదని ఏస్థాయికి ఎదిగామన్నది ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థిలో శక్తి, భయం ఉంటుందని భయాన్ని వీడి శక్తిని బయటపెడితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు విద్యను మార్కుల కోసం కాకుండా సంస్కారం కోసం చదవాలన్నారు. అక్షరం శాశ్వతమని పిల్లలకు మాతృభాషను నేర్పాలని సూచించారు.

• జీవో 64పై అగ్రి వర్సిటీ వీసీ వివరణ

అమరావతి, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): జీవో 64పై వ్యవసాయ విద్యార్థులు ఆందోళన విరమించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వల్లభనేని దామోదరనాయుడు కోరారు. జీవో 64పై రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ బీ రాజశేఖర్‌తో శుక్రవారం చర్చించిన తర్వాత వీసీ ఒక ప్రకటన విడుదల చేశారు. నాలుగు సంవత్సరాల బీఎస్సీ (అగ్రి) డిగ్రీ కోర్సు అక్రిడేషన్ వ్యవహారం భారత వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐసీఏఆర్) ఆధ్వర్యంలో జరిగేదని.. ఇక నుంచి ఐసీఏఆర్ అందించే సమాచారం ప్రకారం ఐసీఏఆర్ అక్రిడేషన్ తప్పనిసరి కాదని చెప్పారు.

ఆరోగ్య రంగంలో బయోటెక్నాలజీ కీలకం

- స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సంజయ్ మల్హోత్రా

విశాఖ సిటీ, ఆగస్టు 11: ఆరోగ్య రంగంలో భవిష్యత్‌లో బయోటెక్నాలజీ కీలక పాత్ర పోషించనుందని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. గీతం విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ సంయుక్తంగా రెండు రోజులపాటు నిర్వహించిన ఏపీ బయో-2017 అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ప్రొఫెసర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. భారతదేశంలో వైద్యానికయ్యే వ్యయాన్ని తగ్గించడానికి బయోటెక్నాలజీ పరిశోధనలు ఆధారం కానున్నాయని తెలిపారు.

• ఆస్ట్రేలియా ఎన్నికల్లో తెలుగువారు

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్ రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు తెలుగువారు పోటీచేస్తున్నారు. కంబర్ లాండ్ కౌన్సిల్‌లో వెంట్‌వర్త్ విల్లే వార్డులో మహిళా అభ్యర్థి శశి పోటీచేస్తున్నారు. పరామట కౌన్సిల్‌లో పరామట వార్డులో పిల్లమర్రి శ్రీని పోటీచేస్తున్నారు. వీరిద్దరూ స్వతంత్ర అభ్యర్థులు. స్ట్రాత్ ఫీల్డ్ కౌన్సిల్‌లో దక్షిణ స్ట్రాత్ ఫీల్డ్ వార్డులో మరో మహిళా అభ్యర్థి అబ్బినేని శ్రావ్య లేబర్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

కాపులకు ముద్రగడే ప్రతినిధి కాదు

- ఆయన జగన్ చేతిలో కీలుబొమ్మ: గంటా, నారాయణ

అమరావతి/ఒంగోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాపులకు ముద్రగడ పద్మనాభం ఒక్కరే ప్రతినిధి కాదని మానవ వనరుల మంత్రి గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఆయన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ చేతిలో కీలుబొమ్మగా మారారని పురపాలక మంత్రి పి.నారాయణ ధ్వజమెత్తారు. నా జాతి అంటూ మాట్లాడుతున్న ముద్రగడకు.. గత ఎన్నికల్లో 75 వేల మంది కాపు ఓటర్లలో కేవలం 5 వేల ఓట్లే ఎందుకు వచ్చాయని గంటా శుక్రవారం సచివాలయంలో ప్రశ్నించారు. చినరాజప్పకు డిప్యూటీ సీఎం పదవి, రామానుజయ చైర్మన్‌గా కాపు కార్పొరేషన్ ఏర్పాటు, కాపులను బీసీల్లో చేర్చేందుకు జస్టిస్ మంజునాథ కమిషన్ ఏర్పాటు ఎన్నికల హామీల్లో భాగమేనన్నారు. 2004 నుంచి 2014 మధ్య ప్రభుత్వాలను కాపు రిజర్వేషన్ కోసం ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు.

విజయవాడలో రాయల శాసనం



శాసనాన్ని పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి తదితరులు

విజయవాడ కల్చరల్, ఆగస్టు 11 : విజయవాడ నగర శివారులోని తాడిగడపలో శ్రీకృష్ణ దేవరాయల కాలం నాటి తెలుగు శిలా శాసనం బయల్పడింది. తాడిగడప సీతారామాంజనేయ స్వామి ఆలయం వద్ద రోడ్డు పక్కనే ఉన్న ఈ శాసనాన్ని విజయవాడ కల్చరల్ సెంటర్ బృందం శుక్రవారం పరిశీలించింది. రాయల పాలనలో ఉన్న కొండపల్లి రాజ్య దండనాయకుడు రాసం కొండ మరుసయ్య తన తల్లి జ్ఞాపకార్థం 1518వ సంవత్సరంలో ఇక్కడ బావిని తవ్వించారు. ఆ సందర్భంగా తెలుగులో ఈ శిలాశాసనం వేయించారని కల్చరల్ సెంటర్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి వివరించారు. ఈ విషయాన్ని తాను రచించిన 'శ్రీకృష్ణ దేవరాయల తెలుగు శాసనసభ' పుస్తకంలో ప్రస్తావించానని ఆయన చెప్పారు. విషయం తెలిసినా శాసనం ఎక్కడ ఉందనే విషయం తనకు ఇప్పటి వరకు తెలియదన్నారు. తెలుగులో ఉన్న ఈ శాసనాన్ని చూసి స్థానికులైన మేడసాని శుభకర్, మామిళ్లపల్లి దీప్తి సమాచారం ఇవ్వడంతో దీనిని గుర్తించగలిగామని ఆయన చెప్పారు.

ముప్పవరపు వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ అధ్యక్షుడిగా పదవీబాధ్యతలు స్వీకరించడం అందరి అభినందనల మధ్య సందడిగా జరిగింది. క్రియాశీల రాజకీయాలలో తలమునకలుగా, నిత్యకోలాహలంగా ఉండిన వెంకయ్యకు ముందరికాళ్లకు బంధంగా నూతన పదవి పరిణమిస్తుందేమోనని శ్రేయోభిలాషులు ఆందోళన చెందారు కానీ, చొరవా చురుకుదనమూ ఉన్నవారు ఏ పదవిలో ఉన్నా రాణించగలరని ఆరంభంలోనే ఆయన నిరూపించుకున్నారు. రాజ్యసభలో అధ్యక్ష స్థానం అధిరోహించినవెంటనే, సభ్యుల ఆహ్వానాలను ప్రశంసలను అందుకుంటూనే , వెంకయ్య సభానిర్వహణలో తన ప్రాధాన్యాలను, సభ్యుల నడవడికి సంబంధించి విధినిషేధాలను తనదైన శైలిలో, సరసమైన భాషలో స్పష్టం చేశారు. బలమైన ప్రతిపక్షమున్న పెద్దల సభలో, హద్దుమీరేవారికి నియమాల ఉద్బోధ చేయగలిగిన పెద్దరికమూ, అవసరమైతే కఠినంగా వ్యవహరించగలిగిన నిర్వహణాసామర్థ్యమూ వెంకయ్యనాయుడుకు ఉన్నాయి.

ఉపరాష్ట్రపతి పదవిని ప్రజలలోకి తీసుకువెడతానని వెంకయ్యనాయుడు అన్నారు. అంటే, గంభీరంగా, సదస్సులకు, విదేశపర్యటనలకు మాత్రమే పరిమితమవుతూ అనామకంగా ఉండిపోయే ధోరణి తనది కాదని, ప్రజలల్లో నిత్యం మెలుగుతూ పదవికి కొత్త నిర్వచనం ఇస్తానని ఆయన సూచిస్తున్నారు. గతంలో ఉపరాష్ట్రపతి పదవిలో క్రియాశీలంగా మెలగినవారు లేరని కాదు. తత్వశాస్త్ర వేత్తా, విద్వాంసుడూ అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రజాజీవితం నుంచి రాకపోయినా, నవ స్వతంత్ర భారతదేశంలో ఉపరాష్ట్రపతిగానూ, తరువాత రాష్ట్రపతిగానూ కీలకమయిన సందర్భాలలో ప్రభావశాలిగా వ్యవహరించారు. పదేళ్లపాటు ఉపరాష్ట్రపతిగా ఉండి, పదవీకాలం ముగించుకున్న హమీద్ అన్సారీ కూడా అనేక పరిమితుల మధ్య క్రియాశీలంగా వ్యవహరించారు. రాధాకృష్ణన్‌కు, అన్సారీకి చాలా పోలికలున్నాయి. ఇద్దరూ విద్యావేత్తలు, మేధావులు. వృత్తిపరంగా దౌత్యవేత్త కాకపోయినా, రాధాకృష్ణన్ అన్సారీ లాగానే కీలకమైన దేశాలలో రాయబారి బాధ్యతలు నిర్వహించారు.

పదవీకాలం ముగియడానికి ఒకరోజు ముందు అన్సారీ రాజ్యసభ టీవీకి ఇంటర్వ్యూ ఇస్తూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయమయ్యాయి. ముస్లిములు దేశంలో అభద్రతాభావంలో ఉంటున్నారని కరణ్ థాపర్ వేసిన ప్రశ్నకు జవాబుగా అన్సారీ అన్నారు. ఆయన ఈ మాట అనడం ఇదే మొదటి సారి కాదు. గత మూడేళ్ల కాలంలో అన్సారీ ఇటువంటి

భద్రత, అభద్రత

వ్యాఖ్యలు ఒకటిరెండు సార్లు చేశారు. ఉపరాష్ట్రపతి అని కూడా పరిగణన ఇవ్వకుండా అధికారపార్టీ నేతలు ఆయనను విమర్శించడం కూడా గతంలో జరిగింది. అన్సారీ పదేళ్ల కాలంలోని చివరి మూడేళ్లు, అంటే, ఎన్‌డిఎ హయాం లో ఆయనకు, ప్రభుత్వానికి మధ్య మంద్రస్థాయి చిటపటలు కొనసాగాయి. సుప్రసిద్ధమైన జాతీయవాద కుటుంబంలో జన్మించిన అన్సారీ, ఆధునిక ప్రగతిశీల భావాలు కలిగిన లౌకికవాది. ఆయన దేశంలోని మతతత్వ ధోరణులను నిరసించినప్పుడు, ఆయననే మతవాదిగా చిత్రించే ప్రయత్నం జరిగింది. కానీ, దేశంలో లౌకికవాదానికి ప్రమాదం ఏర్పడినప్పుడు, అది కాంగ్రెస్ హయాం అయినా సరే, ఆయన స్పష్టంగానే గొంతెత్తారు. జాతీయోద్యమకాలపు ఆదర్శాలను, నెహ్రూతరహా ఆధునికతనీ ఇష్టపడే అన్సారీ సహజంగానే దేశ, విదేశాంగ వ్యవహారాలలో వస్తున్న మార్పులను హర్షించలేకపోయారు. అది అణ్వస్త్రాల విషయంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా భారత్ ఓటువేయడం కావచ్చు, గోరక్షణ పేరుతో వీధుల్లో హత్యలు చేయడం కావచ్చు, ఆయన నిక్కచ్చిగానే ఉన్నారు.

ఉపరాష్ట్రపతి అట్లా వ్యాఖ్యలు చేయవచ్చా అన్న ప్రశ్న సరి అయినది కాదు. దేశహితానికి అవసరమని భావించే అంశం ఏదైనా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి కూడా మాట్లాడవలసిందే. ప్రధానమంత్రులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నప్పుడు రాష్ట్రపతిభవనం నుంచి ఏదైనా స్పందన ఉంటే బాగుండని దేశప్రజలు ఎదురుచూసిన సందర్భాలు గతంలో ఎన్ని లేవు? అన్సారీ వ్యాఖ్య పొరపాటు అయితే, దానికి బదులుగా వెంకయ్య స్పందన కూడా పొరపాటే అవుతుంది. అన్సారీ అభద్రత వ్యాఖ్య పాలనాయంత్రాంగానికి ఒక హెచ్చరిక అయితే, వెంకయ్య స్పందన భారతీయ సమాజం మౌలిక ఘనతను చాటి చెప్పేది. ఇద్దరూ అసహనాన్ని కూడదంటున్నవారే. అన్సారీ వ్యాఖ్యలు ఎట్లున్నా, కేంద్రప్రభుత్వం వెంకయ్య స్పందనను సీరియస్‌గా తీసుకుని, భారతీయ విలువ అయిన సామరస్యాన్ని నిలబెట్టే ప్రయత్నం చేయాలి.

అన్సారీకి వీడ్కోలు చెబుతూ ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్యలు నర్మగర్భంగా ఉన్నాయని పత్రికలు రకరకాల కథనాలు రాశాయి. ప్రధాని స్థాయి వ్యక్తి, ఈ మీడియా అంటున్నట్టు, అంత తక్కువగా ప్రవర్తిస్తారా? సందేహమే. మేధావిగా, జాతీయవాదిగా అన్సారీ ఇక ముందు కూడా తన గొంతు విప్పుతూ ఉండాలని, ఎనిమిది పదుల వయస్సులో ఆయన ఇవ్వగలిగే సూచనలు విలువైనవని నరేంద్రమోదీ భావించి ఉంటారు. మోదీ ఆశించినట్టు, అన్సారీ స్వేచ్ఛగా భావప్రకటన చేయాలి.

ప్రథమ ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ సుప్రసిద్ధ సూక్తి– సహనమే సంస్కృతి. భారతీయ సంస్కృతి గొప్పదనాన్ని సూచించే విలువ సహనమే అని ఆయన అన్నారు. దేశాధినేతలు, ఉపనేతలు, ప్రభుత్వాధినేతలు ఆ ఉద్బోధను గౌరవించడమే కాదు, సువ్యవస్థితం చేస్తారని జాతి ఆశిస్తున్నది.

బాపూ మళ్లీ ఎప్పుడొస్తావు?

జాతీయోద్యమానికి ధ్వజమైన త్రివర్ణ పతాకంలో చే మగ్గానికి చిహ్నమైన రాట్నం (చరఖా)ను ప్రతిష్ఠించడం సమాజంలో చేనేత రంగం ప్రాధాన్యతను వ్యక్తీకరిస్తుంది. అలాంటి జెండా సారథ్యంలో స్వాతంత్ర్యం సిద్ధించడం చేనేతల అదృష్టం. జాతి పిత మహాత్మాగాంధీ చేనేత పరిశ్రమకు చేసిన సేవ అద్వితీయం. దేశంలో చేనేత వృత్తి పరిరక్షణకై అవిశ్రాంత పోరాటాలు చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య, అక్కల కోటయ్య, మాచాని సోమప్ప, కొండా లక్ష్మణ్ బాపూజీ వగైరా ఇంకా ఎందరో మహానుభావులున్నారు. వారందరికి నివాళులు.

దేశంలో కోట్లాది ప్రజలకు ఉపాధి కల్పించగల తారక మంత్రం నూలు వడుకుట, బీదవారి కోసం నూలు వడుకుట, ప్రతివాని పవిత్ర ధర్మం అని మహాత్మా గాంధీ అన్నారు. నేను భోజనం అయినా మానేస్తాను గానీ రాట్నం వదలను. నేను దానిపై నూలు వడకినప్పుడల్లా నాకు పేదలు జ్ఞాపకం వస్తారు. భారత దేశం వస్త్రానికి పుట్టినిల్లు. పాశ్చాత్య దేశాలకు నేత నేర్పింది. విదేశీ బాటసారులు మెగస్తనీసు, ఫాహియాన్, మార్కోపోలో, వార్నమా మొదలైన వారు భారత వస్త్ర పరిశ్రమను చూసి ప్రశంసించారు. ఉంగరంలో దూర్చుటకు వీలైన సన్నని బట్ట నేయగల పనివారున్నారని విదేశీ బాటసారులు తమ గ్రంథాల్లో రాసారు. ఔరంగజేబు కుమార్తె 7 పొరలతో చీరె ధరించి తండ్రి దగ్గరకు వస్తే నగ్నంగా కన్పించిందని కోపగించుకునే వారని చెబుతారు.

చేనేత రంగంలో 17 కులాల వారు వున్నారు. ఈ పరిశ్రమ 23 రాష్ట్రాలలో విస్తరించి యున్నది. ఇంతటి నైపుణ్యం గల ఉపాధి రంగాఋునికి భారత రాజ్యాంగం అధికరణ 43కు విరుద్ధంగా కేంద్ర పాలకులు చేనేతలు ఉపయోగించే ముడిసరుకు అయిన చిలపల నూలుపై 5 శాతం వస్తు సేవా పన్ను (జియస్‌టి) విధించారు. చేనేత చీరెలు, డ్రస్ మెటీరియల్, వస్త్రంపై ఎంబ్రాయిడరీ వర్కు, కుట్టిన డ్రస్ మెటీరియల్స్ విలువ రూ. 1000 లోబడిన వాటికి 5 శాతం పన్ను విధించారు. రూ. 1000 పైబడిన వస్తువులకు 12 శాతం సుంకం విధించడం అన్యాయం. నూలు అద్దకం వారు 18 శాతం కొనుగోలు చేసే రంగులు, రసాయనాల మీద 18 శాతం పన్ను, జాబ్ వర్కు ఉత్పత్తి దారునుకు రంగులు వేయడంపై 5 శాతం పన్ను విధించారు. చేనేత వస్త్ర ఉత్పత్తి దారుడు,

కేంద్రం అధికార బలంతో ఏకపక్షంగా ఆకలి చావులు ఆత్మహత్యలతో కుదేలవుతున్న చేనేత రంగంపై ఇంకా పన్నులు విధించి, దేశవ్యాప్తంగా మొత్తం 2 కోట్ల యాభై లక్షల కుటుంబాలను వీధుల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తోంది. తదుపరి మినహాయింపు చేయబడిన వస్తువుల జాబితాలో చేనేతను కూడా చేర్చారు. అయితే దీనికి ఉపయోగించే ముడిసరుకులపై ఏ ప్రభుత్వమూ పన్ను విధించరాదు.

కార్మికునకురు ఇచ్చు మజూరీని జాబ్ వర్కుగా పరిగణించి 5 శాతం పన్ను విధించడం సబబు కాదు. చేనేత వస్త్రాన్ని రవాణా పై 5 శాతం అదనంగా పన్ను వడ్డింపు కూడా చేనేత రంగాన్ని నిరుత్సాహపరిచనట్లే. చేనేత కుటీర పరిశ్రమలో పురాతన కాలం నుంచి భారతీయ సంస్కృతి, సాంప్రదాయంగాఋు ఉన్న పంచె, కండువా, చీరెలకు అంచు వుండి ధరించేందుకు వీలుగా జరీ వాడుతారు. అటువంటి జరీ బార్డరుతో తయారు చేయబడిన వస్త్రం పై పన్ను వేయడం సరికాదు. చేనేత వస్త్రానికి ఉపయోగించు జరీ దారాన్ని మెకానైజ్డ్ యార్న్‌గా పరిగణించి... గోల్డ్ జరీ, సిల్వర్ జరీ, ఇమిటేషన్ జరీ అని వీటిపై 12 శాతం సుంకం వేశారు. చేనేత వస్త్రానికి ఉపయోగించు పాలిస్టరు, సింథటిక్ యార్న్, ఇతర రకాల దారాల మీద 18 శాతం సుంకం విధించడం అన్యాయం. 2017 జూలై 1వ తేదీకి ముందు చేనేత రంగంలో వుపయోగించే ముడిసరుకు చిలపల నూలు, రంగులు, రసాయనాలు షెడ్యూల్ 1, సెక్షను 13(1)లో మినహాయింపు ఇచ్చిన వస్తువులు.... చేనేత ఉత్పత్తులు, గాంధీటోపి; నూలు, పట్టు చిరులపల రూపంలో వున్నవి; జాతీయ జెండా, రాఖీ; ముడి ఊలు, జనప నార; పట్టుగూళ్ళు, ముడిపట్టు; అన్ని రకాల జౌళి ఉత్పత్తులు మినహాయింపు జాబితాలో ఉన్నాయి.

చేనేత రంగం కుటీర పరిశ్రమలలో మేటి అని, ఈ రంగ ఉత్పత్తులు, ముడి సరుకు వగైరాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధమైన ప్రత్యక్ష, పరోక్ష పన్నులు వేయరాదని భారత రాజ్యాంగంలోని అధికరణ 43లో నిర్దేశితమైంది. ఇంకనూ కుటీర పరిశ్రమల సంరక్షణ, పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత అని చెప్పారు. కుటీర పరిశ్రమల సంరక్షణ, పరిరక్షణ ప్రభుత్వం బాధ్యతయని చెప్పబడింది. కుటీర పరిశ్రమలను సహకార, సహకారేతర సంస్థల ద్వారా పరిరక్షించాలి. ఇవన్నీ గ్రామీణ ప్రాంతంలో వున్నవే. పండిత జవహర్లాల్ నెహ్రూ నాయకత్వంలో ఏర్పడిన మొదటి ప్రణాళికా సంఘం చేసిన సిఫార్సులలో చేనేతలు ఉపయోగించే ముడిసరకు, ఉత్పత్తులపైన అమ్మకాలపైన ఎటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పన్ను పోట్లు వుండరాదని సిఫార్సు చేశారు. ఎనిమిదవ లోక్‌సభలో పిటిషన్లపై కమిటీ వారు 1988 మే 13న నివేదిక సమర్పించారు. ఆ నివేదికలో గత రెండు సంవత్సరముల కాలంలో చేనేత ముడి సరకు ధరలు పెరుగుతున్నవి. అందుకనుగుణంగా చేనేత ఉత్పత్తుల ధరల పెరగడం లేదని అభిప్రాయపడ్డారు. దేశ జనాభాలో అన్ని రంగాలలో వారితో సమానంగా చేనేత రంగం మనుగడ సాగించాలని సిఫార్సు చేశారు.

కేంద్రం రాజ్యాంగాన్ని గానీ, మొదటి ప్రణాళికా సంఘం సిఫార్సులను గానీ ఎనిమిదవ లోక్‌సభ పిటిషన్ల కమిటీ వారి సిఫార్సులు పరిగణనలోకి తీసుకోలేదు. కేంద్రం అధికార బలంతో ఏకపక్షంగా ఆకలి చావులు ఆత్మహత్యలతో కుదేలవుతున్న చేనేత రంగంపై ఇంకా పన్నులు విధించి, దేశవ్యాప్తంగా మొత్తం 2 కోట్ల యాభై లక్షల కుటుంబాలను వీధుల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తోంది. తదుపరి మినహాయింపు చేయబడిన వస్తువుల జాబితాలో చేనేతను కూడా చేర్చారు. కానీ దీనికి ఉపయోగించే ముడిసరుకులు చిలపల నూలు, రంగులు, రసాయనాలు, వస్త్రాలు ఎంబ్రాయిడరీ, జరీ వగైరా అన్నింటిపై పన్ను విధించారు. చేనేత మగ్గానికి ఉపయోగించే ముడిసరుకు రంగులు, రసాయనాలపై ఏ ప్రభుత్వమూ పన్ను విధించదు. ప్రధానమంత్రి దీనిపై వెంటనే దృష్టి సారించి చేనేత రంగంపై పన్నుపోటును మొత్తంగా నివారించాలి.

■ పడవల లక్ష్మణస్వామి

ప్రధాన కార్యదర్శి, ఎ.పి. వీవర్స్ అసోసియేషన్, ఈపురుపాలెం

(ఆగస్టు 7–14 చేనేత వారోత్సవాలు)

చీకట్ల నుంచి వెలుగులోకి...

పదిహేనవ శతాబ్దపు చివరలో భారతావనిలో పాదం మోపిన పోర్చుగీసుల వాణిజ్య సామ్రాజ్య వాద వ్యూహాత్మక ఆధిపత్యానికి పదహారవ శతాబ్దం ఆరంభంలోనే డచ్ వారు, ఆంగ్లేయుల నుంచి పలు సవాళ్లు ఎదురయ్యాయి. అచిర కాలంలోనే ఆంగ్లేయుల సారథ్యంలోని ఈస్ట్ ఇండియా కంపెనీ, పోర్చుగీస్ కంపెనీలపై విజయం సాధించింది. గోవా హద్దులను దాటి విస్తరించ లేకపోయిన పోర్చుగీసులు తమ వాణిజ్య అవసరాలకు మరింత లాభదాయకమైన దేశాల వేటలో పడాల్సి వచ్చింది. ఇండొనేషియా మీదుగా మనదేశంలో అడుగుపెట్టిన డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రధానోద్దేశం మసాలా దినుసుల వ్యాపారమే తప్ప రాజకీయసైనిక ఆధిపత్యం కాదు. డచ్ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభమైన రోజుల్లోనే, బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ కూడా లాభదాయకమైన మసాలా దినుసుల వ్యాపారానికి మన దేశంలో అడుగుపెట్టింది. 1600 సంవత్సరంలో, రాయల్ చార్టర్ ద్వారా బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపన జరిగింది. మన దేశంలో ఆంగ్లేయుల పాలనకు అలా అంకురార్పణ జరిగింది. డచ్, బ్రిటీష్ కంపెనీలతో పాటు అడుగుపెట్టిన ఫ్రెంచ్ కంపెనీ అంత పురోగతి సాధించ లేకపోయింది.

మొగల్ చక్రవర్తి జహంగీర్‌తో బ్రిటీష్ ప్రభుత్వ ప్రతినిధులు సత్సంబంధాలు పెంపొందించుకోసాగారు. దరిమిలా సూరత్ లోనూ ఈస్ట్ ఇండియా కంపెనీ వెలసింది. పదహారవ శతాబ్దపు తొలి నాళ్లలో మొదలైన బ్రిటీష్ వారి వాణిజ్యం అచిర కాలంలోనే అంచెలంచెలుగా ఎదగసాగింది. బాంబే నగరం ఈస్ట్ ఇండియా కంపెనీకి దక్కడంతో, పదిహేడవ శతాబ్ది ఆరంభానికల్లా, కనీసం వాణిజ్యపరంగానైనా పటిష్ఠమైన స్థితికి చేరుకున్నారు ఆంగ్లేయులు. ఔరంగజేబు అనంతరం మొగలాయి సామ్రాజ్య వైభవం క్షీణించడంతో భారతావనిలో చోటుచేసుకున్న అనిశ్చిత స్థితి బ్రిటీష్ వారికి కలిసొచ్చింది. నాదిర్ షా లాంటి వారి దండయాత్రలు మొదలయ్యాయి. కష్టాల కడలిలో ఉన్న భారతదేశంలో బ్రిటీష్ ఆధిపత్యానికి మార్గం సుగమం అయింది. ఆంగ్లేయులకు, ఫ్రెంచ్ వారికి మధ్య సుదీర్ఘంగా జరిగిన పోరాటంలో విజయం సాధించిన బ్రిటన్ భారత దేశంలో అధికారానికి చేరువై, సిపాయిల తిరుగుబాటు నాటికి పట్టు సాధించింది.

1857 నాటి సిపాయిల తిరుగుబాటులో చిట్టచివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్, తాంతియా తోపే, రాణి ఝాన్సీ లక్ష్మి బాయి లాంటి వారు పాల్గొన్నారు. బ్రిటన్ లోని పార్లమెంటరీ ప్రభుత్వం, అప్పటివరకున్న ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన స్థానంలో, నేరుగా పాలన సాగించాలని నిర్ణయం జరిగింది. వాస్తవానికి, సిపాయిల తిరుగుబాటు పూర్వ రంగంలోనే, ఒక మోస్తరు సాంస్కృతిక విప్లవం, భారతావనిలో వేళ్లూనుకోవడమే కాకుండా, రాజకీయ చైతన్యానికి కూడా బీజాలు పడ్డాయి. 1885లో లార్డ్ డఫరిన్ ఆశీస్సులతో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం జరిగింది. ఆదిలోని కాంగ్రెస్ మితవాద భావాల అధినాయకత్వం ఒక వైపు బ్రిటీష్ ప్రభుత్వానికి మద్దతు పలుకుతూనే, మరొక వైపు, పరోక్షంగా ప్రభుత్వ వ్యతిరేకతకు పునాదులు వేయసాగింది. బెంగాల్ విభజన నిర్ణయం, దేశ వ్యాప్త ఆందోళనకు దారితీసింది. స్వదేశీ ఉద్యమం, విదేశీ వస్తువుల బహిష్కరణ నినాదం ఊపందుకుంది. ఉద్యమకారులపై ప్రభుత్వ దమన కాండ తీవ్రతరమైంది. పంజాబ్ నుంచి లాలా లజపతి రాయ్, సర్దార్ అజిత్ సింగ్ ల బహిష్కరణ, బాల గంగాధర తిలక్, అరబిందో ఘోష్ ల నిర్బంధం, బెంగాల్ విభజన వ్యతిరేక ఆందోళన, భారత జాతీయోద్యమానికి పునాదులు బలంగా నాటాయి. .

ప్రథమ ప్రపంచ సంగ్రామంలో బ్రిటన్ కూరుకుపోయిన సమయంలోనే, స్వదేశీ ఉద్యమం బలపడ సాగింది. పూనా కేంద్ర కార్యాలయంగా, హోం రూల్ లీగ్ స్థాపించిన తిలక్ దేశ వ్యాప్తంగా పర్యటించి, దేశ ప్రజలందరూ ఐకమత్యంగా ఉద్యమించాలని చేసిన విజ్ఞప్తికి అనీబీసెంటు సహకారం లభించింది. హోం రూల్ ఉద్యమ లక్ష్యం పూర్ణ స్వరాజ్యమనేది స్పష్టమైపోయింది ఆంగ్లేయ పాలకులకు. ఇంతలో, మహాత్మా గాంధీ నాయకత్వంలో స్వాతంత్ర్యోద్యమం బలపడ సాగింది. ఆయన 'అహింస' నినాదంతో దూసుకుని పోయారు. దక్షిణాఫ్రికాలో ఆపాటికే బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమించిన మోహన్ దాస్ కరంచంద్ గాంధీ, బాంబేలో కాలుపెట్టిన వెనువెంటనే, జాతీయోద్యమానికి నాయకత్వం వహించమన్న నినాదం మొదలైంది. గాంధీ నిర్ణయం తీసుకునే లోపుగానే, రౌలట్ చట్టం తీసుకొని వచ్చిన బ్రిటీష్ ప్రభుత్వం, విచారణ జరపకుండా, రాజకీయ ఖైదీలను శిక్షించి, జైలుకు పంపించే అధికారాన్ని ప్రొవిన్షియల్ ప్రభుత్వాలకిచ్చింది. విశ్వసనీయతను కోల్పోయిన ఆంగ్లేయ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, 'ఆత్మ గౌరవం నినాదంతో. సత్యాగ్రహ ఉద్యమానికి మహాత్మా గాంధీ పిలుపిచ్చారు.

పంజాబ్ లోని జలియన్ వాలాబాగ్‌లో, ఏకైక ఇరుకైన ద్వారమున్న ఒక ప్రదేశంలో శాంతియుతంగా సమావేశమైన అమాయక ప్రజలపై జనరల్



1947 ఆగస్టు 14–15 నడిరేయి జవహర్లాల్ నెహ్రూ 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' ఉపన్యాసం వినకుండా నిద్రించిన మహాత్మా గాంధీ తెల్లవారుజామున నిద్రలేచి మార్నింగ్ వాక్‌కు బయలుదేరగానే అశేష జనవాహిని ఆయనను అనుసరించారట. నడక ముగించుకుని బసకు తిరిగివచ్చిన వెంటనే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వపు నూతన మంత్రివర్గం మహాత్ముని ఆశీస్సులకొరకు రాగా 'ముళ్ల కిరీటాన్ని' ధరించమని ఆయన వారితో అన్నారట!

డయ్యర్ దారుణమారణ కాండ జరిపించాడు. ఈ ఘటనలో వేలాది దేశభక్తులు మరణించారు. దేశ వ్యాప్తంగా విషాదం చోటు చేసుకున్న ఆ సంఘటన దరిమిలా మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభించారు. ఆబాల గోపాలం మద్దతు లభించిందా ఉద్యమానికి. లక్షలాది ప్రజలు, తారతమ్యాలు మరిచి, ఒక్క మాట మీద నిలబడి ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. దురదృష్ట వశాత్తు చౌరీచౌరా సంఘటనలో పాతిక మంది పోలీసులు ప్రజాగ్రహానికి గురై చంప బడడంతో, గాంధీ ఉద్యమాన్ని నిలుపుదల చేశారు. ఆ నిర్ణయం వల్ల గాంధీని కొందరు విమర్శించినప్పటికీ, కాంగ్రెస్ పార్టీలో ఆయన తిరుగులేని నాయకత్వం కొనసాగింది. జవహర్లాల్ నెహ్రూ పూర్ణ స్వరాజ్ నినాదంతో త్రివర్ణ పతాకాన్ని రావి నది ఒడ్డున ఎగురవేయడం, శాసనోల్లంఘన ఉద్యమాన్ని గాంధీ మొదలెట్టేందుకు సంపూర్ణ మద్దతును భారత జాతీయ కాంగ్రెస్ ప్రకటించడం, స్వతంత్రం పొందే దిశగా కదిలేందుకు దోహద పడింది.

గాంధీజీ పిలుపు మేరకు ఆరంభం కానున్న శాసనోల్లంఘన ఉద్యమం రూపురేఖలెలా వుండబోతున్నాయో తెలుసుకోవాలన్న ఆసక్తి కేవలం భారతీయులలోనే కాకుండా, బ్రిటీష్ ప్రభుత్వంలోనూ కలిగింది. అనుకున్న రోజునే, సబర్మతీ ఆశ్రమం నుంచి, ఉప్పు సత్యాగ్రహం కొరకు 'దండి' యాత్ర గాంధీ సారథ్యంలో మొదలైంది. దాన్నంత పెద్దగా పట్టించుకోవద్దనుకున్న బ్రిటీష్ ప్రభుత్వానికి ఉద్యమం ఉధృతం అవగాహనైంది. అరెస్టుల పర్వం మొదలైంది. 'బ్రిటీష్ ప్రభుత్వం ఉద్యమాన్ని అదుపుచేసేందుకు ఆయుధాలను ఉపయోగించినప్పటికీ, అదరకుండాబెదరకుండా, ఎదురుతిరగకుండా, వెనుకంజ వేయకుండా, భారతీయులు ముందుకు సాగడంతో, ఆంగ్లేయులు శక్తిలేని వార్లై పోవడంభారతీయులు అజేయులు కావడం జరిగింది' అని శాసనోల్లంఘనం గురించి లూయి ఫిషర్ వర్ణించారు. లండన్ లో జరిగిన మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి కాంగ్రెస్ ప్రతినిధులెవరు హాజరు కాకపోవడంతో, నాటి గవర్నర్ జనరల్ లార్డ్ ఇర్విన్ గాంధీజీని విడుదల చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇరువురి మధ్య సమావేశం జరిగింది. గాంధీ–ఇర్విన్ ఒప్పందం దరిమిలా రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు గాంధీ. నిరాశతో స్వదేశానికి రావడం మినహా ఒరిగిందేమీ లేదు.

గాంధీజీ నాయకత్వంపై భారత జాతీయ కాంగ్రెస్, ప్రజలు, యావత్ భారతావని, అపారమైన నమ్మకం పెట్టుకున్నారు. ఆయన పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమానికి, విజయమోవీర స్వర్గమో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. నాటినుంచి కౌంట్ డౌన్ మొదలైంది. స్వాతంత్ర్యం సిద్ధించే సూచనలు కనపడ సాగాయి. 1946 లో లార్డ్ మౌంట్ బేటన్ ఢిల్లీకి రావడంతో రాజకీయ ప్రాధాన్యత పెరిగింది. ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో నేర్చుకున్న పాఠాలతో భారత దేశాన్ని వదిలిపెట్టి పోవాలన్న నిర్ణయానికొచ్చింది బ్రిటీష్ ప్రభుత్వం. హఠాత్తుగా వదిలిపెట్టకుండా, అధికార మార్పిడికి కావాల్సిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యతను మౌంట్ బాటన్‌కు అప్పచెప్పిన బ్రిటీష్ ప్రభుత్వం, భవిష్యత్‌లో భారత దేశంతో సత్సంబంధాలు కొనసాగేట్లు చూడమని సూచించింది. విభజన తప్పని పరిస్థితి అప్పటికే చోటు చేసుకుంది.

అశేష ప్రజానీకం ఎదురు చూసిన రోజు ఆనందవిషాదాల మధ్య రానే వచ్చింది. 1947 ఆగస్టు పదిహేను అర్థ రాత్రి ఆంగ్లేయుల పాలన నుంచి విముక్తి కలిగింది భారత దేశానికి. మరో రెండు రోజులకు పాకిస్తాన్ మరో స్వతంత్ర దేశంగా ఏర్పాటవడంతో భారతావని రెండుగా చీలిపోయింది. చీలిక కోరుకున్న వారిలోను, కోరుకోని వారిలోను, ఎందరో తమకిష్టం వున్నాలేకపోయినా, తరతరాలుగా తాముంటున్న ప్రదేశాలను వదిలి, సుదూరంగా వెళ్లాల్సిన పరిస్థితులొచ్చాయి. జాతి పిత మహాత్మా గాంధీ మాత్రం, కలకత్తాలో తాను కోరుకున్న స్వతంత్రం సిద్ధించినా, కోరుకున్న రీతిలో సిద్ధించనందుకు సంబరాలకు దూరంగా, శాంతిని కాంక్షిస్తూ గడిపారు. ఢిల్లీలో వుండమని ఆయనకు చేసిన విజ్ఞప్తికి స్పందించలేదాయన. సంబరాలు జరుపుకునేందుకు ఏం మిగిలింది? దేశ విభజన తప్ప అన్నారాయన. ఆగస్టు పదిహేను అర్థ రాత్రి జవహర్లాల్ నెహ్రూ 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' ఉపన్యాసం వినకుండా నిద్రించిన మహాత్మా గాంధీ తెల్లవారుజామున నిద్రలేచి, ఆయన తాను బస చేసిన 'హైదరీ హౌజ్' నుంచి మార్నింగ్ వాక్ కు బయలు దేరగానే మహాత్ముడిని ఒక్క సారన్నా చూద్దామని అశేష జన వాహిని ఆయనను అనుసరించారట. నడక ముగించుకుని తిరిగి రాగానే, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వపు నూతన మంత్రివర్గం ఆయన ఆశీస్సులకొరకు వచ్చారట. 'ముళ్ల కిరీటాన్ని' ధరించమని మహాత్ముడు వారితో అన్నారట! అహింసకు కట్టుబడమని, అసత్యం పలకొద్దని, వినయ విధేయతలతో మెలగమని, సహన శీలంతో మసలుకోవాలని, అధికారం అంటే అప్రమత్తంగా వుండాలని, భారతదేశంలోని గ్రామాల్లో నివసిస్తున్న పేద గ్రామీణులకు సేవచేసేందుకే అధికారమని వారికి బోధించారట మహాత్ముడు. ఆయన బోధనలను కొన్నైనా గుర్తుంచుకున్నప్పుడే, స్వతంత్ర భారతదేశంలో వుండే అర్హత మనకుందనుకోవాలి. ఆగస్టు పదిహేనున ఇదే మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి.

■ వనం జ్వాలా నరసింహారావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

గ్రంథాలయశాస్త్ర శకపురుషుడు

గణిత శాస్త్ర అధ్యాపకునిగా, గ్రంథాలయ అధికారిగా, గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకునిగా, రచయితగా, గ్రంథ సంపాదకునిగా, గ్రంథాలయ ఉద్యమ నాయకునిగా, వివిధ ఇన్ఫర్మేషన్ సెంటర్స్ స్థాపకుడుగా గ్రంథాలయాల అభివృద్ధికి, పౌర గ్రంథాలయాల అభివృద్ధికి నిరంతరం సేవలు అందించిన చిరస్మరణీయుడు సియాలి రామమృత రంగనాథన్. మన దేశంలో గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధికి, గ్రంథాలయాల అభివృద్ధికి విశేష కృషిచేసిన అసాధారణవ్యక్తి ఆయన.



ఎస్. ఆర్. రంగనాథన్

ఇంగ్లాండ్ పర్యటనలో 'సెల్ఫ్ రిడ్జస్ స్టోర్'లో బొమ్మలు తయారు చేసే మెకానో సెట్ ను చూసి దాని ప్రేరణ తో రంగనాథన్ 'ద్విబిందు వర్గీకరణ సిద్ధాంత (Colon Classification) పథకాన్ని రూపొందించారు. వ్యక్తిత్వం, పదార్థం, శక్తి, స్థలం, కాలం (PMEST) అనే ఐదు అంశాల ఆధారంగా ఆయన 'ద్విబిందు వర్గీకరణ సిద్ధాంతం'ను ఆయన రూపొందించారు. గ్రంథాలయ శాస్త్రానికి భారతదేశపు మహోన్నత సేవగా ఈ 'ద్విబిందు వర్గీకరణ సిద్ధాంతం' పేరుగాంచింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో పర్యటించి ఆయా దేశాలలోని గ్రంథాలయ శాస్త్ర పద్ధతులను రంగనాథన్ క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఆ అధ్యయనాల ఫలితంగా రంగనాథన్ నూతన పద్ధతులను ఆవిష్కరించి గ్రంథాలయ శాస్త్రంలో నూతన శకానికి నాంది పలికారు. గ్రంథాలయ శాస్త్ర పురోగతికి దిక్సూచి గా నిలిచారు.

గ్రంథాలయ శాస్త్రంలో ఐదు సూత్రాలు, కోలన్ క్లాసిఫికేషన్, క్లాసిఫైడ్ కాటలాగ్ కోడ్, ఆచూకీ సేవలు (రెఫెరెన్సు సర్వీస్), లైబ్రరీ నిర్వహణ సూత్రాలు మొదలైన అంశాలపై ఆయన సాధికార గ్రంథాలు రచించారు. పుస్తకాలు చదువరులకు అందుబాటులో ఉండే ఓపెన్ షెల్ఫ్ వ్యవస్థను భారతదేశంలో మొట్టమొదటి సారిగా ప్రవేశపెట్టారు. అదేవిధంగా మద్రాసు విశ్వవిద్యాలయంలో మొట్టమెదటి సారిగా రెఫెరెన్సు గ్రంథాలయాన్ని ఆయన ఏర్పాటు చేశారు. 1931 లో గ్రంథాలయశాస్త్రానికి సంబంధించి రంగనాథన్ ప్రవేశ పెట్టిన ఐదు సూత్రాలు గ్రంథాలయ స్థితిగతులను మార్చివేశాయి. అవి: 1. పుస్తకాలు ఉపయోగం కోసం/అధ్యయనం కోసం పుస్తకాలు; 2. ప్రతి పాఠకుడుకి తన పుస్తకం; 3. ప్రతి పుస్తకానికి ఒక చదువరి; 4. చదువరి సమయం కాపాడటం (ఆదా చేయడం); 5.గ్రంథాలయం ఒక సజీవ వ్యవస్థ (నిత్యం అభివృద్ధి చెందుతున్న వ్యవస్థ). గ్రంథాలయశాస్త్రం, గ్రంథాలయాల అభివృద్ధికి మహోన్నత సేవలు అందించిన రంగనాథన్ జన్మదినం ఆగష్టు 12 వ తేదీని 'జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం'గా దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

– డాక్టర్ రవికుమార్ చేగొని

ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రంథాలయ సంఘం

అక్కసంతా అధికార దాహంతోనే

మనిషి స్థాయి ఏమిటో అతడి మాటల్ని బట్టే వెల్లడవుతుంది. మనిషి వ్యక్తిత్వం మంచిది అయితే ప్రజల్లో గుర్తింపు తెస్తుంది. మనిషికి అణుకువ పెట్టని ఆభరణం వంటిది. నాయకత్వ లక్షణాల్లోనూ నమ్రతదే ప్రధాన పాత్ర అని గ్రహించాల్సి ఉంది. మనిషి మాటల్లో కాఠిన్యం పనికి రాదు. కాలిన గాయాలు మానిపోతాయి గానీ వాటి వల్ల వెలువడే మంటల గాయాలు ఎన్నటికి మానవు. రాజకీయాల్లో జగన్ నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. కానీ జగన్‌కి ఇవ్వేమి పట్టవు. తాను అనుకున్నదే తడవుగా ముఖ్యమంత్రి కాలేదని, రాబోవు రోజుల్లో కూడా ఆ అవకాశం లేదని అధికార దాహంతో అక్కసుతోనే సీఎం చంద్రబాబుపై పరుష పదజాలం ప్రయోగిస్తున్నారు. కానీ జగన్ ఎంత పరుష పదజాలం ప్రయోగించినా, ఎన్ని అబద్దాలు చెప్పినా నిజాలేమిటో జనానికి తెలుసు.

ప్రజాస్వామ్యంలో ఎవరైనా మాకు అధికారం ఇవ్వండి ఈ ప్రభుత్వం కన్నా మెరుగైన పాలన అందిస్తాం, ఇంతకంటే ప్రజల్ని బాగా ఉద్ధరిస్తాం అని ప్రజల్ని ఓటు అడగటంలో తప్పులేదు. అలా కాకుండా ముఖ్యమంత్రిని చెప్పుతో కొట్టాలి, ముఖ్యమంత్రిని నడిబజారులో కాల్చినా తప్పులేదు, ముఖ్యమంత్రిని ఉరితీయాలి అంటూ కనీస మర్యాదలను మంట కలిపి వీరావేశంతో వికృత భాషతో ప్రతిపక్షనేత విరుచుకుపడటాన్ని సభ్య సమాజం ఆమోదించదు. ఆర్థిక ఇబ్బందుల్లోనూ కేంద్ర సాయం అంతగా అందకున్నా రూ.16వేల కోట్ల లోటు బడ్జెట్‌లోను ఇచ్చిన అనేక హామీలను ప్రభుత్వం ఒకదానివెంట ఒకటి అమలు చేస్తున్నది. అంతేగాకుండా ఇవ్వని హామీలు కూడా ప్రభుత్వం అమలుచేసిన విషయం జగన్‌కి తెలియికపోయినా ప్రజలకు తెలుసు. అయినా ఒకవేళ అమలుకాని హామీలు ఉంటే నడిబజారులో కాల్చి చంపుతావా ముఖ్యమంత్రిని? ఉరితీస్తావా? చెప్పుతో కొడతావా? ఏ రాష్ట్రంలో కూడా ఈ విధంగా మాట్లాడిన ప్రతిపక్ష నాయకులున్నారా? మరి జగన్‌కే ఇంత అక్కసు ఎందుకు? దేశ రాజకీయాల్లో ప్రజల్ని ఉద్ధరించే రాజకీయ నాయకుడు జగన్ ఒక్కడేనా?

అధికారం అనే పెట్టుబడితో ఆర్థిక సామ్రాజ్యం నిర్మించి దాని సాయంతోనే పాలనాధికారం కోసం రాజకీయ యుద్ధం గతంలో ఎవరన్నా చేశారా? రాజకీయ జీవితంలో ఉండాలనుకునేవారు తమపై వచ్చిన ఆరోపణలు, ఆర్థిక నేరాలకు సంబంధించిన అభియోగాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత లేదా? అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రజల భవిష్యత్తును బలిపెట్టి తన భవిష్యత్తు చక్కదిద్దుకున్న పెద్దమనిషి ఈ రోజు చంద్రబాబుపై ఇష్టానుసారం నోరు పారేసుకోవడం బాధ్యతారాహిత్యం కాదా?

ప్రజలు ఎంతో నమ్మకంతో ఇచ్చిన అధికారంతో ధర్మాన్ని విస్మరించి అధర్మ రాజ్యం స్థాపించి ప్రజాధనం దోపిడీకి పాల్పడి కూడా జగన్ ధర్మానికి, అధర్మానికి పోటీ అనడం విడ్డూరంగా ఉంది. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదని నంద్యాల ఎన్నికల ప్రచారంలో జనాన్ని నమ్మించడానికి జగన్ అండ్ కో తీవ్రంగా ప్రయాసపడుతున్నది. కానీ వైఎస్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజున ఉచిత విద్యుత్ ఫైల్ పై నేను సంతకం చేస్తున్నాను. ఈ రోజు నుండి ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోవడానికి వీలు లేదు అంటూ వైఎస్ హామీ ఇచ్చిన విషయం అందరికీ తెలుసు. వైఎస్ ఐదున్నర ఏళ్ల పరిపాలనలో 14,075మంది రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వచ్చిందో జగన్ సమాధానం చెప్పగలరా? కోటి ఎకరాలకు నీరు అందిస్తామంటూ జలయజ్ఞం తలపెట్టి రూ.55వేల కోట్లు ఖర్చు చేసిన వైఎస్ హయాంలో సాగులోకి వచ్చిన భూమి ఎంతో జగన్ సమాధానం చెప్పగలరా? నిజంగా జగన్ రైతు పక్షపాతి అయితే రాజ్యసభలో పోలవరానికి వ్యతిరేకంగా కేవీపీ రామచంద్రరావుతో చేయి కలిపి విజయసాయిరెడ్డితో ఎందుకు ప్రశ్నలు వేయించినట్టు? నిజంగా రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు ఉన్నదా? రైతుల బతుకులు నాశనం చేసింది తండ్రి,తనయుడు కాదా? రైతుల సమాధులపైనే జగన్ ఆర్థిక సామ్రాజ్యానికి పునాదులు పడింది వాస్తవం కాదా? అట్లాగే అవినీతి సొమ్ముతో అచ్చు యంత్రాలు నిర్మించుకొని అబద్ధపు రాతలతో ప్రభుత్వంపై నిత్యం విష ప్రచారం చేస్తూ నాకు అబద్దాలు చెప్పే పేపర్, టీవీ లేదని చెప్పడం ఇంతకన్నా మోసం ఉంటుందా? అట్లాగే కోటి మహిళలను లక్షాధికారులుగా మారుస్తానంటూ చేతులు జోడించి ఊదరగొట్టి వైఎస్ పాలనలో మహిళల గౌరవప్రద జీవనానికి ఏ మేరకు అవకాశం కల్పించారో జగన్ ఆత్మ విమర్శ చేసుకోవాలి. పావలా వడ్డీ పేరుతో వనితా లోకాన్ని వంచించిన పాపం వైఎస్‌దేనని జగన్ తెలుసుకోవాలి. ఆయేషా హత్య కేసు వ్యవహారాన్ని కొన్నేళ్లుగా నానబెట్టి అసలు ముద్దాయిలను తప్పించాలని చూసిన వైఎస్ తనయుడికి మహిళల గురించి మాట్లాడే నైతికత ఎక్కడిది?



ప్రత్యేకహోదాపై ప్రగల్భాలు పలికిన జగన్ రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రత్యేకహోదాపై డిమాండ్ చేయకుండానే, కేంద్ర ప్రభుత్వం అడక్కుండానే బీజేపీకి ఎందుకు మద్దతివ్వాల్సి వచ్చింది? తన కేసుల నుండి బయటపడటం కోసం కేంద్రం ముందు సాగిలపడింది వాస్తవం కాదా? ప్రజలకు అన్యాయం జరుగుతుందని ప్రచారం చేసి ప్రజలను నమ్మించి తనవైపు తిప్పుకోవడానికి జగన్ తీవ్ర ప్రయత్నం చేస్తున్నాడు. అధికారం కోసం వైసీపీ అబద్ధాల దుకాణంగా మారింది.

మాట తప్పను, మడెం తిప్పను అంటూ జనాన్ని మోసం చేస్తున్న జగన్ బెయిల్ విషయంలో గాని,ప్రత్యేకహోదా అంశంపై గాని జగన్ చేసింది ఏమిటి? నేరచరితులకు చట్టసభల్లో స్థానం లేదని 2013 జులై 10న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో భయపడి అక్రమాస్తుల కేసులో శిక్షపడితే రాజకీయ జీవితం అంతమవుతుందని ఆ కేసుల నుండి భయటపడటానికి సోనియా దగ్గర సాగిలపడి సోనియాతో ఒప్పందం చేసుకొని బెయిల్ తెచ్చుకోవడాన్ని ఏమనాలి? మరోపక్క ప్రత్యేక హోదాపై ప్రగల్భాలు పలికిన జగన్ రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రత్యేక హోదాపై డిమాండ్ చేయకుండానే, కేంద్ర ప్రభుత్వం అడక్కుండానే బీజేపీకి ఎందుకు మద్దతివ్వాల్సి వచ్చింది? ఎంపీలు అందరితో రాజీనామా చేయించి కేంద్రప్రభుత్వ మెడలు వంచుతానని వీరంగాలు వేసిన జగన్ ఎందుకు మెడలు వంచలేదు? తన కేసుల నుండి బయటపడటం కోసం కేంద్రం ముందు సాగిలపడింది వాస్తవం కాదా?

ఈరోజు జగన్ వైఖరి నచ్చక రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు అవుదామని తన పార్టీ ఎమ్మెల్యేలు పార్టీ మారడంపై గగ్గోలు పెడుతున్న జగన్ వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో ప్రలోభపెట్టి తమ పార్టీలో చేర్చుకొని ఇతర పార్టీలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించినప్పుడు,విలువలు, నిజాయితీ,ప్రజాస్వామ్యం గురించి జగన్‌కు తెలియదా? ఆనాటి తన చర్యలు తప్పుకానప్పుడు ఇప్పుడు ఈ ప్రభుత్వ చర్యలను తప్పుపట్టే నైతికత జగన్‌కు ఎక్కడిది? నేడు ధర్మాధర్మాల గురించి వాపోయే అర్హత జగన్‌కు ఎక్కడిది? నిరుద్యోగ భృతి ఇస్తానని ఇవ్వలేదని నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారు జగన్. ప్రభుత్వం నిరుద్యోగ భృతి చెల్లించేందుకు ఈ ఏడాది బడ్జెట్ లో రూ.500కోట్లు కేటాయించి ఏ మేరకు ఇవ్వాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుంటే దానిపై కూడా నిరుద్యోగులను రెచ్చగొట్టి రాజకీయలబ్ధి పొందాలని చూస్తున్నారు జగన్. వైఎస్ హయాంలో నిరుద్యోగం అన్నదే లేకుండా చేస్తామంటూ 2.5లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని నిరుద్యోగులకు అరచేతిలో వైకుంఠం చూపించి అందలం ఎక్కాక ఖాళీలు ఉంటే కదా భర్తీ చేయడానికి అంటూ నిరుద్యోగులను మోసం చేసింది నీ తండ్రి వైఎస్ కాదా? ప్రత్యేక ఆర్థిక మండళ్ల ద్వారా 25లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పి 25వేల మందికి కూడా ఉపాధి కల్పించకుండా యువతను మోసం చేసింది వైఎస్ కాదా? తాము మాత్రమే హామీలు అమలు చేసినట్లు, తాము మాత్రమే బాగుచేసినట్లు జగన్ చెప్పడం అనేది ఇంతకన్నా దగా, మోసం మరొకటి ఉంటుందా? తన బాధను జనం బాధగా చిత్రించడానికి జగన్ పడరాని పాట్లు పడుతున్నాడు. ప్రజలకు అన్యాయం జరుగుతుందని ప్రచారం చేసి ప్రజలను నమ్మించి తనవైపు తిప్పుకోవడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నాడు. అధికారం కోసం వైసీపీ అబద్దాల దుకాణంగా మారింది. ఆ పార్టీ అధ్యక్షుడు, నాయకులు ఆ పార్టీ మీడియా సంస్థలు బొంకుల దిబ్బగా మారాయి.

■ దేవినేని ఉమా మహేశ్వరరావు

జల వనరుల శాఖ మాత్యులు

ఎందుకింత ధర..?

- **1104 కోట్ల భారాన్ని మోయలేం**
- **ఎన్‌టీపీసీకి ఏపీపీసీసీ నోటీసు**

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థ నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) నుంచి కొనుగోలు చేస్తున్న విద్యుత్తు కారణంగా రాష్ట్ర డిస్కమ్‌లపై ఏటా రూ. 1104 కోట్ల అదనపు భారం పడుతోంది! విశాఖలోని సింహాద్రి థర్మల్ ప్లాంటు నుంచి యూనిట్‌కు అస్థిర ధర రూ.2.90 చొప్పున ఏపీ డిస్కమ్‌ల తరఫున ఆంధ్రప్రదేశ్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ(ఏపీపీసీసీ) కొనుగోలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఖరారు చేసిన ధర కంటే అధికంగా ఎన్‌టీపీసీ ధర ఉండడంతో నెలకు రూ.92 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. అంటే... ఏటా రూ.1104 కోట్ల భారం పడుతోందని ఏపీపీసీసీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. విశాఖకు 450 కిలోమీటర్ల దూరంలో ఉన్న వీటీపీఎస్ యూనిట్‌కు అస్థిర ధరను రూ.2.50గా నిర్ధారించింది. వీటీపీఎస్ కంటే సమీపంలోనే ఉన్న సింహాద్రి యూనిట్ అస్థిర ధర 40 పైసలు అధికంగా ఉండడంపై ఏపీపీసీసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. సింహాద్రి యూనిట్ ధరకు సంబంధించి పూర్తి గణాంకాలు సమర్పించాలని ఎన్‌టీపీసీని డిమాండ్ చేస్తోంది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థగా తాము సమాచారాన్ని బహిర్గతం చేయలేమంటూ ఎన్‌టీపీసీ దబాయిస్తోందని ఏపీపీసీసీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత నెల బిల్లులో రూ.92 కోట్లను చెల్లించలేదు. అదనపు ధరపై స్పష్టతను ఇవ్వాలని కోరుతూ శుక్రవారం ఎన్‌టీపీసీకి నోటీసు జారీ చేశారు. సమాధానం చూశాకే .. తదుపరి నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది.

ఉద్యోగులకు ప్రోత్సాహక అవార్డులు

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో అత్యుత్తమ పనితీరు కనబర్చిన ఉద్యోగులకు ప్రభుత్వం ప్రోత్సాహక అవార్డులను ప్రకటించింది. వివిధ విభాగాల్లోని మొత్తం 22మందికి ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున ప్రోత్సాహకంగా విడుదల చేసింది. ఈ అవార్డు అందుకున్న వారి వివరాలు... ఏసీబీ డీఎస్పీలు ఎ. రమాదేవి, ఎస్‌వీవీ ప్రసాదరావు, ఇన్‌స్పెక్టర్ బి.సుదర్శన్‌రెడ్డి, అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి ఎ. రవిశంకర్, ఆర్థికశాఖ నుంచి డీఎఫ్ఏ మహ్మద్ ఇంతియాజ్, ఎంఎస్ రంగసాయి శేషు, రంగనాయక్, వై. వరలక్ష్మి, జీఏడీ నుంచి పి. రామకృష్ణ బాబు, ఎస్ఏ రషీద్, కె. వరప్రసాద్, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి జి.బాలసుబ్రహ్మణ్యం, ఎం. శివప్రసాద్, ఎ. కళ్యాణ చక్రవర్తి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నుంచి ఆర్ఆర్ విద్యాసాగర్, ఎస్.వెంకటేశ్వర్లు, పి.రంజిత్ బాషా(సీసీఎల్ఏ), సబ్ ఇన్‌స్పెక్టర్ కె. రమేష్ (ఏపీఎస్పీఎఫ్), పి.రవి కుమార్ (పాఠశాల విద్య), జి. రాజపుష్ప (బీసీ సంక్షేమశాఖ), వి.బంగారం(హోంశాఖ), వై.లీలాసరస్వతి (అటవీశాఖ).

ఆగస్టు 15 ఉత్సవాలకు 1.4కోట్లు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు రూ.1.4కోట్ల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న ఈ ఉత్సవాలకుగాను కలెక్టర్‌కు రూ. కోటి, ఏపీఎస్పీ బెటాలియన్‌కు రూ.10లక్షలు, ప్రోటోకాల్ విభాగానికి రూ.30లక్షలు మంజూరు చేశారు.

న్యాయం చేయండి: ఫాతిమా విద్యార్థులు

న్యూఢిల్లీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): న్యాయం చేయాలంటూ కడప ఫాతిమా వైద్యకళాశాల విద్యార్థులు ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబును శుక్రవారం ఏపీ భవన్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. వైద్య కళాశాలకు అనుమతులు లేకపోయినా సీట్లు ఇచ్చి తమను మోసం చేశారంటూ తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన సీఎం కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్య పరిష్కరించాలని ఎంపీలకు, అధికారులకు ఆదేశాలిచ్చారు.

తీపు విమానం మోత!



- **విశాఖ నుంచి చార్జీల బాదుడు**
- **హైదరాబాద్‌కంటే సింగపూర్‌కు చౌక**
- **రద్దీని సొమ్ము చేసుకుంటున్న వైనం**
- **ఒక సర్వీసు రద్దు చేసి కృత్రిమ డిమాండ్**

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీ విశాఖపట్నం నుంచి సింగపూర్‌కు ఎయిర్ ఏషియా టికెట్ ధర... 7036 రూపాయలు! అదే రోజు విశాఖ నుంచి హైదరాబాద్‌కు ఇండిగో కనీస చార్జీ రూ.8932. గరిష్ఠ ధర... 13,886 రూపాయలు! శనివారం, ఆదివారం శ్రీలంక, మలేషియాకు టికెట్ వెల రూ.8 వేలు. కానీ... అవే రోజుల్లో హైదరాబాద్‌కు వెళ్లాలంటే... 9 వేల నుంచి 14,500 వరకు ఖర్చు పెట్టాల్సిందే. ఇదీ పరిస్థితి. అందరికీ విమానయానం అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రం రకరకాల పథకాలు ప్రవేశపెడుతుండగా... విమానయాన సంస్థలు మాత్రం చార్జీలతో జనాన్ని కుమ్మేస్తున్నాయి. కనీసం రెండు నెలల ముందు టికెట్ బుక్ చేసుకుంటే తక్కువకు వస్తుందన్నది నిజం. చివరి నిమిషంలో చార్జీలు ఎక్కువగా ఉంటాయన్నదీ నిజం. కానీ... విశాఖ-హైదరాబాద్ చార్జీలు అసాధారణ స్థాయిలో ఉంటున్నాయి. గతంలో ఎంత రద్దీ ఉన్నప్పటికీ.. టికెట్ ధర పదివేలకు మించేది కాదు. ఇప్పుడు... టికెట్ ధర 17వేలను కూడా టచ్ చేస్తోంది.

ఏమిటి కారణం...

విశాఖపట్నం-హైదరాబాద్‌ల మధ్య రోజూ ఎనిమిదికిపైగా విమాన సర్వీసులు నడుస్తున్నాయి. మరో రెండు సర్వీసులకూ డిమాండ్ ఉంది. విశాఖ నుంచి హైదరాబాద్‌కు రెండు రోజుల ముందు బుక్ చేసుకుంటే రూ.4,500 నుంచి రూ.4,800 మధ్య లభించేది. కానీ... ఒక విమానయాన సంస్థ కొద్ది రోజులుగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ రేట్లకు రెక్కలు తొడుగుతోంది. వీకెండ్‌లో విశాఖకు నడిపే విమానాల్లో ఒకదానిని రద్దు చేస్తోంది. దీంతో ఉన్న సర్వీసులకు డిమాండ్ పెరుగుతోంది. రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ... అవసరం రీత్యా కొనక తప్పడంలేదు. డిమాండ్‌కు అనుగుణంగా టిక్కెట్ల ధరలను పెంచుకునే అవకాశం ఉండటంతో విమాన సంస్థలు ఇలా సొమ్ము చేసుకుంటున్నాయి.

సీలింగ్ పెట్టాలి

విమాన టికెట్ చార్జీలపై గరిష్ఠ పరిమితి విధించాలని ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ చైర్మన్ ఓ.నరేశ్‌కుమార్, ప్రెసిడెంట్ విజయమోహన్ కేంద్రాన్ని కోరారు. దీనిపై పౌర విమానయాన శాఖ మంత్రి అశోకగజపతిరాజుకు లేఖ రాశారు.

కరువు భత్యం 3.668%

- **మూల వేతనంపై 22.008 శాతానికి చేరిన డీఏ**
- **యూజీసీ వేతన జీవులకు 7% పెంపు**
- **జీపీఎఫ్ ఖాతాలోకి ఏడాది బకాయిలు**
- **సెప్టెంబరు డీఏ అక్టోబరు వేతనంతో చెల్లింపు**
- **పెన్షనర్లకు విడిగా ఉత్తర్వులు**

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు వరుస సెలవుల ముందు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కరువు భత్యం(డీఏ) 3.668% పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కరువు భత్యం గతంలో మూల వేతనంపై 18.34% ఉండగా ఇప్పుడది 22.008%కి చేరింది. 2015లో వేతన సవరణ జరిగిన ఉద్యోగులందరికీ డీఏ ఇదే స్థాయిలో ఉంటుంది. ఇక యూజీసీ వేతనాలు అందుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏని ప్రస్తుతం ఉన్న 125 % నుంచి 132%కి పెంచింది. అంటే 7% పెరిగింది. లక్షలాది మంది ఉద్యోగులకు వర్తించే ఈ నిర్ణయంపై ఆర్థిక శాఖ కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర శుక్రవారం జీవో 140ని జారీ చేశారు. పెన్షనర్లకు కూడా డీఏ పెంచుతూ గత కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. అయితే, వారికోసం ప్రత్యేక జీవో ఇవ్వాల్సి ఉంది. పెరిగిన డీఏను 2016 జూలై నుంచే చెల్లిస్తారు. అప్పటినుంచి ఈనెల వరకు చెల్లించాల్సిన బకాయిలను ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్) ఖాతాల్లో జమ చేస్తారు. ఈ మొత్తం సుమారు రూ.2000 కోట్ల వరకు ఉంటుందని అంచనా. సెప్టెంబరు నుంచి చెల్లించాల్సిన మొత్తాన్ని వేతనంతో కలుపుతారు. అంటే అక్టోబరులో చేతికి వస్తుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లలో పని చేస్తున్న ఉద్యోగులకు డీఏ పెంపుపై అయ్యే వ్యయాన్ని ఆయా సంస్థల నిధుల నుంచే భరించాల్సి ఉంటుంది.

కేటగిరీల వారీగా పెంపు ఇలా..

● మొదటి, రెండు కేటగిరీలు

2015 వేతన సవరణ వర్తించేవారందరికీ డీఏ 18.34% నుంచి 22.008%కి పెరిగింది. అందులో ప్రభుత్వ ఉద్యోగులు మొదటి కేటగిరీకి చెందుతారు. రెండో కేటగిరీలో.. జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, జిల్లా గ్రంథాలయ సంస్థ, వర్క్‌చార్జ్‌డ్ తదితర కేటగిరీలలోని ఉద్యోగులు, ఎయిడెడ్ విద్యా సంస్థల్లోని(ఎయిడెడ్ పాలిటెక్నిక్‌లు సహా) అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఉన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక వర్సిటీ సహా అన్ని యూనివర్సిటీలలోని ఉద్యోగులలో 2015 వేతన స్కేళ్లు వర్తించేవారికి కూడా డీఏ 22.008%గా ఉంటుంది. వీరందరికీ పెరుగుదల 3.668%.

● మూడో కేటగిరీ

2006 వేతన సవరణ ప్రకారం యూజీసీ వేతనాలు అందుకుంటున్న అందరికీ డీఏ 125% నుంచి 132%కి పెరిగింది. ఇలా 7% పెరిగినవారిలో ప్రభుత్వ, ఎయిడెడ్ అనుబంధ డిగ్రీ కళాశాలల లెక్చరర్లు, నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఉంటారు. వ్యవసాయ, సాంకేతిక వర్సిటీలతోపాటు అన్ని వర్సిటీల అధ్యాపక సిబ్బంది, యూజీసీ/ఏఐసీటీఈ వేతన సవరణ 2006 ప్రకారం వేతనాలు పొందుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపక సిబ్బంది ఈ కేటగిరీలో ఉన్నారు.



● నాలుగో కేటగిరీ

2016 యూజీసీ వేతన స్కేళ్లు వర్తించే ఉద్యోగులు మూల వేతనంపై 2%న్ని డీఏగా పొందుతారు. ఈ కేటగిరీలో ఇంకా.. 2016 యూజీసీ వేతన స్కేళ్లను పొందుతున్న ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల అధ్యాపక, బోధనేతర సిబ్బంది ఉన్నారు. 2016 యూజీసీ/ఏఐసీటీఈ వేతన స్కేళ్లు వర్తించే వర్సిటీ అధ్యాపకులు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లోని అధ్యాపక సిబ్బంది కూడా ఇదే కేటగిరీకి చెందుతారు.

● 5, 6 కేటగిరిలు

పద్మనాభన్ కమిటీ నివేదిక ప్రకారం 2010లో వేతన సవరణ జరిగిన న్యాయాధికారులకు డీఏ 125% నుంచి 132% పెరిగింది.

డిసెంబరు 5 నుంచి అయోధ్యపై తుది విచారణ

- **ఏ దశలోనూ వాయిదా వేయం**
- **సుప్రీంకోర్టు స్పష్టీకరణ**
- **ప్రత్యేక రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు**

న్యూఢిల్లీ, ఆగస్టు 11: అయోధ్యలో రామజన్మభూమి-బాబ్రీమసీదు కట్టడం ఎవరికి చెందుతున్న వివాదంపై తుది విచారణను డిసెంబరు 5 నుంచి నిర్వహించాలని సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయించింది. నాటి నుంచి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ప్రత్యేక త్రిసభ్య రాజ్యాంగ ధర్మాసనం ముందు ఏకధాటిగా విచారణ సాగుతుంది. ఏ పరిస్థితుల్లోనూ ఈ కేసులో వాయిదాలను అనుమతించేది లేదని న్యాయస్థానం శుక్రవారం తేల్చిచెప్పింది. ఆ రోజున రామ్‌లల్లా (శ్రీరామచంద్రుడు) తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ తన వాదనలు ప్రారంభిస్తారని పేర్కొంది. 2.77 ఎకరాల వివాదాస్పద స్థలాన్ని సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్‌లల్లాలకు పంచుతూ అలహాబాద్ హైకోర్టు 2010లో ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో 13 అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై త్వరితగతిన విచారణ జరపాలని బీజేపీ ఎంపీ సుబ్రమణ్యంస్వామి.. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్‌కు గత నెల 21న విజ్ఞప్తి చేశారు. దీనిపై శుక్రవారం కోర్టు గంటన్నరపాటు లోతుగా విచారణ జరిపింది. వాటిపై డిసెంబరు 5 నుంచి తుది విచారణ ప్రారంభించాలని రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఎనిమిది భాషల్లో ఉన్న డాక్యుమెంట్లన్నిటినీ 12 వారాల్లో ఆంగ్లంలోకి తర్జుమా చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. అలాగే అలహాబాద్ హైకోర్టులో నమోదుచేసిన సాక్ష్యాలు, వాంగ్మూలాలనూ పదివారాల్లో ఆంగ్లంలోకి అనువదించాలని యూపీ ప్రభుత్వాన్ని నిర్దేశించింది.



కిమ్ గురిలో 'గ్వామ్'

అమెరికాకు వ్యూహాత్మకంగా కీలకం

అక్కడే నౌకా, వైమానిక దళ స్థావరాలు

ఒకవైపు 'అగ్రదేశం' అమెరికా! మరోవైపు... బుల్లి 'సామ్రాజ్యం' ఉత్తర కొరియా! అమెరికా ప్రపంచానికి 'పెద్దన్న'! ఆ అమెరికానే బెదిరించే దేశం ఉత్తర కొరియా! 'ఇక మాటల్లేవ్. యుద్ధమే! గ్వామ్ దీపంపై విరుచుకుపడతాం' అని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌చెప్పేశారు. 'ఈ నెలలోనే దాడి' అని తేల్చేశారు. గ్వామ్ దీపం ఎక్కడుంది? అది ఏమిటి? అమెరికాకు ఎలా ముఖ్యం? ఇవీ నేటి ప్రశ్నలు...

ఇదీ గ్వామ్..

పసిఫిక్ సముద్రంలోని సుందర ద్వీపం గ్వామ్. ఉత్తర కొరియా నుంచి సుమారు 3వేల కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీని విస్తీర్ణం 210 చదరపు కిలోమీటర్లు. అంటే... గ్రేటర్ హైదరాబాద్‌లో దాదాపు మూడో వంతు! అమెరికాలో భాగమైనప్పటికీ ఆ దేశ ప్రధాన భూభాగానికి అత్యంత దూరంలో ఉన్న ద్వీపం ఇదే. గ్వామ్ జనాభా సుమారు 1.60 లక్షలు. వీరు పేరుకే అమెరికా పౌరులు. కానీ... అధ్యక్ష ఎన్నికల్లో వీరికి ఓటు వేసే హక్కు ఉండదు. ఈ ద్వీపం సుమారు 400 ఏళ్లపాటు స్పెయిన్, జపాన్ ఆధీనంలో ఉండేది. 1944లో జపాన్‌ను యుద్ధంలో ఓడించి... గ్వామ్‌ను అమెరికా సొంతం చేసుకుంది.

ఇలా కీలకం...

పసిఫిక్ మహా సముద్రంలో... జపాన్, ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్, ఆస్ట్రేలియా మధ్యలో ఉన్న గ్వామ్ ద్వీపం వ్యూహాత్మకంగా కీలకమైనది. అందుకే... అమెరికా ఇక్కడ భారీ సైనిక స్థావరాలు నిర్వహిస్తోంది. ఇక్కడ ఆరువేల మందికిపైగా సైనికులతో... వైమానిక, నౌకాదళ స్థావరాలు ఏర్పాటు చేసింది. అంతే కాదు... అణ్వస్త్రాలనూ, వాటిని ప్రయోగించగల వ్యవస్థలను ఇక్కడ సిద్ధంగా ఉంచింది. గ్వామ్ భూభాగంలో 30 శాతం అమెరికా సైన్యం ఆధీనంలోనే ఉందంటే... దీనికి ఉన్న ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. అమెరికా యుద్ధ విమానాలు ఇక్కడి ఆండర్సన్ ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచే ఈ ప్రాంతంలో తిరుగాడుతుంటాయి. వెరసి... తన ప్రధాన భూభాగం నుంచి 11,500 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్వామ్ నుంచి అమెరికా అనేక దేశాలను తన 'ఆయుధ' పరిధిలోకి తెచ్చుకోగలుగుతోంది. అందుకే... రక్షణపరంగా గ్వామ్ అత్యంత కీలకమైనది.

దాడి సాధ్యమేనా?

గ్వామ్‌పై గురిపెట్టగల క్షిపణులు ఉత్తర కొరియా వద్ద ఎప్పటి నుంచో ఉన్నాయి. అయితే... గతనెలలో తొలిసారిగా ఖండాతర క్షిపణిని హోస్వాంగ్-14ను విజయవంతంగా ప్రయోగించినట్లు కిమ్ ప్రకటించారు. దీంతో అమెరికాలోని అలస్కా, శాండియాగోనూ దెబ్బ తీయగలమని తెలిపారు. 'ముందస్తుగా'గా గ్వామ్‌పై దాడికి దిగుతామని హెచ్చరించారు.

కనుసైగ చేస్తే చాలు!

- **ఉత్తరకొరియాపై దాడికి సైన్యం సిద్ధం: ట్రంప్**



వాషింగ్టన్, ఆగస్టు 11: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా ట్వీట్.. ఉత్తరకొరియాతో ఉద్రిక్తత స్థాయిని మరింత పెంచారు. కనుసైగ చేస్తే చాలు.. కొరియాపై అమెరికా సైన్యం దాడి చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. 'కొరియాపై సైనికదాడికి ఏర్పాట్లు జరిగిపోయాయి. ఒకవేళ కొరియా తెలివితక్కువగా వ్యవహరిస్తే.. సైనిక చర్యలు తప్పవు' అన్నారు. అయితే ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ సరైన దారిలో నడుస్తారని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. ట్రంప్, కిమ్‌ల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇరువురు నేతలు సంయమనం పాటించాలని చైనా విజ్ఞప్తి చేసింది. గ్వామ్ దీవిపై క్షిపణి దాడికి సిద్ధంగా ఉన్నామని ఉత్తరకొరియా ప్రకటించిన నేపథ్యంలో... ఒకవేళ అదే జరిగితే తీవ్రపరిణామాలు తప్పవని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. కాగా, దక్షిణ చైనా సముద్ర జలాల్లోకి అమెరికా యుద్ధ నౌక 'యూఎస్ఎస్ జాన్ ఎస్ మెకైన్' ప్రవేశించడంపై శుక్రవారం చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించిందని మండిపడింది.

బెట్టింగ్ ఫిట్టింగ్!

(మొదటి పేజీ తరువాయి)

వెంకటరమేశ్, గుర్రం వెంకటేశ్వర్లు, నంద్యాల అరుణ్ కుమార్, మన్నెం శ్యాంప్రసాద్, దాసరి సుశాంత్ తదితరులతోపాటు పలువురు రాజకీయ నేతలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఇంకొందరు పరారీలో వున్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకూ 116 మంది అరెస్టయ్యారు. బెట్టింగులతో లింకులున్నాయని పక్కా సమాచారం అందడంతో... జిల్లాకు చెందిన ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలను వీఆర్‌కు పంపించారు. గతంలో జిల్లా ఎస్పీగా పనిచేసిన ఓ పోలీస్ పెద్దాయనకు బుకీలు రూ.50 లక్షలకుపైగా ఖరీదుచేసే బీఎండబ్ల్యూ కారును బహుకరించినట్టు తెలిసింది. సదరు అధికారి ఇంటికి కృష్ణసింగ్ స్వేచ్ఛగా వచ్చి పోయేవాడని సమాచారం. ఆ అధికారి బాగోతంపై ఆధారాలు సేకరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

శ్రీకాకుళం జిల్లాలో బుకీగా వ్యవహరించిన కిరణ్‌తో పలువురు పోలీస్ అధికారులు సన్నిహితంగా ఉండేవారు. కిరణ్, అతని సోదరుడు రవి కలిసి కోట్లు సంపాదించారు. పట్టణంలో పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఆ క్రమంలోనే కిరణ్‌తో ఓ పోలీస్ అధికారికి సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఆయన తరఫున ఇద్దరు సీఐలు లావాదేవీలు నడిపేవారు. వారిలో ఒకరికి రాష్ట్రంలో అతి పెద్ద నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా ఉందని పోలీస్ బాస్‌లకు సమాచారం లభించింది. మరోవైపు విశాఖ జిల్లాకు సంబంధించి సురేశ్, అయిలాపురం రవి, అయిలాపురం బుజ్జి, రమేశ్ తదితరులు బెట్టింగ్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరితోపాటు అనేక మంది సబ్ బుకీలు, పంటర్లు, ఫైనాన్షియర్లు, అసిస్టెంట్లు ఉన్నారు. అనకాపల్లిలో ప్రభాకర్ అనే వ్యక్తి బుకీగా కీలకంగా వ్యవహరిస్తున్నాడని తెలిసింది. సురేశ్‌కు విశాఖ జిల్లాకు చెందిన ఓ సీఐతో సన్నిహిత సంబంధాలు విచారణలో తేలింది. బెట్టింగ్ లింకులతో భారీగా వెనకేసిన ఆ అధికారి... అడ్డగోలు సొమ్మును రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల్లోకి మళ్లించాడు. దీనిని నిఘా వర్గాలు కూడా ధ్రువీకరించుకున్నట్లు సమాచారం. ఇక... గుంటూరులో కె.శ్రీను, విజయవాడలో కుమార్, కడపలో ప్రతిపక్ష కీలక నేత బంధువు, పలు రాష్ట్రాలలో బ్యూటీషియన్‌గా పేరుగాంచిన ఒక మహిళ భర్త క్రికెట్ బెట్టింగ్‌లలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన ఆధారాలన్నీ సేకరించిన పోలీసులు... తదుపరి చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. బుకీలు, సూత్రధారులూ సరే... మరి, వారితో అంటకాగి, సొమ్ములకోసం కక్కుర్తి పడిన పోలీసు అధికారులను ఏం చేస్తారు? ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

పీఎఫ్ ఖాతా నంబరు ఇక శాశ్వతం

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఉద్యోగులకు శుభ వార్త. వారు ఉద్యోగం మారినా, భవిష్యనిధి (పీఎఫ్) ఖాతా నంబరు అలాగే కొనసాగనుంది. దీని వల్ల ఉద్యోగి సంస్థ మారినా, కొత్తగా మళ్లీ పీఎఫ్ ఖాతాను ప్రారంభించాల్సిన అవసరం ఉండదు. వచ్చే నెల నుంచి ఈ విధానం అమలులోకి రానుందని చీఫ్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ వీపీ జాయ్ వెల్లడించారు. ఉద్యోగులకు మరింత సేవలందించేందుకు 'ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ' (ఈపీఎఫ్ఓ) పనితీరులో మార్పు కోసం కృషి చేస్తున్న ఆయన, ఆ దిశలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పీఎఫ్ ఖాతాను పదవీ విరమణ వయస్సు కంటే ముందుగానే రద్దు చేసుకోవడం సంస్థకు ఓ సవాల్‌గా మారింది. ఈ క్రమంలో పీఎఫ్ ఖాతాలు శాశ్వతంగా కొనసాగేలా విధానాన్ని అమలు చేయనున్నారు. ఉద్యోగులు మధ్యలో తమ ఖాతాలు రద్దు చేసుకోవడం సరికాదని, అందుకే శాశ్వత నంబరు విధానాన్ని అమలు చేస్తున్నామని జాయ్ పేర్కొన్నారు. పీఎఫ్ ఖాతా నంబరుకు ఆధార్ జోడించడం తప్పనిసరి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉద్యోగి సంస్థ మారితే, మూడు రోజుల్లో అతడి ఖాతా కొత్త సంస్థకు బదిలీ అయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు జాయ్ వివరించారు.

దేనికైనా రెడీ!



- **సిక్కిం, అరుణాచల్ వెంట భారత్ బలగాల మోహరింపు**
- **'అప్రమత్తత' స్థాయి పెంచిన సైన్యం**
- **చైనాను ఎదుర్కొనేందుకు సిద్ధం**
- **ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం: అరుణ్ జైట్లీ**
- **భూటాన్ విదేశాంగ మంత్రితో సుష్మా భేటీ**

న్యూఢిల్లీ, ఆగస్టు 11: భారత సైన్యం అప్రమత్తమైంది. సిక్కిం నుంచి అరుణాచల్ వరకు చైనాతో ఉన్న 1400 కిలోమీటర్ల సరిహద్దు వెంబడి... 45వేల మంది బలగాలను మోహరించింది. భద్రతా దళాలకు జారీ చేసే 'హెచ్చరిక స్థాయి'ని పెంచింది. డోక్లాంపై చైనా దూకుడును పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీనియర్ సైనికాధికారి ఒకరు తెలిపారు. డోక్లాంకు కొద్ది దూరంలో ఉన్న సుక్నాలో భారత సైన్యానికి చెందిన 33 కార్ప్స్ ప్రధాన కేంద్రం ఉంది. అరుణాచల్‌లో 3 కార్ప్స్, అసోంలో 4 కార్ప్స్ ప్రధాన కేంద్రాలు ఉన్నాయి. సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌ల్లో భారత్, చైనా సరిహద్దు రక్షణ బాధ్యతలను ఈ మూడింటికి అప్పగించారు. 33 కార్ప్స్‌ను మాత్రం ప్రత్యేకంగా డోక్లాం పరిసర ప్రాంతాల్లోనే మోహరించినట్లు సమాచారం. అయితే, డోక్లాంలో ఎలాంటి అదనపు బలగాలను మోహరించలేదని ఓ సైనికాధికారి తెలిపారు. ఎనిమిది వారాలుగా 350 మంది సైనికులు మాత్రమే డోక్లాంలో ఉన్నారని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకైనా భారత సైన్యం సిద్ధంగా ఉందని కేంద్ర రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. డోక్లాం పేరును నేరుగా ప్రస్తావించకుండా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు శుక్రవారం జైట్లీ సమాధానమిచ్చారు. భారత సైనిక సామర్థ్యంపై ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. రక్షణ శాఖ పరిశ్రమలను మూత వేస్తారన్న వార్తలను జైట్లీ ఖండించారు. మరోవైపు భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ భూటాన్ విదేశాంగ మంత్రి డామ్చో డోర్జీతో శుక్రవారం భేటీ అయ్యారు. డోక్లాం సంక్షోభంతోపాటు పలు ద్వైపాక్షిక అంశాలను వీరు చర్చించినట్లు సమాచారం. డోక్లాం సంక్షోభం శాంతియుతంగా పరిష్కారమవుతుందన్న ఆశాభావాన్ని డోర్జీ వ్యక్తం చేశారు. ఢిల్లీలో జరుగుతున్న బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కో-ఆపరేషన్ (బిమ్‌స్టెక్) దేశాల సదస్సుకు డోర్జీ హాజరయ్యారు. కాగా, డోక్లాం సమస్యను భారత్, చైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని అమెరికా సూచించింది.

హిందూ మహాసముద్రంపై చైనా కన్ను!

- **నేవీకి భారీగా పెరిగిన బడ్జెట్ కేటాయింపులు**

బీజింగ్, ఆగస్టు 11: దక్షిణ చైనా సముద్రంపై పట్టు బిగిస్తున్న చైనా తాజాగా తన దృష్టిని హిందూ మహాసముద్రంపై సారించింది. అందులో భాగంగా తన నౌకాదళాన్ని బలోపేతం చేసుకొనే దిశగా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ) అడుగులు వేస్తోంది. బడ్జెట్ కేటాయింపుల్లో అధిక భాగం నౌకాదళానికే కేటాయిస్తోంది. ఇప్పటికే దక్షిణ చైనా సముద్ర తీరంలో కీలకమైన సౌత్ సీ ఫ్లీట్(ఎస్ఎస్ఎఫ్) నేవీ బేస్‌ను భారీగా ఆధునికీకరించింది. ఝుంజియాంగ్ నగరంలోని సౌత్ సీ ఫ్లీట్‌ను సందర్శించేందుకు భారత పాత్రికేయ బృందానికి ఇటీవల చైనా నేవీ అనుమతి ఇచ్చింది. కీలకమైన నేవల్ బేస్‌ను సందర్శించేందుకు భారత పాత్రికేయులను అనుమతించడం ఇదే తొలిసారి. వారితో డిప్యూటీ చీఫ్ కెప్టెన్ లియాంగ్ తియాంజున్ మాట్లాడుతూ.. హిందూ మహాసముద్రం కీలక ప్రాంతమని, ఆ ప్రాంత భద్రతను భారత్‌తో కలిసి ఉమ్మడిగా చేపట్టాలన్నది చైనా అభిప్రాయమని తెలిపారు.

మరింత సరళం!



- లోడింగ్, రవాణా, అన్‌లోడింగ్‌కు ఒకే ధర
- పట్టణాలు, నగరాలపై ప్రత్యేక దృష్టి
- లారీలపై పోలీసు అజమాయిషీకి చెక్
- రాష్ట్ర సరిహద్దులకే నియంత్రణ పరిమితం
- ఖాళీ స్థలాల్లో ఇసుక నిల్వ చేస్తే కేసులు
- ప్రత్యేక పాలసీ రూపకల్పనకు రంగం సిద్ధం
- ఇసుక ధరలు ఖరారు చేసిన ప్రభుత్వం
- అధిక మొత్తం అడిగితే రెండేళ్ల జైలు, 2లక్షలు జరిమానా
- మంత్రి సుజయ కృష్ణ రంగారావు హెచ్చరిక

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రీచ్‌ల్లో ఇసుకను లారీలోకి లోడింగ్ చేయడానికి ఒక రేటు ఇవ్వాలి. దాన్ని నిర్మాణ ప్రాంతాలకు తరలించడానికి మరో రేటు చెల్లించాలి. అక్కడ అన్‌లోడింగ్ చేయడానికి మళ్లీ డబ్బు కట్టాలి. ఇలా అడుగడుగునా చేతి చమురు వదిలించుకుంటుంటే... ఉచిత ఇసుక విధానంపై వినియోగదారులకు సదభిప్రాయం ఎలా వస్తుంది. సరిగ్గా ఇదే ఆలోచన ప్రభుత్వానికీ వచ్చింది. ఇటీవల జరిపిన ప్రజా సాధికార సర్వేలో ఉచిత విధానంపై 60శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయడానికి ఇదే కారణమనే అభిప్రాయానికి వచ్చింది. దీంతో ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని సరళీకరిస్తూ మరో ప్రత్యేక పాలసీ రూపొందించేందుకు సిద్ధమైంది. ఇసుక ధరల వినియోగదారుల్లో అసంతృప్తిని నివారించాలంటే లోడింగ్, రవాణా, అన్‌లోడింగ్ అన్నింటికీ కలిపి ఒకే ధరను ఖరారు చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇసుక సాఫీగా లభ్యమైతే నిర్మాణ సంస్థలకు, సర్కారుకు ఎలాంటి తలనొప్పులూ ఉండవని భావిస్తోంది.

పోలీసు ప్రమేయానికి బ్రేకులు

ప్రభుత్వ ఖజానాకు చిల్లుపడుతున్నా లెక్క చేయకుండా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నా జిల్లా, స్థానిక యంత్రాంగాల పర్యవేక్షణ లోపం కారణంగా ఇసుక మాఫియా రీచ్‌లను ఆక్రమిస్తోంది. ఈ మాఫియా నీడను దాటుకుని బయటకు వచ్చే లారీలను పోలీసులు అడ్డగిస్తున్నారు. నిర్మాణ ప్రాంతాలకు ఇసుకను చేరవేస్తున్నట్లుగా ఆధారాలు చూపాలంటూ నిలదీస్తున్నారు. ఇసుక ఉచితమైనపుడు ఆధారాలెందుకని డ్రైవర్లు ప్రశ్నిస్తే లారీలను పోలీసు స్టేషన్లకు తీసుకువెళ్తున్నారు. అక్రమ రవాణా అంటూ కేసులు రాస్తున్నారు. లారీకి లక్ష నుంచి లక్షన్నర ఇవ్వాలంటూ కొందరు పోలీసులు సతాయిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ కారణంగానే ఉచిత ఇసుక విధానానికి మరక అంటుతోందని ప్రభుత్వం భావిస్తోంది. ఇటువంటి చర్యలతో ప్రభుత్వం సత్సంకల్పంతో చేసే పనులకూ ప్రజల్లో స్పందన రావడం లేదని.. పైగా ఆక్రోశం వ్యక్తం అవుతోందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ఎక్కడైనా ఇసుక యథేచ్ఛగా వాడుకునే వెసులుబాటు ఉన్నప్పుడు పోలీసు ప్రమేయం అవసరం లేదని, ఇసుకను రాష్ట్ర సరిహద్దులు దాటకుండా నియంత్రిస్తే చాలని చెబుతోంది. రీచ్‌లలో మాఫియా పడగ లేకుండా, నిర్మాణ సంస్థలకు అవసరమైన సమయంలో ఇసుక చేరేలా సరళమైన విధానాన్ని రూపొందించాలని ఇటీవల సీఎంతో జరిగిన రివ్యూ సమావేశం తర్వాత గనులశాఖ నిర్ణయించింది.

ఇసుక ధరలు ఖరారు

రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక ధరలను ఖరారు చేశామని మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు చెప్పారు. లోడింగ్, రవాణా చార్జీలు కలిపి ఖరారు చేసిన ఈ ధరల కంటే ఎక్కువ చెల్లించాలని ఎవరైనా డిమాండ్ చేస్తే పరిష్కార వేదిక టోల్‌ఫ్రీ నంబరు 1100కు ఫోన్ చేయాలని కోరారు. అధిక మొత్తాన్ని డిమాండ్ చేస్తే రెండేళ్ల జైలు, 2లక్షల వరకూ జరిమానా వేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో 294 ఇసుక రీచ్‌లు పనిచేస్తున్నాయని.. మరో 186 రీచ్‌లను వేర్వేరు కారణాలతో మూసివేశామన్నారు. రాష్ట్రంలోని వివిధ రీచ్‌ల్లో 1,45,40,723 క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉందని, ఇందులో 68,58,545 క్యూబిక్ మీటర్లను ఉచిత ఇసుక విధానం కింద వినియోగించుకోవచ్చని మంత్రి చెప్పారు.

ఇసుక ఉచితం అనే భావన కలిగిస్తాం



రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నా ఇప్పటికీ కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. వాటిని పరిష్కరించి ఇసుక ఉచితమే అనే భావాన్ని కలిగించేలా పాలసీని తీసుకొస్తాం. నగరాలు, పట్టణాలలో నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు సామాన్యులకు కోరుకున్న వెంటనే ఇసుక లభ్యమయ్యేలా రవాణా వ్యవస్థను రూపొందించేలా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే సరళమైన ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొస్తాం.


- సుజయ కృష్ణ రంగారావు, మంత్రి, గనులశాఖ

నూతన విధానం ఇలా...

- ఎలాంటి నిబంధనలూ, షరతులు లేకుండా ఉచిత ఇసుక విధానం సరళంగా ఉండాలి.
- నిర్మాణ ప్రాంతాల్లో మినహా ఖాళీ స్థలాల్లో కొండలా ఇసుకను నిల్వ చేసేందుకు వీల్లేదు. ఇలా నిల్వచేసే స్థల యజమానులపై గనులశాఖ చట్టం మేరకు కేసులు నమోదు చేయాలి.
- గ్రామీణ,, పట్టణ, నగర ప్రాంతాల మధ్య రవాణా చార్జీలలో వ్యత్యాసం ఉంచాలి.
- అమరావతి, గుంటూరు, విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇసుక రవాణా సాఫీగా జరిగేలా చూడాలి.
- ఇసుక లారీలపై పోలీసు అజమాయిషీని నియంత్రించాలి. రాష్ట్ర సరిహద్దుల వద్ద పోలీసు పహారా ఉండాలే తప్ప, నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో అవసరం లేదు.
- ఇసుక రవాణా విషయంలో జరిగే దౌర్జన్యాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై మాత్రం పోలీసులు కఠినంగా వ్యవహరించాలి.

ఆర్డర్.. ఆర్డర్

మాజీ ఐఏఎస్ శామ్ బాబ్‌కు ఊరట



హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్ కేసులో నిందితునిగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి బుసి శామ్ బాబ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. లేపాక్షి నాలెడ్జి హబ్‌కు భూకేటాయింపులకు సంబంధించిన వ్యవహారంలో సీబీఐ ఆయనపై దాఖలు చేసిన చార్జిషీట్‌లో కేసును హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ ఎం.సీతారామ్మూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శామ్ బాబ్‌పై అవినీతి నిరోధక చట్టం కింద ప్రాసిక్యూషన్‌కు అనుమతి నిరాకరించాయని, అప్పటికి శామ్ బాబ్ సర్వీసులోనే ఉన్నారని...ఈ ఉత్తర్వులను సీబీఐ న్యాయస్థానాల్లో సవాల్ చేయలేదని జడ్జి గుర్తుచేశారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కొనసాగించండి

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు కమిషన్ కార్యాలయంలోని ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల్లో కొనసాగించాలని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. వారికి జీతభత్యాలను ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన 58:42 శాతం నిష్పత్తిలో చెల్లించాలని ఆదేశించింది. ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఈనెల 16నుంచి విధుల్లోకి తీసుకోవాలని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. సమాచార హక్కు కమిషన్ ఏర్పాటు చేయని కారణంగా వారిని ఉద్యోగం నుంచి తొలగించడం సరైన విధానం కాదని అభిప్రాయపడింది.

జీవో 64ను నిలిపివేసిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో 64ను హైకోర్టు నిలుపుదల చేసింది. ఏవో, ఏఈవో పోస్టుల భర్తీకి భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) గుర్తించిన విద్యాసంస్థలు ఇచ్చిన సర్టిఫికెట్లే ఉండాలన్న నిబంధనను సడలిస్తూ జూలై 27న ప్రభుత్వం ఈ జీవో ఇచ్చింది. ఈ జీవో బోగస్ డిగ్రీలు కలిగిఉన్న వారు ఏవో, ఏఈవో పోస్టులు పొందడానికి అవకాశం కల్పించేలా ఉందంటూ... దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు ధర్మాసనం విచారించింది. బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందడానికి అవకాశం కల్పించరాదని అభిప్రాయపడింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి, వ్యవసాయ కమిషనర్‌కు నోటీసులు జారీచేసింది.

తుది తీర్పునకు లోబడి సూపర్‌స్పెషాలిటీ సీట్లు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, కాళోజీ వర్సిటీల్లో భర్తీ చేసిన సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్లు తమ తీర్పుకు లోబడి ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. తెలుగు అభ్యర్థులతోనే ఆ సీట్లను భర్తీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనిల ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. ఎన్టీఆర్, కాళోజి ఆరోగ్య విశ్వవిద్యాలయాల్లో సూపర్ స్పెషాలిటీ కోర్సులకు చెందిన సీట్లను జాతీయ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలంటూ ఢిల్లీలోని హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్, కేంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేయడాన్ని పీజీ వైద్య విద్యార్థి బి.సతీష్‌కుమార్‌తో పాటు పలువురు అభ్యర్థులు సవాల్ చేశారు. స్పందించిన ధర్మాసనం.. కౌంటర్లు దాఖలు చేయాలని రెండు వర్సిటీలను ఆదేశిస్తూ విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది.

పోలవరం జోరు చూద్దాం!



- 18న పార్లమెంటరీ కమిటీ ప్రాజెక్టు పర్యటన
- 19న విశాఖలో తోటపల్లిపై సమీక్ష
- 16న అటార్నీ జనరల్ రాక స్వాగతిస్తున్నాం: రాష్ట్రం

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పోలవరం బహుళార్థసాధక ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు పార్లమెంటరీ కమిటీ ఈ నెల 18న రాష్ట్రానికి రానుంది. పోలవరం పనులపై రాష్ట్రానికి చెందిన సభ్యులు పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఇటీవల ప్రశ్నిస్తున్నారు. కేంద్రం కూడా సమాధానాలిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పనుల వేగాన్ని పర్యవేక్షించేందుకు బీజేపీ ఎంపీ హుకుం సింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ వస్తోంది. 18న ప్రాజెక్టు పనుల వేగాన్ని పరిశీలించి అధికారులతో చర్చించనుంది. మరుసటి రోజు పనుల తీరుపై మంత్రి దేవినేని ఉమ, జల వనరుల కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావులతో సమీక్షించనుంది. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతిని అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తారు. అనంతరం కమిటీ విశాఖకు వెళ్లి తోటపల్లి బ్యారేజీ పనులు, ఇతర సాగునీటి పథకాలపై సమీక్షిస్తుంది.

కష్టం వెలుగులోకి వస్తుంది: రాష్ట్రం

పార్లమెంటరీ కమిటీ రాకను రాష్ట్ర జల వనరులశాఖ స్వాగతిస్తోంది. పోలవరం పనులను కమిటీ పర్యవేక్షిస్తే.. వాస్తవమేమిటో తెలుస్తాయని పేర్కొంటోంది. ఈ కమిటీ తన నివేదికను సభకు అందిస్తుందని.. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం చంద్రబాబు పోలవరం కోసం ఎంతగా కృషి చేస్తున్నారో వెలుగులోకి వస్తుందని అభిప్రాయపడుతోంది. అదేసమయంలో ప్రాజెక్టు అంచనాల పెంపు, నిధుల విడుదల, అనుమతుల మంజూరు వంటివి సకాలంలో పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా, జల వనరుల శాఖ చేపడుతున్న సాగు నీటి పథకాలపై ఆడిటర్ జనరల్ లేవనెత్తిన సందేహాల నివృత్తి కోసం ఈ నెల 16న అటార్నీ జనరల్ విజయవాడకు రానున్నారు.

ఇంధన పొదుపుపై ఏపీలో జాతీయ సదస్సు

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మరో జాతీయ స్థాయి సదస్సుకు ఆతిథ్యం ఇచ్చేందుకు రాష్ట్రం సిద్ధమవుతోంది. ఇక్కడ అమలు చేస్తున్న విద్యుత్తు పొదుపు, సంరక్షణ విధానాలను వివరించేందుకు వీలుగా త్వరలోనే రాష్ట్రం వేదికగా జాతీయ స్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ) డైరెక్టర్ జనరల్ అభ్య భాక్రే వెల్లడించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్‌తో ఆయన మాట్లాడుతూ ఇంధన పొదుపు, సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని ప్రశంసించారు.

గంగిరెడ్డికి పెరోల్ తిరస్కరించిన ప్రభుత్వం

చిత్తూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా వ్యవహారంలో కీలక నిందితుడు కొల్లం గంగిరెడ్డిని పెరోల్‌పై విడుదల చేయాలని అతని భార్య మాళవిక పెట్టుకున్న అభ్యర్థనను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది. హైకోర్టులో అతని పెరోల్‌కు సంబంధించిన రిట్ పిటిషన్‌పై విచారణ పెండింగులో ఉన్న కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కడప జిల్లా పుల్లంపేటకు చెందిన గంగిరెడ్డి(46) ఎర్రచందనం అక్రమ రవాణాలో ప్రధాన నిందితుడుగా ఉన్న సంగతి తెలిసిందే. అతనిపై పలు కేసులు నమోదయ్యాయి. గతంలో సీఎం చంద్రబాబుపై హత్యాయత్నానికి కూడా కుట్ర పన్నినట్టు ఈయనపై నేరారోపణ ఉంది. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో బాహాటంగా కార్యకలాపాలు సాగించిన గంగిరెడ్డి 2014లో టీడీపీ ప్రభుత్వం రావడంతో అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అనంతరం దేశం విడిచి మారిషస్ పరారయ్యాడు. అయితే అతని ఆచూకీ రాబట్టిన ప్రభుత్వం చివరికి మారిషస్ నుంచీ రప్పించి అరెస్టు చేయించింది.

ఎంబీబీఎస్ 216.. బీడీఎస్ 219

- తెలంగాణలో తొలి దశ కౌన్సెలింగ్‌లో మిగిలిన వైద్య సీట్లు

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మొదటి దశ కౌన్సెలింగ్ తరువాత 216 ఎంబీబీఎస్ సీట్లు, 219 బీడీఎస్ సీట్లు మిగిలాయి. ఈ సీట్ల భర్తీకి 12 నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ హెల్త్ యూనివర్సిటీ ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేసింది. తొలి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారు తమకు కేటాయించిన కాలేజీల్లో చేరకపోవడంతో ఇవి మిగిలాయి. వీటిలో ఎక్కువగా ఏపీ విద్యార్థులు వదిలిపెట్టినవే ఉన్నాయి. 15 శాతం అన్ రిజర్వ్ సీట్లకు ఇరు రాష్ట్రాల విద్యార్థులు పోటీ పడే అవకాశం ఉన్న విషయం తెలిసిందే. అయితే ఏపీ విద్యార్థులు ఇక్కడ సీట్లను పొందినప్పటికీ.. ఏపీ కాలేజీల్లోనూ వారికి సీట్లు దక్కి ఉంటాయి. దాంతో ఇక్కడి సీటును వదులుకుని వారు ఏపీలో చేరడంతో తొలి దశలో ఎక్కువ ఎంబీబీఎస్ సీట్లు మిగిలాయి. బీడీఎస్ సీట్లదీ అదే పరిస్థితి. తొలి దశలో సీట్లు వచ్చి, వాటిలో చేరని విద్యార్థులకు రెండవ దశ కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం లేదు. రెండో దశ కౌన్సెలింగ్‌కు శనివారం నుంచి 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులు ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చు.

కాలర్ పట్టుకొని నిలదీస్తారు!

- మాట తప్పిన నేతల్లో ఆ భయాన్ని కలిగించాలి
- చంద్రబాబు ఒక్క హామీ నెరవేర్చలేదు
- అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు
- ఓటుకు 5వేలు ఇస్తామని వస్తున్నారు
- దెయ్యాలకు ఓటుతో గుణపాఠం: జగన్
- నంద్యాల నియోజకవర్గంలో రోడ్‌షో



నంద్యాల రోడ్ షోలో మాట్లాడుతున్న జగన్

కర్నూలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రతిపక్ష నేత జగన్ విమర్శల దాడి కొనసాగుతోంది. 'మూడున్నరేళ్ల పాలనలో సీఎం చంద్రబాబు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ఇచ్చిన మాట తప్పితే జనం కాలర్ పట్టుకొని నిలదీస్తారన్న భయాన్ని రాజకీయ నేతల్లో కలిగించాలి' అని జగన్ వ్యాఖ్యానించారు. శుక్రవారం నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో జగన్ పాల్గొన్నారు. నంద్యాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు చెప్పిన ఒక్క మాట కూడా నెరవేర్చలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, రైతులను, పొదుపు మహిళలను, చివరకు నిరుద్యోగులను కూడా మోసం చేశారని విమర్శించారు. 'ప్రతి పేదవాడికి ఇల్లు, మూడు సెంట్లు స్థలం ఇస్తామన్నారు. పేదవాడి ఆశలతో ఆడుకున్నారు.' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిభూములను సైతం వదలకుండా చంద్రబాబు దోచుకుంటున్నారని విమర్శించారు. నంద్యాల ప్రజలు కేవలం ఎమ్మెల్యేను ఎన్నుకోవడానికి మాత్రమే ఓటు వేయడం లేదని, మూడున్నరేళ్ల చంద్రబాబు పనితీరుకు ఓటు వేస్తున్నారని జగన్ పేర్కొన్నారు. ప్రజలు సరైన తీర్పు చెప్పాలని, వారి ఓటుతో రాష్ట్ర రాజకీయాలే మారిపోతాయన్నారు. వైఎస్ హయంలో కేసీ కాల్వ కింద మూడు పంటలకు నీరు వచ్చేదని, ఇప్పుడు ఒక్క పంటకు నీరు రావడమే గగనంగా మారిందన్నారు. తాము అధికారంలోకి వస్తే గుండ్రేవుల ప్రాజెక్టును పూర్తి చేసి కేసీ కాల్వ కింద రెండు పంటలకు నీరు ఇస్తామన్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణంపై సాధ్యాసాధ్యాల పరిశీలనకు అధ్యయనం చేయిస్తామన్నారు. 'చంద్రబాబు రూ.5 వేలు ఇచ్చి ఓట్లు కొనేందుకు వస్తారు. రూ.5 వేలు చేతిలో పెట్టి జేబులో నుంచి దేవుడి పటం తీసి ప్రమాణం చేయించుకుంటారు. ఏ దేవుడు కూడా పాపానికి ఓటు వేయమని చెప్పడు. ఆ మాటలు చెప్పేది దయ్యాలు. ఆ దయ్యాలకు ఓటుతో గుణపాఠం చెప్పండి' అని జగన్ పిలుపునిచ్చారు.

చెరువు కోసం మోహన్ అన్న డబ్బులిస్తారు!

- పాండురంగాపురంలో జగన్ వ్యాఖ్యలు
- ఓటర్లను ప్రలోభపెట్టడమేనన్న టీడీపీ

పాండురంగాపురంలో జగన్ మాట్లాడుతూ.. 'బాపూజీనగర్‌లో ఉండే వాళ్లంతా పొలం పని చేసుకొనేవాళ్లే. వాళ్లు అడిగేది ఒక్కటే తాగేందుకు కాసిన్ని నీళ్లు ఇవ్వమంటున్నారు. వారికి ఒక ఎకరా స్థలం ఇచ్చి, అక్కడ చెరువు తవ్వి వారికి తాగునీరు అందిద్దాం. ఆ భూమికి అవసరమైన డబ్బు, ఇతర ఏర్పాట్లు మన మోహన్ అన్న (వైసీపీ అభ్యర్థి శిల్పామోహన్ రెడ్డిని చూపి) చూస్తారు' అని జగన్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ఓటర్లను ప్రలోభపెట్టడమేనని స్థానిక టీడీపీ నేతలు పేర్కొంటున్నారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



సీఎం చంద్రబాబుపై వైసీపీ అధ్యక్షుడు జగన్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నంద్యాలలో వేలాది మందితో టీడీపీ నిరసన చేపట్టింది. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు

జగన్‌ది ఉన్మాదం

- తారస్థాయికి చేరింది: యనమల
- రాయలసీమ ద్రోహి ఆయనే: కాల్వ

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: ముఖ్యమంత్రి చంద్రబాబుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై రాష్ట్ర మంత్రులు, టీడీపీ నేతలు మండిపడుతున్నారు. చంద్రబాబును చంపితే సీఎం సీటు జగన్‌కు దక్కుతుందా అని మంత్రి యనమల రామకృష్ణుడు విస్మయం వ్యక్తం చేశారు. ఆయన ఉన్మాదం తారస్థాయికి చేరుతోందని, అందుకే పదేపదే సీఎంను చంపాలంటున్నారని ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. రాయలసీమ ద్రోహులెవరో జగన్ ఆత్మ విమర్శ చేసుకోవాలని మంత్రి కాల్వ శ్రీనివాసులు సూచించారు. జగన్ మానసిక స్థితిని చూస్తే జాలేస్తోందని మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆయన్ను విశాఖ మెంటల్ ఆస్పత్రిలో చేర్పాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ అన్నింటికీ తెగించిన మూర్ఖుడని.. 16 నెలలు జైలులో ఉండి వచ్చాను.. అంతకన్నా ఏం చేస్తారనే సీఎంపై నోరుపారేసుకుంటున్నాడని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేటలో విమర్శించారు. అశాంతి, అలజడులు సృష్టిస్తున్న జగన్‌ను నంద్యాలకు రానివ్వకుండా ఎన్నికల కమిషన్ నిషేధించాలని మంత్రి నక్కా ఆనంద్ బాబు చీమకుర్తిలో డిమాండ్ చేశారు. జగన్ ప్రతిపక్ష నేత హోదాకు ఏ మాత్రం పనికిరారని, ప్రజాస్వామ్యాన్ని అపహస్యంచేసే విధంగా మాట్లాడుతున్నారని మంత్రి నారాయణ ఒంగోలులో విమర్శించారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని నడిరోడ్డుపై కాల్చాలనడం, ఉరి శిక్ష వేసినా తప్పులేదనడం సరైందికాదని అనంతపురం టీడీపీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి ఉరవకొండలో అన్నారు. వైఎస్ కొడుకు కాకుంటే జగన్‌ది గుడిసె బతుకని టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గుంటూరులో వ్యాఖ్యానించారు. ఆయనకు అంతు చిక్కని మానసిక రోగం ఉందని, దేవుడే సరైన మందు ఇస్తాడని అన్నారు. జగన్‌కు ప్రొజెక్షన్ అనే రోగం ఉన్నట్లు తనకు వైద్యులు చెప్పారని గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ గన్ని కృష్ణ రాజమహేంద్రవరంలో అన్నారు. అదినయం కాకపోతే ఆయన ప్రజలనే కాల్చేస్తారని వ్యాఖ్యానించారు. జగన్‌కి అత్యవసర మానసిక చికిత్స అవసరమని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. తెలంగాణ రాష్ట్ర టీడీపీ నేతలు కూడా జగన్‌పై విరుచుకుపడ్డారు. అడ్డగోలు విమర్శలను కొనసాగిస్తే రాయలసీమ ప్రజలు ఆయనను రాజకీయంగా ఉరి తీయడం ఖాయమని టీడీపీ-టీఎస్ అధ్యక్షుడు ఎల్.రమణ హెచ్చరించారు.

పీకేపై కేసుకు టీడీపీ యోచన?

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ తనకు ఎన్నికల వ్యూహకర్తగా నియమించుకున్న ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకేపై పోలీస్ కేసు దాఖలుకు తెలుగుదేశం పార్టీ యోచిస్తున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. పీకే బృందం సామాజిక మీడియాలో వేల నకిలీ ఖాతాలను తెరిచి సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా పోస్టింగులు పెడుతోందని టీడీపీ ఇప్పటికే కొన్ని ఆధారాలను సేకరించి బయటపెట్టింది. ఆ వ్యవహారం క్రమంగా వేడెక్కుతోంది. ఈ నేరానికి ప్రశాంత్ కిశోర్‌పై సైబర్ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య శుక్రవారమిక్కడ డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల సమయంలో ప్రశాంత్ కిశోర్‌పై ఏడు కేసులు నమోదయ్యాయని, ఇందులో ఒకటి సైబర్ కేసని తెలిపారు. ఆ కేసుల వివరాలు తెప్పించడానికి ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు.

కొండ కిటకిట




తిరుమలలో బారులు తీరిన భక్తులు

వరుస సెలవులతో తిరుమలలో పెరిగిన రద్దీ

అమరావతి/తిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో శుక్రవారం నుంచే రద్దీ ఊపందుకుంది. పెద్దసంఖ్యలో యాత్రికులు కొండపైకి చేరుకున్నారు. కంపార్టుమెంట్లు నిండిపోవడంతో సర్వదర్శనం క్యూ 2కిలోమీటర్ల వరకు వ్యాపించింది. సర్వదర్శనానికి 20 గంటలు పడుతోందని టీటీడీ అధికారులు ప్రకటించారు. ఆలయ పరిసరాలు, లడ్డూ కౌంటర్లు, అఖిలాండం.. ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కాగా, అన్నప్రసాదాన్ని క్యూలైన్ల వద్దకు తీసుకొచ్చారు. అప్పటికే ఆకలితో ఉన్న భక్తులు ఒక్కసారిగా క్యూలైన్ల నుంచి బయటకు వచ్చారు. అందరూ భోజనం కోసం పోటీపడటంతో తోపులాటలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, బ్యాంకు ఉద్యోగులకు శనివారం నుంచి వరుసగా 4రోజుల పాటు సెలవులే సెలవులు. దీంతో సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచే సెలవుల మూడ్ కనిపించింది. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు మధ్యాహ్న భోజనం తర్వాత వెళ్లిపోయారు. సచివాలయ ఉద్యోగులకు గురువారం కూడా ఆప్షనల్ హాలిడే ఉంది. దీంతో కొందరు బుధవారం కూడా సెలవుపెట్టేశారు. ఒక్క రోజు సెలవు పెడితే వారికి వరుసగా 6రోజుల పాటు సెలవులు వచ్చినట్లే.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం





మధురమైన స్నేహమంత ప్రీతి... అటుకులంటే ఆయనకు. 'వెన్న దొంగ' అని పిలిచినా ఫర్వాలేదనేంత ఇష్టం వెన్న ముద్దలంటే. ఇన్ని అటుకులు, అంత బెల్లం ముక్క, మరికాస్త వెన్నముద్ద పెడితే చాలు చిలిపి కన్నయ్య ఇట్టే ప్రసన్నం అయిపోతాడు. రెండు రోజుల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి పండగ. అటుకులు, వెన్న, బెల్లం, పచ్చి శెనగపప్పులతో కన్నయ్యకు రకరకాల వంటకాల నివేదన..

గోపాల గోవిందుడు



శెనగపప్పు పాయసం

కావలసినవి:
పచ్చి శెనగపప్పు, పాలు - ఒక్కోటి ముప్పావు కప్పు చొప్పున, బెల్లం పొడి - ఒక కప్పు, ఎండుకొబ్బరి ముక్కలు - ఒక టేబుల్ స్పూన్, యాలకుల రెబ్బలు - నాలుగు (పొడి చేసి), జీడిపప్పులు, ఎండుద్రాక్షలు - అవసరమైనన్ని, నెయ్యి - రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ:
- పాన్‌లో ఒక టీస్పూన్ నూనె వేడి చేసి శెనగ పప్పుని మూడు నిమిషాలు వేగించాలి.
- తరువాత వేగించిన పప్పులో ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి ప్రెషర్ కుక్కర్‌లో పెట్టి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. స్టీమ్ వచ్చాక పప్పుని మరీ మెత్తగా కాకుండా మెదపాలి.
- ఒక గిన్నెలో బెల్లం వేసి, పావు కప్పు నీళ్లు పోసి బెల్లం కరిగే వరకు వేడిచేయాలి.
- పప్పు, యాలకుల పొడి వేసి ఐదు నిమిషాలు లేదా మిశ్రమం చిక్కబడేవరకు ఉంచాలి.
- తరువాత స్టవ్ ఆపేసి పాలు పోసి బాగా కలపాలి.
- మిగిలిన నెయ్యిని వేడిచేసి అందులో కొబ్బరి ముక్కలు, జీడిపప్పు, ఎండు ద్రాక్షలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేగించాలి. దీన్ని పాయసం మీద పోసి కలపాలి.

అటుకులు, పల్లీల లడ్డు

కావలసినవి:
అటుకులు - ఒక కప్పు, పంచదార - అరకప్పు, పల్లీగింజలు, నెయ్యి - ఒక్కోటి పావు కప్పు చొప్పున, వంటల్లో వాడే కర్పూరం - చిటికెడు, యాలకుల పొడి - ముప్పావు టీస్పూన్, జీడిపప్పులు - ఐదు.

తయారీ:
- అటుకుల్ని నూనె వేయకుండా సన్నటి మంట మీద బంగారు రంగు వచ్చే వరకు వేగించి, చల్లార్చాలి.
- పల్లీగింజలను కూడా గోధుమ రంగు వచ్చే వరకు నూనె వేయకుండా వేగించి చల్లార్చాలి. పొట్టు తీసేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి.
- తరువాత వేగించిన అటుకుల్ని మెత్తటి పిండిలా గ్రైండ్ చేయాలి.
- పంచదారను కూడా అలానే మెత్తగా గ్రైండ్ చేయాలి.
- అటుకులు, పంచదార, పల్లీగింజలు, యాలకుల పొడిని వెడల్పాటి గిన్నెలో వేసి అందులో కర్పూరం పొడి వేసి కలపాలి.
- జీడిపప్పుని చిన్న చిన్న పలుకులుగా చేయాలి. తరువాత నెయ్యి వేడిచేసి ఆ పలుకుల్ని బంగారు రంగు వచ్చే వరకు వేగించాలి.
- వేడిచేసిన నెయ్యిని అటుకుల మిశ్రమంలో పోసి స్పూన్‌తో కలపాలి.
- మిశ్రమం చేతితో పట్టుకునే వేడి ఉన్నప్పుడు లడ్డూలు చేయాలి. గాలి చొరబడని డబ్బాలో ఉంచితే రెండు వారాల వరకు పాడుకావు.



అటుకుల దద్ధ్యోదనం

కావలసినవి:
మందపాటి అటుకులు - ఒక కప్పు, పెరుగు - ఒకటిన్నర కప్పులు, మరిగించి, చల్లార్చిన పాలు - పావు కప్పు, పచ్చిమిర్చి - రెండు (సన్నగా తరిగి), అల్లం తరుగు - ఒకటిన్నర టీస్పూన్లు, పచ్చిశెనగపప్పు, ఆవాలు - ముప్పావు టీస్పూన్, మినపప్పు - పావు టీస్పూన్, కరివేపాకులు - కొన్ని, ఇంగువ - చిటికెడు, నూనె - ఒక టేబుల్ స్పూన్, ఎండుమిర్చి - రెండు, ఉప్పు - రుచికి సరిపడా.

తయారీ:
- అటుకులు మెత్తబడే వరకు నీళ్లతో కడగాలి. తరువాత నీళ్లు వంపేసి కొన్ని నిమిషాలు పక్కన పెట్టాలి.
- ఒక గిన్నెలో అటుకులు, పాలు, పెరుగు, ఉప్పు వేసి కలపాలి. కావాలంటే మరి కొంచెం పెరుగు కలపొచ్చు.
- పాన్‌లో నూనె వేడిచేసి ఆవాలు, పచ్చిశెనగపప్పు, మినపప్పులతో తాలింపు వేయాలి.
- తాలింపు గింజలు చిటపటమంటున్నప్పుడు పచ్చిమిర్చి, అల్లం, కరివేపాకు, ఎండుమిర్చి, ఇంగువ వేసి కొంచెంసేపు వేగించాలి.
- ఈ తాలింపును అటుకుల మిశ్రమం మీద పోసి కలిపితే అటుకుల దద్ధ్యోదనం సిద్ధం.



తీపి అటుకులు

కావలసినవి:
అటుకులు - ఒక కప్పు, బెల్లం పొడి - ముప్పావు కప్పు, కొబ్బరి తురుము - ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి - అరటీస్పూన్, నెయ్యి - రెండు టీస్పూన్లు, జీడిపప్పు - కొద్దిగా.

తయారీ:
- అటుకుల్ని కడిగి వడకట్టి పక్కన పెట్టాలి.
- పాన్‌లో నెయ్యి వేడిచేసి జీడిపప్పు పలుకుల్ని బంగారు రంగు వచ్చే వరకు వేగించాలి.
- పాన్‌లో బెల్లం పొడి వేసి నీళ్లు పోసి తీగ పాకం వచ్చేలా ఉడికించాలి.
- స్టవ్ మంట ఆపేసి యాలకుల పొడి, కొబ్బరి, అటుకుల మిశ్రమాన్ని వేసి కలపాలి. వేగించిన జీడిపప్పులతో అలంకరించాలి.



సౌజన్యం: www.blendwithspices.com

అటుకుల పులిహోర

కావలసినవి:
మందపాటి అటుకులు - ఒక కప్పు, చింతపండు - చిన్న నిమ్మకాయంత సైజ్, పల్లీగింజలు, జీడిపప్పులు - ఒక్కోటి రెండు టీస్పూన్ల చొప్పున, ఆవాలు, శెనగపప్పు - ఒక్కోటి అర టీస్పూన్ చొప్పున, పసుపు - పావు టీస్పూన్, నూనె - రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి సరిపడా, పచ్చిమిర్చి - మూడు, ఎండుమిర్చి - రెండు, కరివేపాకులు - కొన్ని, ఇంగువ - చిటికెడు.

తయారీ:
- చింతపండును నీళ్లలో పదినిమిషాలు నానబెట్టి రసం పిండాలి.
- అటుకుల్ని శుభ్రంగా కడిగి నీళ్లలో రెండు నిమిషాలు నానబెట్టాలి. తరువాత నీళ్లను వడకట్టి పక్కన పెట్టాలి.
- పాన్‌లో నూనె వేడిచేసి ఆవాలు, శెనగపప్పు, మినపప్పు, పల్లీగింజలు వేసి వేగించాలి. అవి చిటపటమంటున్నప్పుడు ఇంగువ, కరివేపాకులు, పచ్చిమిర్చి తరుగు, ఎండుమిర్చి, జీడిపప్పు వేసి కొంచెంసేపు వేగించాలి.
- తరువాత చింతపండు మిశ్రమం, ఉప్పు, పసుపు వేసి గరిటెతో కలిపి, మూతపెట్టి ఉడికించాలి.
- చింతపండు మిశ్రమం చిక్కగా అయ్యాక నానబెట్టిన అటుకుల్ని అందులో వేసి కలపాలి.
- ఓ మాదిరి మంట మీద రెండు నిమిషాలు ఉడికించాక స్టవ్ ఆపేస్తే అటుకుల పులిహోర రెడీ.



వెన్న ఉండలు



కావలసినవి:
మైదా, పంచదార - ఒక్కో కప్పు చొప్పున, బియ్యప్పిండి - పావు కప్పు, వెన్న - 25 గ్రాములు, నూనె - వేగించడానికి సరిపడా, వంటసోడా - చిటికెడు.

తయారీ:
- మైదా, బియ్యప్పిండి, వెన్న, వంటసోడాలను ఒక గిన్నెలో వేయాలి. అందులో గోరువెచ్చని నీళ్లు పోసి పిండిముద్దలా చేయాలి. దాని పైన తడి బట్ట వేసి ఒక గంటసేపు పక్కన పెట్టాలి.
- ఆ తరువాత చిన్న చిన్న ఉండలు చేసి వాటి మీద కూడా తడి బట్ట వేసి ఐదు నిమిషాలు ఉంచాలి.
- పాన్‌లో నూనె వేడి చేశాక వెన్న ఉండల్ని సన్నటి మంట మీద లేత గోధుమరంగుకి వచ్చే వరకు వేగించాలి.
- వేగిన ఉండల్ని చల్లారనివ్వాలి. ఈ లోపు పంచదార మునిగే అన్ని నీళ్లు పోసి తీగపాకం వచ్చేంతవరకు వేడిచేయాలి.
- పాకం రెడీ అయ్యిందా లేదా తెలుసుకునేందుకు ఒక ప్లేట్‌లో నీళ్లు పోసి అందులో ఒక చుక్క పాకం వేయాలి. అది కరిగిపోకుండా ఉంటే పాకం రెడీ అయినట్టు.
- అప్పుడు స్టవ్ ఆపేసి వేగించిన వెన్న ఉండల్ని పంచదార పాకంలో వేసి గరిటెతో కొంచెం సేపటి వరకు ఆపకుండా కలపాలి.

మళ్లీ మొదలుపెడుతున్నారా

కొంతకాలం వ్యాయామాలు ఆపేసి మళ్లీ తిరిగి మొదలెట్టాలనుకునే వాళ్లు మనలో చాలా మంది ఉంటారు. ఉదాహరణకు గుండె ఆపరేషన్ జరిగిన తర్వాత... అలాగే కేన్సర్‌కు చికిత్స తీసుకున్నప్పుడు...లాంటి సందర్భాలలో తిరిగి వ్యాయామాలు చేయడం ఎంతవరకూ మంచిది? అలా వ్యాయామాలు చేయడం వల్ల ఏవైనా రిస్కులు ఎదురవుతాయా? అలాంటి సందర్భాలలో ఆటలు కూడా ఆడొచ్చా? లాంటి సందేహాలు చాలామందిలో తలెత్తుతుంటాయి. వాటి గురించి...

- కొన్నాళ్లు వ్యాయామాలు చేయడంలో/ ఆడడంలో గ్యాప్ వస్తే తప్పనిసరిగా ఎఫెర్ట్ టెస్టు, మెడికల్ చెకప్‌లు చేయించుకోవాలి. అయితే గుండె జబ్బుల సమస్య లేని 40 ఏళ్ల లోపు వారికి ఈ పరీక్షలు తప్పనిసరికాదు కానీ 50 ఏళ్లు నిండిన ఆడవాళ్లకు, 45 ఏళ్లు వచ్చిన మగవాళ్లకు మాత్రం ఇవి చాలా ముఖ్యం.



- ఉష్ణోగ్రత బాగా ఉన్న రోజుల్లో కన్నా చల్లగా ఉన్న రోజుల్లోనే రన్నింగ్ చేస్తే మంచిదనే అభిప్రాయం ఉంది. ఇది తప్పు, రైటు కూడా. అదెలాగంటారా? ఉష్ణోగ్రతలను బట్టి ఇది ఆధారపడి ఉంటుంది. ఐదు డిగ్రీల సెంటీగ్రేడు ఉష్ణోగ్రత ఉన్నప్పుడు తీవ్రంగా గుండెకు సంబంధించిన వ్యాయామాలు చేయడం ఎలా మంచిది కాదో అలాగే 30 డిగ్రీల సెంటిగ్రేడు ఉష్ణోగ్రత ఉన్నప్పుడు వ్యాయామాలు చేయడం కూడా అంతే మంచిది కాదు. గాలిలో కాలుష్యం ఎక్కువగా ఉన్న రోజుల్లో కూడా రన్నింగ్ చేయకుండా ఉంటే ఉత్తమం.
- జ్వరంతో ఉన్నప్పుడు వ్యాయామాలకు దూరంగా ఉండడం మంచిది. జ్వరం తగ్గేందుకు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. ఫ్లూ వైరస్ లాంటివి వచ్చినపుడు వారం రోజులు వ్యాయామాలు చేయకుండా ఇంటిపట్టునే ఉండాలి.
- వ్యాయామాలు చేసేటప్పుడు నీరు బాగా తాగడం మంచిది. వ్యాయామాలు చేసేటప్పుడు ప్రతి అరగంటకు ఒకసారి ఆగి నాలుగు గుక్కల మంచినీళ్లు తాగాలి. ఇలా చేయడం వల్ల శరీరంలోని కండరాల నొప్పులు కూడా బాగా తగ్గుతాయి.

గుడ్ మార్నింగ్




తెలుసా!

భూపొరలే ఓవెన్



వెరైటీ

ట్రాఫిక్‌ను ఈదలేక!





జీవితంలో మర్చిపోలేని సందర్భాల్లో కెరీర్ ప్రారంభ దశ ఒకటి. ఎన్నో ఆశలు, మరెన్నో లక్ష్యాలతో ఉద్యోగ జీవితం ఆరంభమవుతుంది. భావి జీవితానికి ఈ దశ పునాదిగా నిలుస్తుంది. అయితే ఉద్యోగంలో చేరిన కొత్తలో ఉత్సాహంతోపాటు కొంత ఆందోళన కూడా ఉంటుంది. అప్పటి వరకు పరిచయం లేని కొత్త వ్యక్తులతో కలిసి పనిచేయడం, ఎవరితో ఏ విధంగా ప్రవర్తించాలి అనే విషయంలో అవగాహన లేకపోవడం తదితర కారణాలతో ఉద్యోగంలో చేరిన కొత్తలో ఒక రకమైన నెర్వస్‌నెస్ క్రియేట్ అవుతుంది. ఇదే ఆందోళనకు దారి తీస్తుంది. కెరీర్ ఆరంభ దశలోని ఈ మానసిక సంసిద్ధత, ఆత్మవిశ్వాసం ద్వారా ఇటువంటి సందర్భాలను సులభంగానే అధిగమించవచ్చు. అందుకు ఉపకరించే ఐదు మార్గాలు..

తడబడకుండా తొలి అడుగులు

ఉద్యోగంలో చేరిన కొత్తలో ఎంత హుషారుగా అనిపిస్తుందో అంతే స్థాయిలో ఏదో తెలియని ఒక రకమైన ఆందోళన కూడా నెలకొని ఉంటుంది. వర్క్ ఎలా చేయాలి? ఎవరితో ఏ విధంగా ప్రవర్తించాలి? సహోద్యోగులతో ఫ్రెండ్లీగా ఉండాలా? ప్రొఫెషనల్‌గా వ్యవహరించాలా? ఇటువంటి ఎన్నో సందేహాల మధ్య ఉద్యోగ జీవితం ప్రారంభమవుతుంది. అయితే పరిస్థితులకు అనుగుణంగా తనని తను సిద్ధం చేసుకుంటే ఇటువంటి సందర్భాలను తేలికగానే ఎదుర్కోవచ్చు.

రిలాక్స్‌డ్‌గా ఉండండి

ఉద్యోగంలో చేరిన మొదటి రోజు ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఎటువంటి ఆందోళనకు గురికావద్దు. బాడీ లాంగ్వేజ్ హుందాగా ఉండాలి. మొదటి రోజు కాబట్టి కొంత ఒత్తిడి ఉండటం సహజం. అయితే దీని ప్రభావం బాడీ లాంగ్వేజ్ మీద పడకుండా చూసుకోవాలి. ఒత్తిడి కారణంగా బాడీ లాంగ్వేజ్‌లో తేడా వస్తుంది. తద్వారా కొత్త వారితో త్వరగా కలిసిపోలేరు, ఆన్ ఫ్రెండ్లీ నేచర్ అనే ఇంప్రెషన్ క్రియేట్ అయ్యే ఆస్కారం ఉంటుంది. కాబట్టి ఎటువంటి ఆందోళన, ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన మనసుతో మొదటి రోజు ఉద్యోగ నిర్వహణపై దృష్టి పెట్టాలి. చక్కని కెరీర్‌కు ప్రారంభం ఈ రోజే కాబట్టి దీన్ని మంచి జ్ఞాపకంగా మలుచుకోవాలి అని మిమ్మల్ని ప్రేరేపించుకోవాలి. అప్పుడు ఎటువంటి ఒత్తిడి దరి చేరదు.

హార్డ్‌వర్క్

ఉద్యోగంలో చేరిన తొలి నాళ్లలో ఉత్సాహంతోపాటు ఒక రకమైన నర్వస్‌నెస్ కూడా క్రియేట్ అవుతుంది. ఎంతగా అంటే ఆ నర్వస్‌నెస్ వల్ల ఒక్కోసారి జాబ్ రోల్‌ను కూడా మరిచిపోతుంటారు. ఇటువంటి సందర్భాల్లో ఉత్సాహం ఒక రకమైన భయం లేదా ఉద్రేకంగా మారుతుంది. స్వయం ప్రేరణ ద్వారా ఇటువంటి సందర్భాలను అధిగమించవచ్చు. ఇందుకు ఉద్యోగం సాధించిన క్రమాన్ని ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి. వేలాది మంది పోటీదారులను దాటుకొని సదరు బాధ్యతలు నిర్వహించడానికి మీరే బెస్ట్ అని నిరూపించుకొని ఈ స్థాయికి వచ్చారు. వారందరి వల్ల కానిది మీతోనే సాధ్యమైంది. అంటే మీలో ఏదో ఒక స్పెషల్ టాలెంట్ ఉంది. అదే ఈ స్థాయికి తీసుకు వచ్చింది. ఒక గొప్ప కెరీర్‌కు ప్రారంభం ముగింట నిలిపింది. ఈ కెరీర్‌లో ఎన్నో ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఉద్యోగమిచ్చిన సంస్థ, సహోద్యోగులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. కాబట్టి నర్వస్‌నెస్‌తో ఏర్పడే భయాలను హార్డ్‌వర్క్‌తో అధిగమించడానికి ప్రయత్నించాలి.

తొందర కూడదు

ఉద్యోగంలో చేరిన కొత్తలో బాగా పనిచేయాలనే ఉత్సాహం సహజమే. అనుకున్న సమయంలో పనులు చేయాలి, ప్రతి ప్రాబ్లమ్‌కు సొల్యూషన్ సూచించాలి, మేనేజ్‌మెంట్‌ను ఇంప్రెస్ చేయాలి అనే భావన ఉండటంలో తప్పేమీ లేదు. కాకపోతే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం.. కెరీర్‌లో మీ ప్రయాణం ఇప్పుడే మొదలైంది. ఈ దశలోనే పనులన్నీ మీరే చేయాలని ఎవరూ ఆశించరు. భవిష్యత్ దృష్టి కోణంలో మీలోని సామర్థ్యాన్ని వినియోగించుకోవచ్చు అనే భావనలో రిక్రూట్ చేసుకుంటారు. కాబట్టి అన్నీ చేసేయాలి అనే తొందర మంచిది కాదు. కెరీర్ తొలి నాళ్లలో వర్క్ ఎగ్జిక్యూషన్ వంటి విషయాలను అవగాహన చేసుకోవడానికి ప్రాధాన్యతనివ్వాలి.

ఆత్మన్యూనత సరికాదు

ఉద్యోగంలో చేరిన కొత్తలో ఒక రకమైన ఆత్మన్యూనత కూడా కలుగుతుంది. సహోద్యోగులు మన కంటే ప్రతిభావంతులు, సామర్థ్యాలు కల వారు అనే ఆలోచన ఫలితంగా ఇటువంటి భావన వస్తుంది. ఇది సహజంగా జరిగేది. ప్రతి వ్యక్తికి తనదైన బలాలు, బలహీనతలు, సామర్థ్యాలు ఉంటాయి. ఇతరులతో మిమ్మల్ని మీరు పోల్చుకోవడం సరికాదు. తద్వారా మీ సామర్థ్యాన్ని మీరే తక్కువ చేసుకున్న వారవుతారు. కాబట్టి ఒకరు ఎక్కువ అని భావన సరికాదు. ఎందుకంటే అటువంటి భావనతో నెగిటివ్ ఫ్రేమ్ ఆఫ్ మైండ్ డెవలప్ అవుతుంది. ఇది కెరీర్ విషయంలో ప్రతిబంధకంగా నిలుస్తుంది. కాబట్టి సాధ్యమైనంత వరకు కామ్‌గా కూల్‌గా ఇటువంటి ఆలోచనలు దరి చేరకుండా విధులు నిర్వహించడానికి ప్రయత్నించాలి.

> ఉద్యోగంలో చేరిన కొత్తలో బాగా పనిచేయాలనే ఉత్సాహం సహజం. ఈ దశలోనే పనులన్నీ మీరే చేయాలని ఎవరూ ఆశించరు. భవిష్యత్ దృష్టి కోణంతోనే ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్ ఉంటుంది. కాబట్టి అన్నీ చేసేయాలి అనే తొందర, చేయలేక పోయామనే బాధ మంచిది కాదు.

మానసికంగా సిద్ధం

మన ఆలోచనలన్నీ ఒక క్లిష్టమైన మార్గంలోనే సాగుతాయి. ఉదాహరణకు 'కొత్త' అనే పదాన్ని తీసుకుంటే దాని వెంటనే భయం అనే భావోద్వేగం ఆటోమేటిక్‌గా జతకడుతుంది.

ఇటువంటి పరిస్థితుల్లో భయం అనేది ఒక రకమైన ఆందోళనకు కారణమవుతుంది. ఇవన్నీ మన ఆలోచనలకు ప్రతి రూపాలే. తప్ప మరొకటి కాదు. ఒక్కసారి ఎటువంటి ఆందోళన లేదు, అంత సాధారణంగా ఉంది అని భావించండి. ఒక నిమిషంలోనే అంతా సాధారణంగానే అనిపిస్తుంది. అంటే మానసికంగా సిద్ధంగా ఉండటం ద్వారా ఇటువంటి ఆలోచనలు రాకుండా చూసుకోవచ్చు. ఏదైనా కొత్త విషయాన్ని ప్రారంభిస్తున్నప్పుడు కొంత వరకు ఆందోళన ఉండటం సహజమే. ఉద్యోగంలో చేరిన కొత్తలో కూడా ఇదే జరుగుతుంది. మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకొని ఎటువంటి ఆందోళన, ఒత్తిడి లేకుండా నియంత్రించుకుంటే ఎటువంటి సమస్య ఎదురవదు. అంతా ప్రశాంతంగా అనిపిస్తుంది.

ప్రైవేట్ జాబ్స్

యూఎస్ కాన్సులేట్ జనరల్-హైదరాబాద్
పోస్టులు: సివిల్ ఇంజనీర్, మెకానికల్ ఇంజనీర్, ఎలక్ట్రికల్ ఇంజనీర్, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్స్, ఫారెన్ సర్వీస్ నేషనల్ ఇన్వెస్టిగేటర్, షిప్‌మెంట్ క్లర్క్, చౌఫర్స్, ఇన్సురేషన్ అసిస్టెంట్
దరఖాస్తు చివరి తేది: ఆగస్టు 16, 2017
వెబ్‌సైట్: http://in.usembassy.gov/embassy-consulates/hyderabad/

లారెన్స్‌డేల్ ఆగ్రో ప్రాసెసింగ్ ఇండియా
ఈ-మెయిల్: madhu.kandi@lawrencedale.com
వెబ్‌సైట్: lawrencedale.com

కార్వీ
ఈ-మెయిల్: ramya.pillai@karvy.com, ratna.bindu@karvy.com
చిరునామా: కార్వీ డేటా మేనేజ్‌మెంట్ సర్వీస్ లిమిటెడ్, రెండో ఫ్లోర్, కార్వీ సెలెనియం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గుడా, గచ్చిబౌలి, హైదరాబాద్.

ఫిజన్ ల్యాబ్స్
దరఖాస్తు చివరి తేది: ఆగస్టు 17, 2017
వెబ్‌సైట్: www.task.telangana.gov.in

వెలాసిటి ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్
పోస్టులు: ఐటి హెడ్, హెడ్-ప్రాజెక్ట్స్, ఎగ్జిక్యూటివ్-అకౌంటెంట్స్
ఈ-మెయిల్: hr@velocity.co.in

గవర్నమెంట్ జాబ్స్

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్
పోస్టులు: అసిస్టెంట్
మొత్తం ఖాళీలు: 696
దరఖాస్తు చివరి తేది: ఆగస్టు 28, 2017
వెబ్‌సైట్: www.uiic.co.in

యూపీఎస్సీ-సిడిఎస్ఈ
మొత్తం ఖాళీలు: 414
దరఖాస్తు చివరి తేది: సెప్టెంబర్ 8, 2017
వెబ్‌సైట్: www.upsc.gov.in

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్
దరఖాస్తు చివరి తేది: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.careerairforce.nic.in

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్
దరఖాస్తు చివరి తేది: సెప్టెంబర్ 11, 2017
వెబ్‌సైట్: www.iocl.com, http://cbsenet.nic.in

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ
మొత్తం ఖాళీలు: 340

దరఖాస్తు: ఆన్‌లైన్లో
దరఖాస్తుకు చివరి తేది: ఆగస్టు 28, 2017
వెబ్‌సైట్: apply-delhi.nielit.gov.in

ఓరియంటల్ ఇన్సూరెన్స్
మొత్తం ఖాళీలు: 300
వెబ్‌సైట్: https://orientalinsurance.org.in/

ఇండియన్ నేవీ
దరఖాస్తుకు చివరి తేది: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in


ఇస్రో
పోస్టులు: డ్రైవర్
మొత్తం ఖాళీలు: 128
దరఖాస్తుకు చివరి తేది: ఆగస్టు 28, 2017
వెబ్‌సైట్: www.isro.gov.in

ఢిల్లీ యూనివర్సిటీ
పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్
మొత్తం ఖాళీలు: 128
దరఖాస్తుకు చివరి తేది: ఆగస్టు 19, 2017
వెబ్‌సైట్: http://as1.du.ac.in/colrec2017/index.php

చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్
మొత్తం ఖాళీలు: 33
దరఖాస్తుకు చివరి తేది: సెప్టెంబర్ 1, 2017
వెబ్‌సైట్: www.cpcl.co.in

విమెన్ పవర్

ప్రపంచవ్యాప్తంగా ఏ రంగంలో మహిళా ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందో మీకు తెలుసా? ప్రపంచంలోని పార్లమెంట్ సభ్యుల్లో ఎంత మంది మహిళలు ఉన్నారో అవగాహన ఉందా? ఫార్చూన్-500 కంపెనీ సీఈఓల్లో ఎంత మంది మహిళలు ఉన్నారు? ఇటువంటి వివరాలు ఒక్క సారి పరిశీలిద్దాం (శాతాల్లో)



చిత్రజ్యోతి

వారిని చూస్తే బాధగా ఉంటుంది

- శ్రుతిహాసన్



అదే నా ప్లస్ పాయింట్!

- అమలాపాల్



బాలల చలన చిత్రోత్సవం..

నవంబర్ 8 నుంచి... హైదరాబాద్‌లో...



డైలీ సుడోకు - 151

		1						6
9		7		5	6			
2				1	5			
	5		3				1	
7		1		4				3
	2		8				6	
		5	7					1
		2	9		6			7
3					9			

ఎలా పూరించాలి?

నిన్నటి సుడోకు-150 సమాధానం

నివేదన

ఎప్పుడో చేస్తానంటే కుదరదు!



కౌన్సెలింగ్

ఉద్యోగం వదిలి ఊరెళ్లిపోతానంటున్నాడు....



- డాక్టర్ వి.కరుణాకర్, కన్సల్టెంట్ సైకాలజిస్ట్

మీకు మీరే డాక్టర్

మైగ్రేన్ హుష్‌కాకి!



స్మార్ట్‌హోమ్

నెగెటివ్ ఎనర్జీ పోవాలంటే...







UNANIMOUS INDUSTRY HIT
Thanks to Audience -MIRYALA RAVINDER REDDY
A BOYAPATI SREENU FILM
MIRYALA SATHYANARAYANA REDDY
PRESENTS
DWARAKA
CREATIONS
జయ జానకి నాయక
ROCKSTAR
DEVI SRI PRASAD
DSP
MUSICAL
MIRYALA RAVINDER REDDY BOYAPATI SREENU
DEVI SRI PRASAD
CHITYALA SAIKUMAR REDDY
M.RATHNAM RISHI PUNJABI SAHI SURESH KOTAGIRI VENKATESWARA RAO RAM-LAXMAN PREM RAKSHITH VAMSI SHEKAR
Junglee
U/A



రాణీగారి తోట ఎక్స్ రోడ్డు వంతెన నుంచి ప్రధాన రహదారిలోకి ప్రవేశించే చోట ఏర్పాటు చేసిన బారికేడ్లు



నడిరోడ్డుపై అడుగుపెట్టాలంటే భయం! బైకు ఎక్కితే గమ్యం చేరేదాకా భయం భయం! నరాలు బిగబట్టుకుని... కళ్లింతలు చేసుకుని... నాలుగు దిక్కులు చూస్తూ ఎంత జాగ్రత్తగా నడిపినా ఎటువైపు నుంచి ఏ లారీ వచ్చి కొట్టేస్తుందోనన్నంత భయం! సగటున మూడు రోజులకు ఇద్దరు రోడ్డుకు బలైపోతున్న దారుణం! ఇదీ విజయవాడ నగరంలో గత ఏడాది వరకు ఉన్న పరిస్థితి! ఇప్పుడు ఇది మారుతోంది! క్రమక్రమంగా రహదారి 'భద్రం'గా మారుతోంది! విజయవాడ పోలీసులు తీసుకుంటున్న వినూత్న చర్యలే దీనికి కారణం. ఇవి రాష్ట్రంలోని ఇతర నగరాలు, జిల్లాల పోలీసులకూ ఆదర్శం!

రోడ్డు సేఫ్!

ప్రమాదాలకు పోలీస్ చెక్

ఆదర్శంగా విజయవాడ పోలీసులు

- 101 బ్లాక్‌స్పాట్స్ గుర్తింపు
- ప్రతిచోటా బారికేడ్లు, ఇతర చర్యలు
- రేయింబవళ్లు వాహనాల్లో గస్తీ
- పోలీసులు 'ప్రాథమిక వైద్యులు'
- అత్యవసర చికిత్సపై శిక్షణ
- తమ వాహనాల్లోనే ఆస్పత్రులకు తరలింపు
- భారీగా తగ్గిన ప్రమాదాల సంఖ్య

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

విజయవాడ అంటేనే జాతీయ రహదారుల సమాహారం. ఒకపక్క చెన్నై - కోల్‌కతా, మరోపక్క హైదరాబాద్ జాతీయ రహదారులు! ఇక... నగరంలో ప్రధాన రహదారులుగా ఏలూరు రోడ్డు, బందరు రోడ్డు! 'రాజధాని' కళ వచ్చాక రాకపోకలు మరింత పెరిగాయి. వాహనాల రద్దీ మరింత పెరిగింది. అసలే రహదారులు ఇరుకిరుకు. ఇలాంటి నగరంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసులు పక్కా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. 2016లో విజయవాడ నగర కమిషనరేట్ పరిధిలో 210 మంది రోడ్లకు బలైపోయారు. ఈ ఏడాది ఇప్పటిదాకా జరిగిన ప్రమాదాల్లో 40 మంది చనిపోయారు. పోలీసుల చర్యలు ఫలిస్తున్నాయనేందుకు ఈ గణాంకాలే నిదర్శనం. తొలుత... జాతీయ రహదారులు, ప్రధాన మార్గాల్లో ప్రమాదాలకు అవకాశమున్న ప్రాంతాలను (బ్లాక్‌స్పాట్)లను గుర్తించారు. నాలుగు మార్గాల్లో 101 బ్లాక్‌స్పాట్స్ ఉన్నట్లు తేల్చారు. మరో 70 ప్రదేశాల వద్ద వాహనదారులు, పాదచారులు ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారని నిర్ధారించారు. పదికంటే ఎక్కువ ప్రమాదాలు జరిగిన వాటిని 'ఏ' కేటగిరీగా, అయిదుకంటే ఎక్కువ ప్రమాదాలు జరిగితే 'బీ' కేటగిరీ, నాలుగు కంటే తక్కువ ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను 'సీ' కేటగిరిగా విభజించారు. దానికి తగినట్లుగా ఎక్కడికక్కడ చర్యలు తీసుకున్నారు.



రామవరప్పాడులో రోడ్డు సేఫ్టీ వాహనం

రయ్యి రయ్యిన రాలేరు...

చౌరస్తాలు, చిన్న రోడ్లు ప్రధాన రహదారిలో కలిసే ప్రాంతాలు (ఇంటర్ సెక్షన్లు), మలుపులు, వై-జంక్షన్లు, యూ-టర్న్‌లు... ఇలాంటి చోట్ల వాహనదారులు వేగంగా రావడం, అటువైపు నుంచి వచ్చే వాహనాలు ఢీకొనడంవల్ల ప్రమాదాలు జరగడం! ఇదీ ప్రమాదాల సరళి! ఇలాంటి ప్రాంతాల్లో అటూ ఇటూ చూసుకోకుండా రయ్యిన వచ్చే వాహనాల జోరుకు బెజవాడ పోలీసులు బ్రేకులు వేశారు. ఇలాంటి ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి బారికేడ్లు పెట్టారు. ద్విచక్ర వాహనం నుంచి పెద్ద లారీ దాకా వాహనం ఏదైనా బ్రేకులు వేసి, నెమ్మదిగా వాటిని దాటుకుని పోవాల్సిందే. ఇక... ఇంటర్‌సెక్షన్ల వద్ద ట్రాఫిక్ 'కోన్'లు ఏర్పాటు చేసి, ద్విచక్ర వాహనాలను నెమ్మదిగా ప్రత్యేక ట్రాక్‌లలో హైవేలు, ప్రధాన రహదారులను ఎక్కిస్తున్నారు. ప్రమాదాలకు ఆస్కారమున్న చౌరస్తాల్లోని డివైడర్లను తాత్కాలిక బారికేడ్లతో మూసివేసి... దూరంగా యూ-టర్న్‌లు ఏర్పాటు చేశారు. అలాగే... యూ-టర్న్‌ల వద్ద కూడా రెండు వైపులా బారికేడ్లు పెట్టారు. అక్కడ వాహనాలు నెమ్మదిగా మలుపు తీసుకోవాల్సిందే. విజయవాడ నగర పోలీసులు గుర్తించిన ప్రతి బ్లాక్‌స్పాట్ వద్ద ఇలాంటి చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గింది. అన్నింటికంటే ముఖ్యంగా... రాత్రివేళల్లో వ్యూహాత్మక ప్రాంతాల్లో పోలీసుల 'రోడ్ సేఫ్టీ' వాహనాలు దర్శనమిస్తాయి. వీటిని చూడగానే 'ర్యాష్' డ్రైవర్లు కాస్త నెమ్మదిస్తారు. ఇక... ఎప్పటికప్పుడు మందుబాబుల పని పడుతూనే ఉంటారు. తాగి వాహనాలు నడుపుతున్న వారిని జైలుకు కూడా పంపిస్తున్నారు.



ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచుతున్నాం

రాష్ట్ర రహదారుల కంటే జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మేం దీనిపై ఒక అధ్యయనం చేశాం. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచుతున్నాం. జాతీయ రహదారులపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. కొన్నిచోట్ల ప్రజలు తమ సౌకర్యం కోసం డివైడర్లను పగలగొట్టి చిన్నచిన్న దారులు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనివల్లా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని గుర్తించి మూసివేస్తున్నాం. జాతీయ రహదారులపై పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు. నగరంలో డీడీ (డ్రంక్ అండ్ డ్రైవ్) తనిఖీలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఇలాంటి చర్యలవల్లే కమిషనరేట్ పరిధిలో ప్రమాదాలు తగ్గాయి.

- క్రాంతి రాణా టాటా, డీసీపీ, ఇన్‌చార్జి ట్రాఫిక్ ఉపకమిషనర్

ప్రాణం నిలిపే పోలీస్..

ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడం ఒక అంశమైతే... ఏదైనా, ఎక్కడైనా ప్రమాదం జరిగినా ప్రాణాలు పోకుండా చూడటం మరో ముఖ్యమైన అంశం. విజయవాడ నగర పోలీసులు దీనిపైనా దృష్టి సారించారు. ట్రాఫిక్ సిబ్బందినే ప్రాథమిక వైద్యులుగా మార్చేస్తున్నారు. ట్రాఫిక్ విధుల్లో ఉన్న వారికి విడతల వారీగా ఆంధ్రా ఆస్పత్రిలో శిక్షణ ఇస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు ఎలాంటి సపరిచర్యలు చేయాలి? వారిని వాహనాల్లోకి ఎక్కించేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఆగిన శ్వాసను ఎలా పునరుద్ధరించాలి? వంటి అంశాలపై వైద్య నిపుణులు శిక్షణ ఇస్తున్నారు. ఇక... ప్రమాదం జరిగిన తర్వాత అంబులెన్స్ వచ్చేదాకా వేచి చూడాల్సిన అవసరం లేదు. ఇటీవల ప్రభుత్వం జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా 11 పెట్రోలింగ్ వాహనాలను కేటాయించింది. వీటిలో నలుగురు సిబ్బంది రాత్రింబవళ్లు గస్తీ (మూడు షిఫ్టుల్లో) గస్తీ తిరుగుతుంటారు. అది కూడా బ్లాక్‌స్పాట్లకు సమీపంలోనే. క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేయడానికి అవసరమైన ఉపకరణాలన్నీ ఈ వాహనాల్లో ఉంటాయి. అంబులెన్స్‌లతో పని లేకుండా ఈ వాహనాల్లోనే క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలిస్తారు.



స్ప్రింగ్ బ్రిడ్జ్ ఎక్స్ రోడ్డు

సాంకేతికత తోడు...

ప్రమాదం జరిగిన గంటలోపు ఆస్పత్రికి చేర్చగలిగితే ప్రాణాలు కాపాడే అవకాశాలు మెరుగవుతాయి. క్షతగాత్రులను ఈ 'గోల్డెన్ అవర్'లో ఆస్పత్రులకు చేర్చేలా చర్యలు తీసుకున్నారు. నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను ఒక గొడుగు కిందకు తీసుకొచ్చారు. పోలీసులు రూపొందించిన 'ఫోర్త్‌లైన్' యాప్‌లోని ఆ వివరాలను పొందుపరిచారు. ప్రమాదం జరిగిన వెంటనే దానికి సమీప ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించేస్తున్నారు. ఇలా చేయడం వల్ల చాలా వరకు ప్రాణాలు నిలబడ్డాయని అధికారులు చెబుతున్నారు. అంబులెన్స్‌లు, బ్లడ్‌బ్యాంకులు, ట్రామాకేర్ సెంటర్‌ల సమాచారంతో ఒక యాప్‌ను రూపొందించాలని భావిస్తున్నారు.

విభజన వివాదంలో ఉన్నా వివరాలివ్వాల్సిందే

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తర్వాత ఇంకా పరిష్కారం కాని అంశాలున్నా.. బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వాల్సిందేనని ప్రభుత్వ కార్పొరేషన్లు, కంపెనీలు, సొసైటీలకు ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూళ్లలో ఉన్న సంస్థల ఉన్నతాధికారులతో ఆర్థిక శాఖ కార్యదర్శి రవిచంద్ర శుక్రవారం సచివాలయంలో భేటీ అయ్యారు. ఉమ్మడి రాష్ట్ర అకౌంట్లలో కొన్ని ఇంకా విభజన వివాదంలో ఉన్నాయని ఈ సమావేశంలో పలువురు చెప్పారు. విభజన పరిష్కారం కాకుండా సంయుక్త అకౌంట్లను బదిలీ చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. అయితే, విభజన జరిగినా జరగకున్నా బ్యాంకు అకౌంట్ల మొత్తం వివరాలు ప్రభుత్వానికి సమర్పించాల్సిందేనని ఆర్థిక శాఖ అధికారులు స్పష్టం చేశారు. దీంతో పలు కార్పొరేషన్ల అధికారులు శుక్రవారమే ఆర్థిక శాఖకు ఆయా లెక్కలను సమర్పించారు. ప్రభుత్వ రంగ సంస్థల బ్యాంకు అకౌంట్లలో ఉన్న సొమ్మెంతో లెక్క తేల్చే పనిలో భాగంగా ఆర్థిక శాఖ ఈ కసరత్తును చేపట్టింది.



అన్నీ సిద్ధమయ్యాకే హైకోర్టు: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కోర్టు భవనాలు, న్యాయమూర్తులు, అధికారులు, సిబ్బందికి క్వార్టర్లు తదితర అవసరమైన వసతులన్నీ సిద్ధమైన తర్వాతే ఏపీలో ప్రత్యేకంగా హైకోర్టు ఏర్పాటు చేస్తామని న్యాయశాఖ సహాయ మంత్రి పీపీ చౌదరి స్పష్టం చేశారు. శుక్రవారం రాజ్యసభలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. హైదరాబాద్‌లోని హైకోర్టు జ్యుడికేచర్‌తో సంప్రదించి ఈ వసతులన్నీ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపైనే ఉందని పేర్కొన్నారు. కాగా, విశాఖలో ఐటీఐఆర్ ఏర్పాటు అంశం పరిశీలనలో ఉందని మరో ప్రశ్నకు సమాధానంగా కేంద్రం తెలిపింది.

హెల్త్ వర్సిటీ వీసీ పోస్టుకు 30 దరఖాస్తులు!

విజయవాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. తొలుత రాష్ట్ర స్థాయిలో, ఆ తర్వాత జాతీయ స్థాయిలో దరఖాస్తులను ఆహ్వానించారు. రాష్ట్ర స్థాయిలో దరఖాస్తు చేసుకున్న 19 మందితోపాటు, తాజాగా దరఖాస్తు చేసుకున్న వారితో కలిపి మొత్తం 30మంది వరకూ ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. వీరి దరఖాస్తులను మెడికల్ అండ్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలోని కమిటీ పరిశీలించి నియామకం చేయనుంది.

సెర్ప్ సీఈవో డిప్యుటేషన్ పొడిగింపు

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సెర్ప్ సీఈవోగా పనిచేస్తున్న కృష్ణమోహన్ డిప్యుటేషన్‌ను మరో రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో పనిచేసే ఆయన్ను సీఎంవో ఓఎస్డీగా తీసుకుని.. సెర్ప్ సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

మహిళా రక్షణకు 140 కోట్లతో ప్రతిపాదనలు

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం కేంద్రం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన నిర్భయ నిధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు ప్రతిపాదనలు చేసింది. దేశంలో మహిళల రక్షణకు రూ.2,200 కోట్లతో వివిధ కార్యక్రమాలు అమలుచేయాలని కేంద్రం మహిళా సంక్షేమశాఖ నిర్ణయించింది. అందులో భాగంగా వినూత్నమైన కార్యక్రమాల అమలుకు అన్ని రాష్ట్రాల నుంచి ఏప్రిల్‌లో ప్రతిపాదనలు కోరింది. దీనిపై స్పందించిన ఏపీ... రూ.138.49 కోట్లతో అభయ ప్రాజెక్టును ప్రతిపాదించింది. అలాగే మహిళా పోలీసు వాలంటీర్ల పథకాన్ని అనంతపురం, కడప జిల్లాల్లో అమలు చేయనున్నట్లు రూ.2.25కోట్లతో మరో ప్రతిపాదన చేసింది. కాగా, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రం నుంచి 22 ప్రతిపాదనలు అందాయి. నిర్భయ నిధుల నుంచి ఈ ప్రాజెక్టులు అమలుచేస్తారు.

మీ చెంతకే వస్తున్నాం!



విద్యార్థులు, రైతులకు రెవెన్యూ శాఖ భరోసా

- 10 లక్షల మందికి కుల, ఆదాయ పత్రాలు
- కళాశాలల్లోనే మొబైల్ మీసేవ కేంద్రాలు
- 'రైతు సేవలో భూరికార్డుల అప్‌డేట్
- వారానికి రెండ్రోజులు గ్రామాల్లోనే సిబ్బంది

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాసు పుస్తకం నుంచి విద్యార్థుల ఆదాయ ధ్రువీకరణ పత్రం వరకు.. దేనికైనా రోజుల తరబడి తిరగాలి. ఎంతో కొంత సమర్పించుకోవాలి.. రెవెన్యూ శాఖపై ప్రజల్లో ఈ ముద్ర పడిపోయింది. దీనిని చెరిపేసుకునే దిశగా ఇప్పుడా శాఖ పలు కార్యక్రమాలు చేపట్టింది. ప్రజల చెంతకు తానే వెళ్తోంది. విద్యార్థులు కళాశాలల్లో చేరే సమయంలో, ఇతర అవసరాలకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వారికి కావాలి. వీటికోసం ఒకప్పుడు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. త్వరగా తీసుకొనేందుకు ఎంతోకొంత సమర్పించుకోవలసి వచ్చేది. అయితే క్రమంగా వాటిని 'మీసేవ' పరిధిలోకి తెచ్చి కొంత వరకు సంస్కరించారు. అయితే విద్యార్థులు సెలవు పెట్టి మరీ మీసేవ కేంద్రానికి వెళ్లడం, తల్లిదండ్రులను పంపించి దరఖాస్తు చేయడం తప్పడం లేదు. ఇప్పుడు రెవెన్యూ శాఖ మరింత ముందుకెళ్లి కళాశాలల్లోనే మొబైల్ మీసేవ కేంద్రాలు పెట్టి.. అక్కడే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేసే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

విద్యార్థుల సేవలో 10 లక్షల పత్రాలు

ప్రతి ఏటా మే, జూన్, జూలై, ఆగస్టు నెలల్లో కళాశాలల్లో చేరే విద్యార్థులు, చదువుతున్న విద్యార్థుల్లో పలువురికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరమవుతాయి. దానికోసం విద్యార్థులు తిరగకుండా రెవెన్యూ శాఖే కళాశాలలకు వెళ్లేలా.. 'విద్యార్థుల సేవలో రెవెన్యూ శాఖ' అనే కార్యక్రమం ప్రారంభించింది. కళాశాలల్లో మీసేవ మొబైల్ యూనిట్ ఒకటి పెట్టి.. దరఖాస్తులు తీసుకుని... అక్కడే ధ్రువపత్రాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి దాకా 13 జిల్లాల్లోని 29,146 కళాశాలల్లో సేవలందించారు. సుమారు 10 లక్షల మందికి ధ్రువపత్రాలు అందించారు. పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా 1.08 లక్షల మంది, కడప జిల్లాలో 1.16 లక్షలు, తూర్పుగోదావరిలో 1.06 లక్షలు, నెల్లూరు జిల్లాలో 89 వేలు, చిత్తూరు జిల్లాలో 84 వేలు, విజయనగరం 82 వేలు, అనంతపురం 75 వేలు, ప్రకాశంలో 75 వేలు...ఇలా ప్రతి జిల్లాలోను వేల సంఖ్యలో విద్యార్థులు లబ్ధిపొందారు.



విద్యార్థుల్లో సంతోషం

రెవెన్యూ శాఖ చేపట్టిన కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో చాలా సంతోషం కనిపించింది. తమ ముంగిటకే ధ్రువపత్రాలు రావడం వారికో కొత్త అనుభూతిలా ఉంది. వారిది భవిష్యత్ తరం. పాలనలో పారదర్శకత, వేగాన్ని వారు తెలుసుకుంటే సమాజానికి మంచి జరుగుతుంది. రైతుల కోసం పకడ్బందీగా మీ ఇంటికి-మీ భూమి కార్యక్రమం అమలుచేస్తున్నాం. ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుని ముందుకెళ్తాం.

- అనిల్‌చంద్ర పునేఠా, సీసీఎల్ఏ

భూరికార్డుల్లో మార్పులపై దరఖాస్తులు..

'రైతు సేవలో రెవెన్యూ శాఖ' పేరుతో సిబ్బంది గ్రామగ్రామాలకు వెళ్లి రెవెన్యూ రికార్డులు అప్‌డేట్ చేసే కార్యక్రమం కొనసాగుతోంది. వారానికి రెండు రోజుల పాటు వారు తమ పరిధిలోని గ్రామాలకు వెళ్తున్నారు. భూ రికార్డుల్లో మార్పులు, అప్‌డేట్ చేయాల్సిన అవసరం ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అదేవిధంగా రైతులకు ఇప్పటివరకు తమ పేర్లు రెవెన్యూ రికార్డుల్లో సరిగానే ఉన్నాయా.. తమ భూముల సర్వే నంబర్లు ఏమిటో పెద్దగా అవగాహన లేదు. ఇవి కూడా చెప్పి.. ఏవైనా సవరణలుంటే చేస్తున్నారు. సెప్టెంబరు 15లోపు అన్ని గ్రామాల్లో తిరిగి మార్పులు, సవరణలను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎలాంటి వివాదాలు లేకుంటే వెంటనే అప్‌డేట్ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 40,334 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 6,444 ఆమోదం పొందాయి. ఈ దరఖాస్తుల్లో శ్రీకాకుళం జిల్లా మొదటిస్థానంలో ఉంది. ప్రధానంగా పూర్వీకుల ఆస్తులను తమ పేర్లమీదకు మార్చుకుని.. రికార్డులను అప్‌డేట్ చేసే అవకాశం ఇందులో దక్కుతోంది. గతంలో ఇందుకు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తెగ తిరగాల్సి వచ్చేది. అయితే ఈ కార్యక్రమాన్ని ఏ గ్రామంలో ఏరోజు చేపడుతున్నారో అన్నిచోట్లా ముందుగా చెప్పడం లేదనే విమర్శలున్నాయి. ఒకరోజు ముందుగానే ఫలానా గ్రామాలకు వస్తున్నామని చెబితే.. రెవెన్యూ శాఖతో పని ఉన్నవారు కూడా గ్రామాల్లోనే ఉంటారని, అప్పుడే కార్యక్రమం ప్రజలకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని అంటున్నారు.

సీఎం సెంటర్లకు చిక్కులు!

- 500కోట్లు ఉంటేనే నడిచే పరిస్థితి
- సూపర్ స్పెషాలిటీ ఓపీల కోసం 4 నెలలుగా 222 హెల్త్ సెంటర్లు
- 10 కేంద్రాలకే ఎన్‌హెచ్‌ఎం నిధులు

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల(ఎలక్ట్రానిక్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు-ఈయుపీహెచ్‌సీ) కొనసాగింపు ప్రభుత్వానికి భారంగా మారనుందా...? ఈ కేంద్రాల నిర్వహణ కష్టతరం అవుతున్నదా..? అంటే అవును అనే సమాధానం వినిపిస్తుంది. రాష్ట్రంలో పట్టణ ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ ఓపీ సేవలు అందించేందుకు ఆరోగ్యశాఖ '222 ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల'ను గత ఏప్రిల్‌లో ప్రారంభించింది. ఈ కేంద్రాల నిర్వహణకు అవసరమైన నిధులను నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) నుంచి సమీకరించాలని భావించారు. ఈమేరకు ప్రతిపాదనలను గత ఏడాది ఎన్‌హెచ్‌ఎంకు పంపించారు. సుమారు రూ.3.50 లక్షల చొప్పున మొదట 10 ఈయుపీహెచ్‌సీల ఏర్పాటుకు ఎన్‌హెచ్‌ఎం అనుమతిచ్చింది. ఆరోగ్యశాఖ అధికారులు.. వాటితోపాటు.. అనుమతి లేని 212 సెంటర్లకూ టెండర్లు పిలిచారు. టెండర్ ప్రకారం 222 సెంటర్ల నిర్వహణకు నెలకు రూ.91.46 కోట్లు వరకూ అవసరం. అయితే, ఎన్‌హెచ్‌ఎం కేవలం 10 సెంటర్లకే అనుమతి ఇచ్చినందున.. మిగతావాటి కోసం వేరే కార్యక్రమాల నిధులను ఈయుపీహెచ్‌సీలకు ఆరోగ్యశాఖ అధికారులు బదలాయిస్తూ వచ్చారు.



ఫీడ్ బ్యాక్ ఇవ్వడంలేదు

గత జనవరిలో మరోసారి ఎన్‌హెచ్‌ఎంకు ఆర్యోగశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. దీనిపై నేషనల్ హెల్త్ మిషన్ అధికారులు ఇప్పటిదాకా ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. అదేసమయంలో ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల నిర్వహణ సరిగ్గా లేదని తేల్చేసింది. ఆరోగ్యశాఖ చేస్తున్న తప్పులను 2017 - 18 నివేదికలో ఎత్తిచూపింది. ఆరోగ్యశాఖ ప్రతిపాదనలు మిషన్ లక్ష్యానికి అనుగుణంగా లేవని ఆక్షేపించింది. ఈ కేంద్రాల ద్వారా ఏం సాధించదలచుకున్నది స్పష్టత లేదని చెప్పింది. అర్బన్ ప్రాంతాల్లో హెల్త్ క్యాంపుల పర్యవేక్షణ ఎవరిచేతుల్లో ఉంటుందనేది ప్రతిపాదనల్లో పేర్కొనలేదని నేషనల్ హెల్త్ మిషన్ ఎత్తిచూపింది.

ప్రభుత్వంపై భారం?

ఈయుపీహెచ్‌సీల నిర్వహణకు ఎన్‌హెచ్‌ఎం ద్వారా నిధులు సమకూర్చుకునేందుకు ఏడాదిగా ఆరోగ్యశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నా ఫలితం ఉండటం లేదు. కేంద్రాలను ఏర్పాటుచేసిన ఈ నాలుగు నెలల కాలంలో సుమారు రూ.400 కోట్ల నిధులను ఎలాగో తిప్పలు పడి బదలాయించారు. ఈ ఏడాదిలో మిగిలిన మరో ఐదు నెలలు కేంద్రాలు నడవాలంటే..రూ. 500కోట్లు అవసరం.

మరో బీటెక్ దొంగ

- ఉన్నత కుటుంబం నుంచి వచ్చి దోపిడీలు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీపీ శాండిల్య

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలు, జల్సాలకు బానిసై దొంగగా మారిన ఇంజనీర్ కటకటాల పాలయ్యాడు!.. అతడితో పాటు మరో ఇద్దరిని హైదరాబాద్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారినుంచి రూ.19.55 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్య ఆ వివరాలు వెల్లడించారు. తమిళనాడుకు చెందిన వీరవంశీనాయుడు ఇంజనీరింగ్ పూర్తిచేసి కాల్‌సెంటర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఉన్నత కుటుంబానికి చెందిన ఆతను జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం దొంగతనాలను ఎంచుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు ఇంటినుంచి వెళ్లగొట్టారు. 2015లో రెండుసార్లు కటకటాలపాలయ్యాడు. జైల్లో జగద్గిరిగుట్టకు చెందిన మురళీతో దోస్తీ కట్టాడు. అతడి స్నేహితులైన ఎ.సాయిఈశ్వర్, సయ్యద్ షబ్బీర్‌ను ముఠాలో చేర్చుకున్నాడు వీరంతా 19ఇళ్లలో దోపిడీలు చేశారు. చివరకు పోలీసులకు చిక్కారు. వారినుంచి 35 తులాల బంగారు, 1219 గ్రాముల వెండి ఆభరణాలు, 10టీవీలు, 2 బైక్‌లు, 2ల్యాప్‌టాప్‌లు, 2కెమెరాలు, 2సెల్‌ఫోన్లు, ప్రింటర్, సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటివిలువ రూ.19.55లక్షలు ఉంటుందని అంచనా.



రివర్స్ గేర్..

బేర్ పట్టులో మార్కెట్

సెన్సెక్స్ 317 పాయింట్లు డౌన్.. బ్లాక్ ఫ్రైడే.. ఈ వారమంతా నష్టాలే

దేశీ, అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో దేశీయ మార్కెట్లో మొదలైన ప్రకంపనలు కొనసాగుతున్నాయి. వరుసగా ఐదో రోజూ స్టాక్ మార్కెట్లు నష్టాలతోనే ముగిసాయి. ఆర్థిక సర్వే భవిష్యత్ అంచనాలు ప్రోత్సాహకరంగా లేకపోవడం కూడా మార్కెట్‌ను మరింత కుంగదీసింది. శుక్రవారం నాడు నష్టాలతోనే వెలువడిన సెన్సెక్స్ 317 పాయింట్ల నికర నష్టంతో 31213 పాయింట్ల వద్ద ముగిసింది. జూలై 4 తర్వాత కీలకసూచీ ఇంత బలహీనంగా ఎప్పుడూ ముగియలేదు. నిఫ్టీ ఇంట్రాడేలో భారీ నష్టాలతో 9700 దిగువకు పడిపోవడంతో ఇన్వెస్టర్లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అఖరుకు 109 పాయింట్ల నికర నష్టంతో నిఫ్టీ 9700 ఎగువన 9710 వద్ద ముగిసింది. కొన్ని వారాలుగా బుల్ రన్‌తో పరుగులు తీస్తున్న స్టాక్ మార్కెట్లో ఈ వారం తీవ్ర కలవరాన్ని సృష్టించింది. వారం మొత్తంపై సెన్సెక్స్ 1111 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 355 పాయింట్లు పతనమైంది. దాదాపు అన్ని విభాగాల్లోనూ షేర్లు నష్టాలతోనే ముగిసాయి. మెటల్, ఆటో, రియల్టీ, పిఎస్‌యు, ఇన్‌ఫ్రా షేర్లు భారీగా నష్టపోయాయి. మొత్తం 1525 షేర్లు నష్టాలతో ముగియగా 1003 షేర్లు లాభపడ్డాయి.

అమెరికా, ఉత్తర కొరియా మధ్య ఉద్రిక్తత దేశీ మార్కెట్‌తోపాటు అంతర్జాతీయంగా అన్ని ప్రధాన మార్కెట్లనూ ప్రభావితం చేస్తోంది. డొల్ల కంపెనీలనే ఆరోపణలతో 331 కంపెనీలపై సెబి ఆదేశాల మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలు ఆంక్షలు విధించడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను నీరుగార్చింది. ఈ పరిణామాలకు తోడుగా శుక్రవారం వెలువడిన మధ్యంతర ఆర్థిక సర్వేలో ఈ ఆర్థిక సంవత్సరంలో 6.75-7.5 శాతం వృద్ధి రేటు కష్టమేనని తేల్చిచెప్పడం దేశీ ఇన్వెస్టర్లను మరింత భయపెట్టింది.

- జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో మెరుగైన ఫలితాలనే ప్రకటించినప్పటికీ ఎస్‌బిఐ షేరు ధర 5.4 శాతం నష్టపోయింది. ఎల్ అండ్ టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎం అండ్ ఎం.. సెన్సెక్స్ పతనంలో ముఖ్యభూమిక పోషించాయి.
- సాట్ ఆదేశాలతో ట్రేడింగ్‌పై ఆంక్షలు ఎత్తివేయడంతో పార్శ్వనాథ్ డెవలపర్స్, ప్రకాష్ ఇండస్ట్రీస్‌లో ట్రేడింగ్ మళ్లీ మొదలైంది. అయితే ఈ రెండు షేర్లు 20 శాతం నష్టపోయాయి.
- తీవ్ర ప్రతికూల వాతావరణంలోనూ టాటా గ్లోబల్ బేవరేజెస్ షేరు మాత్రం 5 శాతం లాభపడింది. క్యూ1 ఫలితాలు షేరు ధరల పెరుగుదలకు కారణం.
- ప్రధాన షేర్లలో డాక్టర్ రెడ్డీస్, టాటా మోటార్స్ డివిఆర్, అరబిందో లాభాలతో ముగిసాయి.

భారీ లాభాల్లో కొచ్చిన్ షిప్‌యార్డ్

ఇటీవల పబ్లిక్ ఇష్యూకు వచ్చిన ప్రభుత్వ రంగ సంస్థ కొచ్చిన్ షిప్‌యార్డ్ షేర్లు శుక్రవారం నాడు స్టాక్ మార్కెట్లలో లాభాలతో లిస్టయ్యాయి. మార్కెట్‌లో సాధారణ ట్రెండ్ నెగెటివ్‌గా ఉన్నప్పటికీ ఈ షేరు మాత్రం ఆఫర్ ధరతో పోలిస్తే 22 శాతం ప్రీమియం 522 రూపాయల గరిష్ఠ స్థాయివద్ద ముగిసింది. పబ్లిక్ ఇష్యూ ఆఫర్ ధర 432 రూపాయలతో పోలిస్తే స్వల్పలాభంతో 435 రూపాయల వద్ద ఈ షేర్లు లిస్టయ్యాయి. ఆ వెంటనే గరిష్ఠ స్థాయికి దూసుకుపోయి ట్రేడింగ్ పూర్తయ్యే వరకు అదే స్థాయిలో నిలబడ్డాయి. ఈ ఇష్యూ దాదాపు 76 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది.

దిగజారిన పారిశ్రామికం

న్యూఢిల్లీ: పారిశ్రామికోత్పత్తి జూన్ నెలలో తిరోగమనం బాట పట్టింది. తయారీ, యంత్రపరికరాల రంగాలు క్షీణత నమోదు చేయడంతో పాటు మైనింగ్, విద్యుత్ ఉత్పత్తి, మౌలిక వసతుల-నిర్మాణ రంగ వస్తువులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగాలు అత్యంత నిరాశాజనకమైన పనితీరు ప్రదర్శించడంతో పారిశ్రామికోత్పత్తి సూచి (ఐఐపి) ఆధారంగా లెక్కించే పారిశ్రామికోత్పత్తి 0.1 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. గత జూన్‌లో నమోదైన వృద్ధి 8 శాతం. ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కూడా పారిశ్రామికోత్పత్తి 7.1 శాతం నుంచి 2 శాతానికి మందగించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో నమోదైన మొదటి ప్రతికూల వృద్ధి ఇదే. సూచీలో 77 శాతం వాటా ఉన్న తయారీ రంగం 0.4 శాతానికి దిగజారగా మైనింగ్ రంగం 0.4 శాతం, విద్యుత్ ఉత్పత్తి రంగం 2.1 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి. ప్రధానంగా పారిశ్రామిక పెట్టుబడులకు ప్రధాన సూచికగా నిలిచే యంత్రపరికరాల రంగంలో వృద్ధి 14.8 శాతం నుంచి 6.8 శాతానికి దిగజారింది. ప్రైమరీ వస్తువుల విభాగంలో వృద్ధి 8.2 శాతం నుంచి 0.2 శాతానికి, ఇంటర్మీడియేట్ వస్తువుల విభాగంలో వృద్ధి 6 శాతం నుంచి 0.6 శాతానికి దిగజారింది. తయారీ రంగంలోని మొత్తం 23 పారిశ్రామిక విభాగాల్లో 15 ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి.



పార్శ్వనాథ్, కవిత్ ఇండస్ట్రీస్‌పై ఆంక్షల ఎత్తివేత

పార్శ్వనాథ్ డెవలపర్స్ కవిత్ ఇండస్ట్రీస్ షేర్ల ట్రేడింగ్‌పై విధించిన ఆంక్షలను ఎత్తివేయాల్సిందిగా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆదేశించింది. డొల్ల కంపెనీలనే ఆరోపణతో సెబి ఆదేశాల మేరకు 331 కంపెనీల షేర్ల ట్రేడింగ్‌పై ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ కంపెనీల్లో కొన్ని పేరున్న కంపెనీలు కావడం వీటిలో దేశీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లకు కూడా చెప్పుకోదగిన స్థాయిలో వాటా ఉండటంతో మార్కెట్లో తీవ్ర అలజడి చెలరేగింది. ఈ ఆంక్షలను సవాలు చేస్తూ పార్శ్వనాథ్ డెవలపర్స్, కవిత్ ఇండస్ట్రీస్‌తో సహా కొన్ని కంపెనీలు సాట్‌ను ఆశ్రయించాయి. వీటిలో జె కుమార్ ఇన్‌ఫ్రా, ప్రకాష్ ఇండస్ట్రీస్ షేర్లపై ఆంక్షలను ఎత్తివేయాల్సిందిగా గురువారం నాడే సాట్ ఆదేశించింది. తాజాగా పార్శ్వనాథ్, కవిత్ ఇండస్ట్రీస్‌కు ఊరట లభించింది. పార్శ్వనాథ్ డెవలపర్స్ ఢిల్లీ కేంద్రంగా రియల్టీ వ్యాపారంలో ఉంది. గుజరాత్‌కు చెందిన కవిత్ ఇండస్ట్రీస్ వంట నూనెల ఉత్పత్తిలో ఉంది.

రూ.100 కోట్లతో హర్యానాలో ప్లాంట్

- ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి ప్రారంభం
- విశాకా ఇండస్ట్రీస్ క్యూ1 లాభం 23 కోట్లు



వంశీ కృష్ణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భవన నిర్మాణ సామగ్రి తయారీ రంగంలోని విశాకా ఇండస్ట్రీస్ కొత్తగా తెరపైకి తెచ్చిన ఆధునిక టెక్నాలజీతో కూడిన ఉత్పత్తుల కోసం హర్యానాలోని జజ్జర్‌లో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. 100 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందని, ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఈ ప్లాంట్ ఉత్పత్తులు మార్కెట్లోకి వస్తాయని కంపెనీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జి వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారంనాడిక్కడ కంపెనీ మొదటి త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మిర్యాలగూడ, పుణెలో రెండు ప్లాంట్లు పని చేస్తున్నాయని, ఆ ప్లాంట్ల ఉత్పాదక సామర్థ్యం నెలకి 10 వేల టన్నులని, కొత్త ప్లాంట్‌తో ఈ సామర్థ్యం 16 వేల టన్నులకు చేరుతుందని చెప్పారు. మూడు ప్లాంట్ల వార్షిక ఉత్పాదక సామర్థ్యం 1.9 లక్షల టన్నులు దాటుతుందని ఆయన తెలిపారు.

నిప్పును, నీటిని తట్టుకునే వి నెక్స్

తాము కొత్తగా ప్రవేశపెట్టిన వి నెక్స్ భవన నిర్మాణంలో సంచలనం అవుతుందని వంశీ అన్నారు. వీటిని ఉపయోగించడం వల్ల అగ్ని ప్రమాదాలు, జల ప్రళయాల నుంచి తట్టుకోగల భవనాలు నిర్మించవచ్చునని ఆయన తెలిపారు. గోడల నిర్మాణంలో ఉపయోగించే ఈ ఉత్పత్తుల ధర చదరపు అడుగు 175 నుంచి 195 రూపాయలుంటుందని, ఇతర ఉత్పత్తులతో పోల్చితే ఇవి సగం ధరకే అందుబాటులో ఉంటాయని, దీని వల్ల భవన నిర్మాణ వ్యయం తగ్గుతుందని చెప్పారు. వీటికి సిబిఐ గ్రీన్ బిజినెస్ సర్టిఫికేషన్ లభించిందని, ఈ ఘనత సాధించిన తొలి కంపెనీ తమదేనని ఆయన అన్నారు. భవన నిర్మాణ సమయం తగ్గడంతో పాటు కార్పెట్ ఏరియా పెరుగుతుందని, ఇక్క కొనుగోలుదారుకు మరింత విశాలమైన గదులు లభిస్తాయని ఆయన చెప్పారు.

క్యూ1 లాభాలకు జిఎస్‌టి, డీమో గండి

ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం లాభాలకు తొలుత పెద్ద నోట్ల రద్దు, ఆ తర్వాత జిఎస్‌టి వేగ నిరోధకాలుగా నిలిచాయని వంశీ కృష్ణ అన్నారు. అయినప్పటికీ తాము గత ఏడాదితో పోల్చితే మెరుగైన ఫలితాలనే ప్రకటించగలిగామని ఆయన చెప్పారు. జూన్ 30వ తేదీతో ముగిసిన త్రైమాసికంలో 342.3 కోట్ల రూపాయల ఆదాయంపై 22.95 కోట్ల రూపాయల నికరలాభాన్ని ఆర్జించినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన ఆదాయం 342.88 కోట్ల రూపాయలు కాగా నికరలాభం 16.67 కోట్ల రూపాయలుగా ఉందన్నారు. గత ఏడాదితో పోల్చితే త్రైమాసిక ఆదాయం నిలకడగానే ఉన్నప్పటికీ వడ్డీ వ్యయాల తగ్గుదల, పోటీ సామర్థ్యం పెంచుకోవడం వంటి చర్యల వల్ల లాభంలో మంచి వృద్ధిని సాధించగలిగామన్నారు.

భవిష్యత్తులో జిఎస్‌టి తమకు లాభదాయకమే అవుతుందని, ఏడాది మొత్తం మీద 20 శాతం వరకు వ్యాపారంలో వృద్ధిని తాము అంచనా వేస్తున్నామని వంశీ చెప్పారు. భవన నిర్మాణ సామాగ్రిపై పన్ను రేటు 28 శాతం ఉండేదని, జిఎస్‌టిలో అది 18 శాతానికి తగ్గడం వల్ల ఉత్పత్తుల ధరలు కూడా 10 శాతం మేరకు తగ్గే ఆస్కారం ఉన్నట్టు తెలిపారు.

మార్కెట్లోకి సామ్‌సంగ్ ఫ్లెక్స్‌వాష్



- ధర రూ.1.45 లక్షలు
- వాషింగ్ మిషన్ విభాగంలో నెంబర్ 1 లక్ష్యం

బెంగళూరు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాషింగ్ మిషన్ విభాగంలో నెంబర్ వన్ స్థానాన్ని పొందాలన్న లక్ష్యంతో ఉన్నట్టు సామ్‌సంగ్ ఇండియా (కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్) డైరెక్టర్ రిషి సూరి తెలిపారు. ఇందుకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి తెస్తున్నట్టు ఆయన చెప్పారు. శుక్రవారంనాడిక్కడ విప్లవాత్మకమైన ఫ్లెక్స్‌వాష్‌ను మార్కెట్లోకి విడుదల చేసిన సందర్భంగా సూరి విలేకరులతో మాట్లాడారు. ఇందులో రెండు వాషర్లు, ఒక డ్రయర్ ఉంది. ఫ్లెక్స్‌వాష్ మిషన్ ధర 1.45 లక్షల రూపాయలు. ఆగస్టు 15వ తేదీ నుంచి సామ్‌సంగ్ బ్రాండ్ షాప్‌లలో ఇది అందుబాటులో ఉంటుంది. దీని ద్వారా లాండ్రీని మరింత సులభతరం, సౌకర్యవంతం చేసినట్టు సూరి తెలిపారు. వినియోగదారుల అభిరుచులను దృష్టిలో ఉంచుకుని వినూత్న ఫీచర్లతో ఉత్పత్తులను మార్కెట్లోకి తెస్తున్నట్టు ఆయన చెప్పారు. యాక్టివ్ డ్యూయల్‌వాష్, యాడ్‌వాష్ వంటి టెక్నాలజీలను అందుబాటులోకి తెచ్చినప్పుడు కస్టమర్ల నుంచి మంచి స్పందన లభించిందని ఆయన తెలిపారు.

ఎక్కువ బిజీగా ఉండే వారు తక్కువ సమయంలో ఎక్కువ దుస్తులను ఉతికే మిషన్‌ను కోరుకుంటారని, ఇలాంటి వారి కోసమే ఫ్లెక్స్‌వాష్‌ను తెచ్చామని, ఇది 23 కిలో సామర్థ్యంతో ఉందని ఆయన చెప్పారు. ఈ మిషన్ ఐఒటితో అనుసంధానం అయి ఉందని, ఫలితంగా వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్ ద్వారానే మిషన్‌ను ఆపరేట్ చేయడంతోపాటు దాని పనితీరును పరిశీలించవచ్చని తెలిపారు.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	ప్రొద్దుటూరు	ముంబై	చెన్నై
24 క్యారెట్లు	30,080	30,000	--	29,210	--
క్రితం ముగింపు	29,830	29,800	29,730	29,070	--
22 క్యారెట్లు	29,480	28,000	--	29,060	27,840
క్రితం ముగింపు	29,230	27,700	27,590	28,920	27,760
వెండి (కిలో)	40,150	40,300	--	39,110	--
క్రితం ముగింపు	39,800	40,300	39,900	38,995	--

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	77.00	గోదావరి	77.00
కరీంనగర్	78.00	విజయవాడ	78.00
వరంగల్	77.00	గుంటూరు	78.00
మహబూబ్‌నగర్	77.00	ఒంగోలు	80.00
కర్నూలు	77.00	చిత్తూరు	76.00
విశాఖపట్నం	78.00	నెల్లూరు	76.00

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.00 నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	338.00	వరంగల్	340.00
విజయవాడ	346.00	చెన్నై	382.00
గోదావరి	346.00	నమక్కల్	370.00
బెంగళూరు	370.00	చిత్తూరు	375.00
విశాఖపట్నం	351.00	ముంబై	383.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో...)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.45	67.78
పౌండ్	75.92	88.06
యూరో	68.80	79.78
ఆస్ట్రేలియా డాలర్	45.87	53.08
బహ్రెయిన్ దినార్	158.39	181.41
కువైట్ దినార్	175.89	219.10
ఒమని రియాల్	154.98	177.35
సౌదీ రియాల్	15.54	18.42
సింగపూర్ డాలర్	42.88	50.80
యుఎఇ దిరమ్	15.91	18.60

ఎన్ఎస్ఇ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా..

AARTIDRUGS 515.05(526.8)16936
AARTIIND 864.75(894.25)47543
ABAN 162.7(168.55)502563
ABB 1343.05(1341.6)48105
ABFRL 162.25(168.2)416989
ABGSHIP 12.05(12.65)22154
ACC 1760.55(1776.7)401900
ADANIENT 113.7(115.85)5174105
ADANIPORTS 382.75(385.65)6480493
ADANIPOWER 27.2(28.7)10716095
ADANITRANS 107.85(116.9)999569
AEGISCHEM 181.35(178.1)244277
AHLUCONT 260.95(264.9)14108
AIAENG 1388.25(1382.95)8806
AJANTPHARM 1224.3(1210.8)143635
AKZOINDIA 1770.05(1763.8)16421
ALBK 64.6(65.7)8669668
ALLCARGO 162.25(162.65)154195
ALOKTEXT 2.8(2.85)5521951
AMARAJABAT 801.2(800.25)719248
AMBUJACEM 263.35(267.45)1515060
AMTEKAUTO 24.2(25.25)1488837
ANANTRAJ 51.5(52.65)1205862
ANDHRABANK 49.5(50.8)4171089
APARINDS 721.1(721.2)17755
APLLTD 515(523.65)294795
APOLLOHOSP 1217.25(1213.8)179177
APOLLOTYRE 257.05(262.6)4783508
ARVIND 365.5(368.5)1462278
ASHIANA 172.15(179.1)62642
ASHOKA 176.4(178)286391
ASHOKLEY 102.65(103.45)14750459
ASIANPAINT 1143.9(1151.1)843233
ASTRAL 641.9(646.65)44766
ASTRAZEN 900.15(905.6)26473
ATUL 2056.75(2036)24987
AUROPHARMA 705(685.25)4630954
AVANTIFEED 1646.8(1576.5)311714
AXISBANK 489.7(485.5)9261420
BAJAJ-AUTO 2788.2(2796.2)321890
BAJAJCORP 402.25(405.25)35889
BAJAJELEC 306.7(302.3)142221
BAJAJFINSV 4992(5024.75)288737
BAJAJHIND 14.5(14.6)4214040
BAJAJHLDNG 2515.65(2499.95)18097
BALKRISIND 1509.9(1529.35)129609
BALLARPUR 14.35(14.05)1224614
BALMLAWRIE 228.05(227.4)78547
BALRAMCHIN 165.15(160.15)2188969
BANKBARODA 142.25(148.45)14474693
BANKINDIA 143.05(148.15)8380224
BASF 1393.3(1404.95)7528
BATAINDIA 635.5(632.05)1317726
BBTC 884.15(880.25)85748
BEML 1556.2(1492)1545555
BERGEPAINT 238.2(247.35)959480
BFUTILITIE 326.8(324.85)336320
BGRENERGY 126.55(128.9)116815
BHARATFIN 785.9(780.25)2126018
BHARATFORG 1158.9(1142.85)1217022
BHARTIARTL 414.55(416.25)2287991
BHEL 125(126.75)7072025
BHUSANSTL 63.7(65.3)597708
BIOCON 340.55(331.1)2566989
BIRLACORPN 928.5(949.25)111689
BLISSGVS 160.8(158)437649
BLUEDART 3926.45(3875.05)7010
BLUESTARCO 672.8(656.5)86045
BOMDYEING 70.6(69.55)1833281
BOSCHLTD 22623.2(23543.8)31577
BPCL 484.3(481.5)4211969
BRFL 129.4(129.85)72528
BRIGADE 251.4(252.65)57143
BRITANNIA 4101.95(4119.2)148713
CADILAHC 482.5(466.15)5310491
CANBK 325.9(330.7)2225972
CANFINHOME 2882.3(2832.35)93810
CAPF 705.45(705.1)542305
CARERATING 1571.2(1575.4)45268
CASTEXTECH 6.1(6)913416
CASTROLIND 374.5(378)606029
CCL 279.5(272.15)74273
CEATLTD 1693.35(1699.3)720053
CENTRALBK 73.2(82.05)1314714
CENTURYPLY 254.45(251.8)287853
CENTURYTEX 1176.95(1170.95)1120091
CERA 2730.45(2805)7901
CESC 918.15(909.95)579438
CHAMBLFERT 132.95(124.6)1429226
CHENNPETRO 386.7(381.7)1505571
CHOLAFIN 1143.45(1159)209600
CIPLA 541.4(548.2)4337214
CLNINDIA 574.1(586.85)35422
COALINDIA 235.9(238.95)3335287
COLPAL 1047.25(1054.65)124920
CONCOR 1157.95(1145.45)416998
COROMANDEL 406.25(400.5)196381
CORPBANK 46.65(46.4)323836
COX&KINGS 265.7(269.1)204907
CRISIL 1828.05(1816.1)10464
CUB 155.2(156.85)386822
CUMMINSIND 892(893)345553
CYIENT 492.95(507.6)22097
DABUR 303.4(306.55)649998
DALMIABHA 2493.35(2474.75)132934
DBCORP 366.7(368.35)20555
DBREALTY 34.7(34.2)770110
DCBBANK 173.85(172.95)2252609
DCMSHRIRAM 368.8(364.65)146495
DEEPAKFERT 336.15(334.6)503940
DELTACORP 164.1(162.45)2466073
DEN 76.7(76.6)101676
DENABANK 31.15(31.75)881391
DHANUKA 730.6(758.4)34356
DHFL 416.8(406.35)2937478
DISHTV 71.25(71.65)4025546
DIVISLAB 627.2(626.1)1248311
DLF 155.55(164.6)14677670
DREDGECORP 548.05(568.2)137003
DRREDDY 2011.15(1944.45)1857913
DYNAMATECH 2140.55(2219.25)7020
ECLERX 1252.3(1248.8)11241
EDELWEISS 236.9(232.5)3516231
EICHERMOT 29627.35(30111.7)58991
EIDPARRY 299.4(302.55)154140
EIHOTEL 131.35(131.25)81833
ELECTCAST 25.8(26.8)384693
ELGIEQUIP 218.95(223)39003
EMAMILTD 1075.8(1091.85)75801
ENGINERSIN 149.6(146.3)2759259
EROSMEDIA 189.75(195.75)653579
ESCORTS 592.4(588.1)4423523
ESSDEE 33.85(33.9)44667
ESSELPACK 246.95(240.5)65738
EVEREADY 301(307.85)48953
EXIDEIND 203(199.95)2456751
FCONSUMER 38.75(39)4144810
FDC 171(171)27485
FEDERALBNK 105.65(104.7)15087823
FINCABLES 495.05(490.25)204116
FINPIPE 574.4(580.95)35544
FLFL 311.9(314.2)100743
FORTIS 151.95(151.85)10893156
FSL 33.5(34.05)1774695
GAIL 368.95(365)3833882
GATI 106(109.25)513368
GDL 247.9(253.5)30131
GEPIL 666.6(659.65)19602
GESHIP 368.25(375.3)57205
GET&D 387.7(375.8)133887
GILLETTE 5138.55(5128.45)4345
GLAXO 2380.9(2374.55)6296
GLENMARK 616.6(612.75)1344430
GLOBOFFS 32.75(33)25832
GMDCLTD 132.55(133.7)418110
GMRINFRA 15.5(15.9)33704072
GODFRYPHLP 895.55(900.9)230559
GODREJCP 899.8(901.75)1335393
GODREJIND 559.3(576.7)535096
GODREJPROP 498.55(498.6)169162
GPPL 137.95(135.95)836542
GRANULES 109.2(107.05)3295916
GREAVESCOT 150.75(149.65)156795
GREENPLY 269.2(268.55)41647
GRINDWELL 380.6(371.35)50594
GRUH 465.7(464.55)111586
GSFC 123.6(119.55)2497978
GSKCONS 5324.9(5411.15)37236
GSPL 180.1(178.55)745965
GUJFLUORO 744.55(753.65)73666
GUJGASLTD 772.65(748.2)456377
GULFOILLUB 810.75(802.55)15712
GVKPIL 12.15(12.05)23046418
HATHWAY 30.8(30.5)150964
HAVELLS 458.65(463.65)1195720
HCC 33.8(33.75)6038673
HCL-INSYS 41(41.75)1372932
HCLTECH 872.3(882.9)1692430
HDFC 1695.35(1709.8)1987331
HDFCBANK 1749.05(1760.45)1589959
HDFCBANK 1760(1810)114000
HDIL 58.45(56.2)42996202
HEIDELBERG 115.7(113.7)300677
HEROMOTOCO 3840.9(3889.55)302935
HEXAWARE 254.5(253.75)562405
HFCL 15.45(15.15)6745413
HIMATSEIDE 311(294.35)171739
HINDALCO 221(238)21126006
HINDCOPPER 59.9(60.9)621169
HINDPETRO 429.05(412.45)9817059
HINDUNILVR 1152.8(1170.7)861457
HINDZINC 270.5(280.8)2262641
HMT 32.2(33.25)2481
HMVL 263.8(266.75)17649
HONAUT 12597.75(12554.95)1249
HOTELEELA 20.55(20.7)256770
HSIL 346.85(360.9)143555
HTMEDIA 84.1(82.8)114540
IBREALEST 224.9(227.95)18509810
IBULHSGFIN 1149.9(1156.5)1378960
ICICIBANK 286.95(288.75)17211539
ICRA 3892.4(3877.6)4089
IDBI 52.65(53.8)3295406
IDEA 86.2(87.95)7099401
IDFC 53.6(54.65)8753130
IFBIND 639.6(647)7946
IFCI 21.7(22.8)15421513
IGARASHI 993.05(987.45)21849
IGL 1215.5(1214.2)763856
IIFL 563.8(567.45)142094
IL&FSTRANS 77.6(76.1)450573
INDHOTEL 122.4(124.75)275579
INDIACEM 176.45(174.8)7658809
INDIANB 279.85(273.85)1939289
INDOCO 192.75(192.8)41159
INDUSINDBK 1625.35(1629.4)1142387
INEOSSTYRO 846.3(843.5)25351
INFRATEL 382.3(382.45)2645105
INFY 987.7(981.25)3272078
INGERRAND 778.6(787.55)15219
INOXLEISUR 232.1(233.7)58440
INOXWIND 110.1(118.1)723398
INTELLECT 99.55(100.9)359144
IOB 22.5(23.1)1998851
IOC 411.8(410.3)3768327
IPAPPM 285.4(284.55)23861
IPCALAB 409.45(419.85)235204
IRB 203.05(200.75)2645784
ITC 271.5(273.1)14409594
J&KBANK 72.25(75)754448
JAGRAN 172.1(174)108969
JAICORPLTD 69.7(72.25)694473
JBCHEPHARM 294.45(284.9)112540
JBFIND 161.25(153.75)412345
JCHAC 1926.9(1928.05)4354
JETAIRWAYS 557.3(560.3)2382960
JINDALPOLY 358.55(376.2)106729
JINDALSTEL 127.65(123.3)16525936
JISLJALEQS 91.7(92.15)6983899
JKCEMENT 1030.7(1015.75)30277
JKIL 227.35(284.15)197004
JKLAKSHMI 418.3(417.6)55058
JKTYRE 147(149.55)1194214
JMFINANCIL 117.95(117.4)817738
JPASSOCIAT 21.25(23.3)216123157
JPINFRATEC 17.95(18.85)1512357
JPPOWER 5.7(6.25)16478712
JSWENERGY 63.75(64.9)13439963
JSWHL 1740.45(1730.7)6450
JUBILANT 680.9(642.9)452476
JUBLFOOD 1296.6(1317.95)1223225
JUSTDIAL 341.55(339.2)1576951
JYOTHYLAB 376.1(381.1)89001
KALPATPOWR 343.6(339.2)282926
KANSAINER 443.55(444.8)80344
KEC 281.55(290.15)519271
KESORAMIND 128.05(125.35)267740
KIRLOSENG 384.85(390.05)27843
KITEX 227.65(232.55)109941
KOLTEPATIL 147.1(144.85)153550
KOTAKBANK 992.2(996.8)1421743
KPIT 109.8(108.75)1835322
KRBL 450.15(445.35)130902
KSCL 524.1(530.65)2777037
KSK 6.7(7)1160916
KTKBANK 138.5(138.05)3935722
KWALITY 139.85(135.25)2229302
L&TFH 163.8(165.15)7107628
LAKSHVILAS 169.95(171.9)864875
LAOPALA 466.7(469.95)8546
LAXMIMACH 5807.05(5809.7)4963
LICHSGFIN 651.8(657.65)1359751
LITL 1(1.05)940420
LT 1131.95(1157.7)2001103
LUPIN 940.9(936.7)1617852
M&M 1348.05(1387.05)1126510
M&MFIN 411.4(407.3)4704952
MAGMA 176.15(172.4)267494
MAHINDCIE 231.55(236.05)89613
MAHLIFE 414.95(409.15)167838
MANAPPURAM 85.85(93.3)17397014
MANPASAND 792.3(780.3)69182
MARICO 319.95(320.55)1062783
MARKSANS 39.55(37.25)4937079
MARUTI 7457.4(7578.75)676390
MAYURUNIQ 325.7(322.65)350231
MCDOWELL-N 2418.8(2490.8)565996
MCLEODRUSS 169.75(173.6)106192
MERCK 1114.55(1136.3)9274
MHRIL 342.25(350.4)240993
MINDACORP 103.15(103.45)124915
MINDTREE 457.15(451.3)238168
MMTC 54.15(55.45)595395
MOIL 340.55(327.65)1031358
MONSANTO 2500.05(2547.6)10301
MOTHERSUMI 323.25(317.45)4526124
MOTILALOFS 1086(1086.05)84545
MPHASIS 571.45(572.9)13312
MRF 63922(64100.7)16985
MRPL 118.6(119.5)3552428
MTNL 17.2(17.75)1102634
MUTHOOTFIN 442.85(434.7)1007259
NATCOPHARM 699.1(695.75)2197658
NATIONALUM 62.5(65)2282134
NAUKRI 956.25(991.45)60293
NAVKARCORP 179.5(184.85)66576
NCC 83.05(83.25)2945379
NETWORK18 51.05(51.05)337912
NHPC 30.3(30.05)6169917
NIITTECH 479.6(475.35)412974
NITINFIRE 5(5.25)791797
NLCINDIA 94.9(95.3)148553
NMDC 117.65(121.75)6190040
NTPC 168.85(172.65)5018272
OBEROIRLTY 367.35(362.55)57135
OFSS 3457(3445.45)20814
OIL 278.95(281.95)711232
OMAXE 200(201.3)449829
ONGC 159.65(163.7)5471462
ORIENTBANK 118(126.95)5777982
ORIENTCEM 153(153.25)262736
ORISSAMINE 1673.85(1700.85)6256
PAGEIND 15869.15(16204.05)16108
PCJEWELLER 297.1(296.85)3146388
PEL 2701.85(2731.1)274185
PERSISTENT 610.5(615.05)32306
PETRONET 210.95(208.2)10620215
PFC 117.65(124.55)14095760
PFIZER 1791.95(1791.5)13808
PFS 36.65(38.05)2377411
PGHH 7955.35(8017.6)5110
PHOENIXLTD 496.35(504.45)25311
PIDILITIND 790.3(795.35)326785
PIIND 692.25(700.5)666871
PNB 140.35(143.15)14050916
POLARIS 232.7(230.15)171940
POWERGRID 218.9(217.4)4984245
PRAJIND 66.05(68.35)460605
PRESTIGE 254.4(251.35)172454
PRISMCEM 112.05(114.4)86992
PTC 108.6(108.75)3909440
PUNJLLOYD 18.95(19)1501309
PURVA 67.8(66.7)181902
PVR 1285.9(1332.6)354851
RADICO 139.75(139.3)443654
RAIN 115.75(113.1)3862841
RAJESHEXPO 709.05(714.05)522319
RALLIS 233.45(226.7)139279
RAMCOCEM 661.4(666.9)129347
RAMCOSYS 345.1(352.55)39240
RATNAMANI 822.3(810.25)10798
RAYMOND 718.15(723.3)524109
RCF 92.85(94.55)5537321
RCOM 20.75(21.2)17576664
RDEL 51.2(50.95)2561992
RECLTD 165.2(163.75)7096914
REDINGTON 143.4(140.55)518122
RELAXO 485.75(485.8)13615
RELCAPITAL 748.9(764.25)6096465
RELIANCE 1546.25(1584.35)3885064
RELINFRA 469.2(474.45)2364344
RENUKA 16.65(16.85)4215724
REPCOHOME 634.7(640.9)290254
RIIL 397.7(408)167676
RKFORGE 525.85(526.8)33500
ROLTA 51.9(52.5)355874
RPOWER 38.7(39)2433410
RTNPOWER 5.9(5.95)5315257
RUCHISOYA 20.7(20.6)331802
SADBHAV 269.05(278.55)414631
SADBHIN 101.25(102.25)23209
SAIL 56.5(58.85)5706740
SANOFI 4103.05(4171.35)2978
SBIN 280.15(296.7)67652562
SCHAEFFLER 4322.55(4166.4)1753
SCHNEIDER 119.05(118.25)53332
SCI 82.4(88)2338176
SHARDACROP 445.15(445.05)22535
SHILPAMED 569.25(551.2)115521
SHK 252.8(252.35)46833
SHOPERSTOP 344.7(339.75)36538
SHREECEM 17524.1(17336.3)13059
SHRIRAMCIT 2077(2105.9)8975
SIEMENS 1282.65(1289.45)197148
SIMPLEXINF 449.1(469.2)37939
SINTEX 28.5(27.25)41607163
SITINET 25.5(24.95)1328171
SJVN 31.05(31.45)278255
SKFINDIA 1523.25(1523.95)7510
SMLISUZU 959(959.35)45341
SNOWMAN 48.25(50.9)926139
SOBHA 370.8(360.15)215116
SOMANYCERA 756(750.1)12018
SONATSOFTW 150(149.5)136252
SOUTHBANK 26.3(26.25)14124572
SPARC 337.55(341.05)332409
SREINFRA 110.5(108.6)1588582
SRF 1479.8(1473.4)238201
SRTRANSFIN 952.05(933.75)826052
STAR 874.8(941.95)815882
STCINDIA 147.35(152.6)149239
SUNDARMFIN 1622.45(1660.55)36758
SUNDRMFAST 373.15(373.6)102435
SUNPHARMA 450(460.8)7851424
SUNTV 706.9(680.8)1691825
SUPREMEIND 1031.55(1052.4)74138
SUVEN 156.2(161)178749
SUZLON 15.25(15.4)65653914
SWANENERGY 117.9(115.4)618694
SYMPHONY 1221.7(1205.05)100013
SYNDIBANK 62.4(63.8)2720056
SYNGENE 449.35(439.45)75255
TAKE 139.3(148.1)183526
TATACHEM 578.35(576.75)785813
TATACOFFEE 119.15(119.7)420755
TATACOMM 587.95(594.25)904383
TATAELXSI 1605.1(1627.05)300137
TATAGLOBAL 164.2(156)6027593
TATAMOTORS 374.5(380.2)14699477
TATAMTRDVR 223.2(221.45)3666464
TATAPOWER 76.55(76.7)4403984
TATASPONGE 795.9(794.4)167017
TATASTEEL 596.75(604.35)8579300
TBZ 94.95(95.85)266288
TCS 2496.05(2511.45)697368
TECHM 402.8(404)2782291
TECHNO 346.45(355.95)182429
TEXRAIL 86(87.05)541433
THERMAX 865.1(861.55)13547
THOMASCOOK 219.75(221.15)616773
TIDEWATER 5685.4(5660.35)1929
TIMKEN 677.2(692.25)16158
TITAN 607(610.35)1482422
TNPL 345.45(353.95)97220
TORNTPHARM 1216.05(1228.9)75305
TORNTPOWER 194.1(189.3)1853074
TREEHOUSE 14.65(15.35)111250
TRIDENT 75.2(77.9)988272
TRITURBINE 133.5(130.05)358841
TTKPRESTIG 6272.7(6179.95)29125
TTML 6.5(6.6)2439296
TUBEINVEST 766.3(753.75)73058
TV18BRDCST 35.25(35.35)3144192
TVSMOTOR 536.8(580.75)4190408
TVSSRICHAK 3300.9(3379.45)10429
TVTODAY 247.7(216.45)675639
UBL 787.6(824.2)438643
UCOBANK 29.9(30.5)813869
UFLEX 387.85(375.2)335662
ULTRACEMCO 3922.55(3907.6)252752
UNICHEMLAB 240.7(245.05)90130
UNIONBANK 127.3(134.45)11096223
UNITECH 7.45(7.4)42613657
UPL 811.35(821.5)1259736
VAIBHAVGBL 492.45(509.15)14328
VAKRANGEE 442.95(449.35)1589824
VEDL 279.1(298.8)18382815
VIDEOIND 18.55(19.5)398239
VIJAYABANK 66.35(67.5)1104163
VINATIORGA 962.05(961.45)17859
VIPIND 188.55(183.8)231268
VOLTAS 517.2(520.15)931742
VRLLOG 323.65(321.9)71078
VSTIND 2621.85(2706.35)4607
VTL 1173.6(1177.25)10338
WABAG 620.6(613.1)123133
WABCOINDIA 5371.1(5425)13348
WELCORP 116.9(112.25)887203
WELSPUNIND 69(72.95)1076933
WHIRLPOOL 1150.15(1160.8)18282
WIPRO 289.7(288.15)3549897
WOCKPHARMA 555.65(561.2)634883
WONDERLA 337.4(340.45)24005
YESBANK 1739.4(1730.1)3102129
ZEEL 504.9(520.05)3637319
ZEELEARN 39(39.85)376551
ZENSARTECH 793.3(808.65)14596
ZYDUSWELL 859.35(882.1)10610

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ADITYA SPIN. 8.64(9)181
AGRO TECH FO 515.3(508.25)813
AISHWARYA TE 4(4)259
ALPHAGEO (I) 794.15(787.15)4890
ALU FLUORIDE 51.65(53.6)10494
AMAR RAJA BA 800.75(798.85)826261
ANDHRA BANK 49.75(50.85)428201
ANDHRA CEMEN 8.79(8.81)37285
ANDHRA PETRO 24.1(24.9)46695
ANJANI PORTL 203.05(200.45)1415
ASTRA MICRO 119.9(120.65)42926
AUROB.PHARMA 704.8(683)396637
AVANTEL LTD 219.75(214.3)3389
AVANTI FEEDS 1645.1(1573.4)56193
B.N.RATHI SE 29.65(30.55)9899
BALAJI AMINE 308.55(300.8)5210
BAMBINO AGRO 175(172.55)408
BARTRONICSIN 14.05(13.65)34494
BHAGIRA.CHEM 174.95(174)729
BHAGYA INL 22.2(21.9)3892
BHARATFIN 785.5(778.05)172514
BNR UDYOG 37.85(37.6)1354
CAMBRIDGE 65.95(67.25)4625
CAT TECHN. .63(.63)100
CCHHL 13.01(12.9)100563
CCL PRODUCTS 279.85(274.2)14433
CELESTIAL 21.9(23.1)25693
CIL SECURITS 38.4(38.6)4469
COROM INTER 407.05(404.15)23653
CUBEX TUBING 15.9(16.2)2255
CYIENT 493.1(508.9)3599
DANLAW TECH. 48.9(50.5)3929
DECAN CEMENT 1089.65(1070.9)552
DIAMONPOWER 21.65(23.15)52987
DIVI'S LAB. 626.85(624.65)96525
DIVYA.GRANIT 97.25(93.15)5042
DQ ENT 11.84(12.01)7116
DR.REDDY'S 2011.35(1948.95)123041
EMPEE SUGARS 5.4(5.33)15969
EVEREST ORG. 96.7(97.95)4803
FACOR ALLOYS 3.85(3.61)179610
FIRSTOBJ 15.85(15.75)1347
GATI LTD. 105.95(109.5)117310
GAYATRI PROJ 155.15(151.05)3928
GENNEX LAB 3.99(4.09)128690
GMR INFRASTR 15.5(15.9)3451571
GODAVARI DRU 34.35(37.1)8147
GOLDST INFRA 107.3(102.2)89280
GOLDSTONE EN 11.04(11.62)3652
GRANULES (I) 109.35(107.3)339741
GVK POWERINF 12.19(12.05)4908544
HBL P SYS 43.55(43.9)60409
HERITGFOOD 1217.5(1230.55)3935
HINDUSTN BIO .9(.93)200
I.C.S.A. IND 2.68(2.7)10931
INCAP LTD. 53.25(51.1)11342
IPAPPM 285.65(283.25)7792
IVRCL LTD 5.3(5.39)460200
KAKATIYA CEM 319.95(337.55)20517
KALLAM SPG. 27.6(27.8)59610
KAVERI SEED 524.55(531.5)277526
KCP LTD 97.4(96.1)25529
KERNEX MICRO 32.7(33.25)11649
KNR CONST 202.95(203.35)13903
KREBS BIOCHM 91.1(94.7)2969
LANCO INFRA .95(1)1334507
LOKESH MACH 77.65(77.1)13571
MADHUCON PRJ 28.4(28.65)46857
MOLD-TEK TEC 49.8(49)2688
MOSCHIP SEMI 41.65(43.5)118124
MSR INDIA 28.95(27.6)30295
N C L IND. 195.55(200.4)24781
NAGAR.AGRICH 31.9(31.1)56369
NATCO PHARM 702.5(696.65)212130
NCC 82.85(82.35)2222712
NEHA INTER. 5.64(5.54)24287
NETTLINX LTD 99.95(110.9)13530
NEULAND LAB. 1241.05(1228.3)1918
NIHAR INFO 15.7(13.65)601
NILE LTD. 591.8(613.85)9720
NTL 4.09(3.8)6412
OIL COUNTRY 41.5(42.6)6156
PADMALAYA TE 7.79(8.19)15185
PALRED 85.65(87.15)1142
PANYAM CEMEN 57.95(56.8)10967
PENNAR STEEL 49.1(49.4)170782
PFL INFOTECH 5.74(5.65)1132
PHYTOCHEM I. 51.5(50.1)1699
PITTI LAMIN. 48.6(47.75)6415
POKARNA LTD 1195.3(1220.5)1341
PRAJAY ENGS. 8.17(8.57)29508
PREMIER EXPL 445.7(435.45)1123
PRISM CEMENT 112.1(113.6)24244
RAIN 115.8(112)709203
RAJ PACKAGIN 54.75(53.95)2292
RAJVIR IND 42.95(41.1)1
REG.CERAMIC 5.67(5.58)1200
RESTILE CER. 4.74(5.12)2798
SAGAR CEM. 816.15(822.15)957
SAMKRG PIST. 250.25(251.6)14820
SAMPRE NUTRI 40(41)4244
SANGHI IND. 73.3(75.1)280131
SATVAH.ISPAT 36.75(37.5)12790
SAVEN TECHNO 22(22.45)11971
SIBAR AUTO 13.8(13.15)20
SMPL 1.64(1.5)26850
SMS PHARMACE 68.85(69.35)3919
SREE RAYALA 121(122.1)2207
STEEL EXCH 80.25(84.45)113479
SUJANA INDUS .96(.93)49954
SURANATP 4.56(4.62)3833
SURYACHAKRA 1.1(1.09)219836
SURYAMBA SP 54.35(51.4)629
SURYLAK.COTT 98.65(100.35)1691
SUVEN LIFE S 155.95(160.6)60546
TAJ GVK HOTL 159(160.2)1727
TANLA 30.2(31.2)113336
TRANSCORP IN 18.3(19.4)5478
TRANSGENE BI 2.08(2.13)18128
TRANSPORT CO 276.6(273.25)12822
USHER AGRO 6.6(6.8)38447
VICEROY HOTE 16.55(17.2)81564
VIJAY TEXTIL 55.05(57.9)3249
VIMTA LABS 134.05(129.6)6818
VIRAT CRANE 35.05(36)1245
VIRINCHI 79.05(79.6)48005
VISAKA IND. 440.2(431.25)51109
VISTA PHARMA 28.35(29.15)23155
VIVIMED LABS 106.45(109.35)138573
VST INDUS. 2622.35(2690.95)935
WATERBASE 107.85(111.15)244491
XLENERGY 1.8(1.85)8180
YBRANTDIGI 6.59(6.61)150496
ZEN TECH 49.45(50.7)27944
ZENOTECH 45.45(45.05)11603

ఆంధ్రజ్యోతి బిజినెస్
విజయవాడ
శనివారం 12 ఆగస్టు 2017

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (ముంబై)	వెండి	రూపాయి Vs డాలర్	ముడి చమురు
▼ 317.74	▼ 109.45	▲ 140	▲ 115	▼	▼
31213.59	9710.80	29,210 (10 గ్రాములు (99.9 స్వచ్ఛత))	39,110 (కిలో (రూపాయల్లో))	64.13	53.72 (బ్యారల్ ధర (డాలర్లలో..))

మందకొడి ఖాతాల్లో రూ. 1.7 లక్షల కోట్లు

• నోట్ల రద్దుపై ఆర్‌బిఐ నివేదిక

ముంబై: తరచు లావాదేవీలు జరగని, వినియోగంలో లేని మందకొడి ఖాతాల్లో పెద్ద నోట్ల రద్దు సమయంలో అసాధారణంగా 1.6 లక్షల కోట్ల నుంచి 1.7 లక్షల కోట్ల రూపాయలు డిపాజిట్ అయినట్టు ఆర్‌బిఐ తేల్చింది. డీమానిటైజేషన్ ప్రకటించిన తర్వాత ప్రజలు తమ వద్ద ఉండిపోయిన పాత కరెన్సీని జమ చేసేందుకు ఇచ్చిన గడువు (2016 నవంబర్ 11 - డిసెంబర్ 30) సమయంలో బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చి పడిన అదనపు డిపాజిట్లు 2.8 లక్షల కోట్ల నుంచి 4.8 లక్షల కోట్ల రూపాయలు కాగా మందకొడి ఖాతాల్లోనే 1.7 లక్షల కోట్లు జమ అయిందని 'డీమానిటైజేషన్-బ్యాంకు డిపాజిట్ల వృద్ధి' పేరిట తయారుచేసిన ఒక పత్రంలో ఆర్‌బిఐ తెలిపింది. పరిమాణంపరంగా చూస్తే అదనంగా జమ అయిన ఈ డిపాజిట్ల వృద్ధి 4 శాతం నుంచి 4.7 శాతమని, ఈ ఏడాది ఫిబ్రవరి మధ్య కాలం వరకు కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ వృద్ధి 3.3 శాతం నుంచి 4.2 శాతం మధ్య ఉన్నదని వివరించారు. ఇదే సమయంలో బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చిన మొత్తం డిపాజిట్ల వృద్ధి అంతకు ముందు ఏడాది అదే నెలలతో పోల్చితే 10.3 శాతం నుంచి 14.5 శాతానికి పెరిగింది. ఈ డిపాజిట్లు ఆ తర్వాత కూడా ఇదే తీరుగా కొనసాగి ఉంటే ప్రజల పొదుపుపై గణనీయమైన ప్రభావం కనిపించి ఉండేదని కూడా పేర్కొన్నారు.



విశాఖ, నెల్లూరులో ఫార్మా క్లస్టర్లు!

అమరావతి (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అచ్యుతాపురంలోని రాంబిల్లి, నెల్లూరు జిల్లా దమ్మనిపట్నం వద్ద రెండు ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు కేంద్రం పరిశీలన చేస్తుంది. ఈ రెండు ప్రాంతాల్లో 2016 కేంద్ర విధానాల మేరకు 2000 ఎకరాల్లో 12,000 కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా ఔషధ క్లస్టర్లను ఏర్పాటు చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. అయితే.. కేంద్రం మాత్రం 200 కోట్ల రూపాయలు మాత్రమే నిధులు ఇస్తామని చెబుతుంది. రూ.200 కోట్లతో పనులు సాగవని ఆంధ్రప్రదేశ్ తేల్చి చెబుతోంది. రాష్ట్రంలో ఔషధ క్లస్టర్లకు పర్యావరణ అనుమతులు ఉన్నాయని ఎపి స్పష్టం చేస్తోంది. పూర్తి స్థాయి క్లస్టర్ల నిర్మాణంతోనే ఇటు పరిశ్రమలకు లబ్ది చేకూరటంతో పాటు భారీగా ఉపాధి అవకాశాలు ఉంటాయని లేని పక్షంలో ఈ క్లస్టర్ల యోచన వృధా అని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది.

భోగాపురం విమానాశ్రయ రేసులో ఎఎఐ, జిఎంఆర్

• సెప్టెంబరు నుంచే విమానాశ్రయ పనులు

అమరావతి (ఆంధ్రజ్యోతి): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు సెప్టెంబరు నుంచి ప్రారంభం కానున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా నిర్మించే ఈ విమానాశ్రయం పనులను దక్కించుకునేందుకే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ), జిఎంఆర్ సంస్థలు పోటీ పడుతున్నాయి. ఈ నెల 20వ తేదీన భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఫైనాన్షియల్ బిడ్‌లను తెరవనున్నారు. విమానాశ్రయాలను నిర్మించడంలో విశేషానుభవం కలిగిన ఎఎఐ, జిఎంఆర్ సంస్థల మధ్య పోటీ నెలకొనటం రాష్ట్రానికి అర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని మౌలిక సదుపాయాల కల్పన శాఖ ఉన్నతాధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబరు నెలలో భూమి పూజ చేసి నిర్మాణాలు చేపడితే 2019 నాటికి పనులు పూర్తవుతాయన్న ధీమాను అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే కేబినెట్‌లో దగదర్తికి ఓకే..

దగదర్తి విమానాశ్రయ నిర్మాణ పనులకు వచ్చే కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించనుందని అధికారులు చెబుతున్నారు. ట్రూజెట్ సంస్థ ఈ నిర్మాణ పనులను చేపట్టేందుకు అర్హత సాధించింది. రెవెన్యూలో 9 శాతం వాటాను ప్రభుత్వానికి ఇచ్చేందుకు ట్రూజెట్ సంస్థ సమ్మతించింది. మలేషియా సంస్థలతో జాయింట్ వెంచర్‌గా ఈ పనులు ట్రూజెట్ చేపడుతుంది. మరోవైపు ఓర్వకల్లు విమానాశ్రయ రన్‌వే పనులు శరవేగంగా సాగుతున్నాయి.

ఓడరేవుల నిర్మాణంలో నిస్తేజం

విమానాశ్రయాల నిర్మాణాల్లో చురుకుదనం కన్పిస్తుంటే ఓడరేవుల నిర్మాణంలో మాత్రం నిస్తేజం ఆవహించింది. ఓడరేవుల నిర్మాణం పట్ల అనుభవం కలిగిన సంస్థలు కూడా నిస్తేజంగా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా భావనపాడు ఓడరేవు పనులను 2.3 శాతం రెవెన్యూ వాటా ఇచ్చేందుకు ముందుకు వచ్చి పనులు దక్కించుకున్న అదానీ సంస్థ ఇప్పుడు అంత ఆసక్తిని కనబరచడం లేదు. కాకినాడ జిఎంఆర్ సెజ్ క్యాప్టివ్ పోర్టు వాణిజ్య విభాగంలోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఇందుకోసం స్విస్ ఛాలెంజ్ విధానంలో కాంపిటేటివ్ బిడ్డింగ్‌కు వెళ్లేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో థర్మల్ విద్యుత్తు సంస్థలు ప్లాంట్ లోడ్ రిలీఫ్‌ను తగ్గించుకోవడం, విదేశీ బొగ్గును వాడరాదన్న నిర్ణయం తీసుకోవడం వంటి కారణాల నేపథ్యంలో ఓడరేవులు నిర్మాణానికి సంస్థలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

7.5 శాతం చాలా కష్టం..

ఎల్లెడలా మందగమనమే..
ఉద్యోగాల కల్పన పెద్ద సవాలు
వడ్డీరేట్లు మరింత తగ్గాలి..
ఆందోళన కలిగిస్తున్న యాంటిగ్లోబలైజేషన్
ఆర్థిక సర్వే హెచ్చరికలు



న్యూఢిల్లీ: ఆర్థిక రంగంలో ఎల్లెడలా కనిపిస్తున్న మందగమనం కారణంగా ఈ ఏడాది 7.5 శాతం వృద్ధి రేటును అందుకోవడం చాలా కష్టమని కేంద్ర ప్రభుత్వ మధ్యంతర ఆర్థిక సర్వే తేల్చిచెప్పింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధి రేటు 6.75-7.5 శాతం ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేసిన విషయం తెలిసిందే. ఈ అంచనాలు అందుకోవడం కష్టమని తాజా సర్వే స్పష్టం చేసింది. 2017-18 ఆర్థిక రంగం భవిష్యత్తులో అనిశ్చితే కనిపిస్తోందని సర్వే ప్రకటించింది. ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితులు బలాన్ని పుంజుకొనే సూచనలు కనిపిస్తున్నాయని హెచ్చరించింది. ఆర్థిక రంగంలో ఉత్తేజానికి ప్రభుత్వం తక్షణమే విధానపరమైన సమస్త చర్యలకు శ్రీకారం చుట్టడంతో పాటు వడ్డీ రేట్లను మరింత తగ్గించాలని సర్వే సూచించింది. డాలర్ మారకంలో బలోపేతం అవుతున్న రూపాయి, రైతుల రుణ మాఫీ, బ్యాంకుల మొండి పద్దుల సమస్య, ముఖ్యంగా విద్యుత్, టెలికామ్ రంగాలకు ఇచ్చిన రుణాలు మొండి పద్దుల జాబితాలో చేరడం, జిఎస్‌టి అమలు క్రమంలో ఎదురవుతున్న సమస్యలు... ఆర్థిక రంగం ఎదుర్కొంటున్న సవాళ్లలో కొన్ని అని సర్వే తెలిపింది. జిడిపి, పారిశ్రామిక ఉత్పత్తుల సూచీ, పరపతి పంపిణీ, కొత్త పెట్టుబడులు, కంపెనీల సామర్థ్య వినియోగం... ఈ అంశాలన్నీ ఆర్థిక రంగంలోని అన్ని పార్శ్వాలనూ మందగమనం అలుముకున్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని సర్వే పేర్కొంది. పెరుగుతున్న వాణిజ్య లోటు, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న స్వీయరక్షిత విధానాలు.. ముఖ్యంగా వీసాలపై ఆంక్షలు, టారిఫ్‌యేతర ప్రతిబంధకాలు ఆందోళన కలిగించే అంశాలని పేర్కొంది. ఉద్యోగాల కల్పన అతి పెద్ద సవాలని హెచ్చరించింది. డిమాండ్ లేకున్నా ఇళ్ల ధరలు భారీగా పెరగడాన్ని ఎత్తి చూపింది.

సాధారణంగా వార్షిక బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం రివాజు. ఇందుకు భిన్నంగా తొలిసారిగా మధ్యంతర ఆర్థిక సర్వేను ప్రభుత్వం శుక్రవారం నాడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేకు రెండో భాగంగా తాజా సర్వేను పార్లమెంట్‌లో ఉంచారు. ఆర్థిక రంగాన్ని కుంగదీస్తున్న పలు సవాళ్లను ప్రస్తావిస్తూ, పునరుత్తేజానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను సర్వే సూచించింది. ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ రూపొందించిన ఈ మధ్యంతర సర్వే ఆర్థిక రంగానికి సంబంధించిన తీవ్రమైన సవాళ్లపై ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసే ప్రయత్నం చేసింది. ఆర్థిక రంగాన్ని దెబ్బతీసే ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితులు అంకుర స్థాయిలో ఉన్నాయనీ అవి బలం పుంజుకునే ప్రమాదం ఉందనీ హెచ్చరించింది. వ్యవసాయ రాబడులు సన్నగిల్లడం, పప్పులు, నూనెగింజల వంటి ఆహార ఉత్పత్తుల ధరలు తిరోగమించడం, రుణ మాఫీలు, ద్రవ్య కట్టడి విధానాలు, టెలికామ్, విద్యుత్ రంగాల్లో తగ్గుతున్న లాభదాయకత... ఇవన్నీ ఆర్థిక రంగాన్ని ప్రభావితం చేసేవే అని వెల్లడించింది. రిలయన్స్ జియో పోటీ దెబ్బకు టెలికామ్ రంగంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభాన్ని, రుణాల మోతను కూడా ప్రస్తావించింది.

తప్పిన అంచనాలు..

ఈ ఏడాది మొదట్లో ప్రకటించిన ఆర్థిక సర్వే అంతర్జాతీయ ఆర్థిక రంగంలో పురోగమనం ఉంటుందనీ దాని వల్ల మన ఎగుమతులూ పుంజుకుంటాయని అంచనా వేసింది. నోట్ల రద్దు దరిమిలా మళ్లీ పరిస్థితి సాధారణ స్థాయి చేరి వినియోగం దుమ్ము రేపుతుందని భావించింది. వడ్డీ రేట్లు కూడా తగ్గుతాయని అంచనావేసింది. వీటివల్ల ఆర్థిక వృద్ధి రేటు 6.75 నుంచి 7.5 శాతానికి దూసుకుపోతుందని భావించింది. తాజా సర్వేలో ఈ అంచనాలన్నీ తల్లకిందులయ్యాయి.

కొన్ని ముఖ్యాంశాలు

హెచ్చరికలు..

- 7.5శాతం జిడిపి వృద్ధి రేటు చాలా కష్టం.
- కీలక సంస్కరణల్లో జిఎస్‌టితో పాటు ఎయిర్‌ఇండియా ప్రైవేటీకరణ, ఇంధన సబ్సిడీల తగ్గింపు, బ్యాంకుల ఎన్‌పిఎ సమస్య
- రైతుల రుణమాఫీ భారం 2.7 లక్షల కోట్ల రూపాయలు
- హౌజ్ రెంట్ అలవెన్స్ వల్ల ద్రవ్యోల్బణం 0.4 నుంచి 1 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది.
- విత్తలోటు 3.5 శాతం నుంచి 3.2 శాతానికి తగ్గొచ్చు
- వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, నిల్వలపై ఆంక్షలు ఎత్తివేయాలి.
- షెడ్యూల్డ్ బ్యాంకుల స్థూల ఎన్‌పిఎల మొత్తం 2016 సెప్టెంబర్‌లో 9.2 శాతం ఉండగా 2017 మార్చి నాటికి 9.5 శాతానికి చేరింది.

భరోసాలు..

- రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం దాటకపోవచ్చు
- నోట్ల రద్దు తర్వాత నామినల్ జిడిపిలో వృద్ధి కనిపిస్తోంది. పన్ను చెల్లింపుదారుల జాబితాలో మరో 5.4 లక్షల మంది చేరారు.
- కరెంట్ అకౌంట్ లోటు 1.1 శాతం నుంచి 2016-17లో 0.7 శాతానికి తగ్గింది.
- స్థూల ఎఫ్‌డిఐల మొత్తం కూడా 5560 కోట్ల డాలర్ల నుంచ 6020 కోట్ల డాలర్లకు పెరిగింది
- నికర ఎఫ్‌డిఐల మొత్తం 3560 కోట్ల డాలర్లు ఉంది
- భారత్ ఫారెక్స్ నిల్వల మొత్తం 38640 కోట్ల డాలర్లుంది. బ్రెజిల్ తర్వాత స్థానంలో భారత్ ఉంది.

సర్వే ఏం చెప్పిందంటే..



రుణ మాఫీలతో దెబ్బ

వ్యవసాయ రుణ మాఫీల వల్ల ఆర్థిక రంగంలో డిమాండ్ పడిపోయే అవకాశం ఉంది. జిడిపిలో 0.7 శాతం మేర డిమాండ్ తగ్గిపోయే అవకాశం ఉంది. ఇప్పటికే వివిధ రాష్ట్రాలు ప్రకటించిన వ్యవసాయ రుణాల మాఫీ 1.25 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. అన్ని రాష్ట్రాలు దీనిని అమలు చేస్తే మాఫీల మొత్తం 2.7 లక్షల కోట్ల రూపాయలకు చేరుతుంది. ఈ చర్యలు ప్రతిద్రవ్యోల్బణ కారకాలుగా మారి వృద్ధిని దెబ్బతీస్తాయి. డిమాండ్‌పై రుణమాఫీ ప్రభావం 1.14 లక్షల కోట్ల రూపాయల మేర ఉంటుంది.

గత ఏడాది నుంచే...

ఆర్థిక రంగంలో ప్రతిద్యవ్యోల్బణ ఛాయలు గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం నుంచే పొడసూపుతున్నాయి. ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్న 6.75-7.5 ఆర్థిక వృద్ధి రేటులో గరిష్ఠ టార్గెట్ 7.5 శాతాన్ని చేరుకోవడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తోంది. గతేడాది భారత్ వృద్ధి రేటు 7.1 శాతం ఉంది. ఆఖరు త్రైమాసికం (2017 జనవరి-మార్చి)లో పెద్ద నోట్ల రద్దు దెబ్బకు వృద్ధి రేటు 6.1 శాతానికి పడిపోయింది. నిజానికి మూడో త్రైమాసికం నుంచే తిరోగమనం ఉంది. జిఎస్‌టి కారణంగా మందగించే పరోక్ష పన్నుల వసూళ్లు, ఏడో వేతన సంఘం వల్ల పెరిగిన వ్యయం, టెలికామ్ స్పెక్ట్రమ్ రాబడులు తగ్గడం.. ఇవన్నీ ఆర్థిక వృద్ధికి ప్రతిబంధకాలే. అయితే జిఎస్‌టి వల్ల పన్ను పరిధి విస్తరించడం, పన్నుల ఎగవేతలకు అడ్డుకట్ట పడే అవకాశం, పెద్ద నోట్ల రద్దు వల్ల పెరిగిన ఆదాయం పన్ను చెల్లింపుదారుల సంఖ్య, తగ్గిన నగదు చలామణి... ఇవన్నీ సానుకూల అంశాలు.

వడ్డీ రేట్లను తగ్గించాలి....

ద్రవ్యోల్బణం తగ్గడం వల్ల లభించిన అవకాశాన్ని వినియోగించుకొని ఆర్‌బిఐ రెపో రేటును మరింత తగ్గించాలి. తటస్థ రేటు కంటే ప్రస్తుత రెపో రేటు 0.25-0.75 శాతం ఎక్కువగా ఉంది. సైక్లికల్ పరిస్థితులను బట్టి చూస్తే రెపో రేటు ఇంకా తక్కువ స్థాయిలో ఉండాలి. వడ్డీ రేట్లను తగ్గించడం వల్ల ఆర్థిక రంగానికి ఉత్తేజం లభిస్తుంది. ఆర్‌బిఐ ఇటీవలనే రెపో రేటును 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గించిన విషయం తెలిసిందే. దేశీయ కంపెనీలు గతేడాది కార్పొరేట్ బాండ్ల జారీ ద్వారా 6.7 లక్షల కోట్ల రూపాయలను సమీకరించాయి.

సర్వీసులూ చతికిలా..

జిడిపి వృద్ధిలో కీలకమైన సర్వీసుల రంగం కూడా ఇటీవల మందగించింది. అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభ కాలంలో కూడా ధగధగలాడిన సర్వీసుల వృద్ధి రేటు 2016-17లో 7.7 శాతం మాత్రమే ఉంది. జిఎస్‌టి, ఎఫ్‌డిఐ విధానాల సరళీకరణ, డిజిటలైజేషన్ చర్యల వల్ల ఈ రంగానికి అవకాశాలు పెరుగుతాయి.

ఇన్‌ఫ్రాపై మరింత పెట్టుబడి..

ఆర్థిక రంగంలో పునరుత్తేజానికి ఇన్‌ఫ్రాపై భారీగా వెచ్చించాలి. ఈ విషయంలో ప్రభుత్వం కమిటెడ్‌గానే ఉంది. భారత్‌మాల వంటి ప్రాజెక్టులతో పాటు రకరకాల చర్యల ద్వారా ఎయిర్‌పోర్టులు, రైల్వే లైన్లు, రహదారులతో సహా మౌలిక వసతుల రంగానికి ఉద్దీపన కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

నిర్మాణ రంగానికి పెనుసవాళ్లు..

నిర్మాణ రంగంలో ఎఫ్‌డిఐ గతేడాది 59 శాతం తగ్గి 190 కోట్ల డాలర్లకు చేరింది. ఈ రంగం కొంతకాలంగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నది. గృహాల అమ్మకాలు తగ్గాయి. కొత్త ప్రాజెక్టులు లేవు. డెవలపర్స్‌పై అప్పుల భారం పెరిగింది.

ఐటికి వీసా సవాళ్లు..

ఐటి రంగానికి వీసా సవాళ్లతో పాటు డిజిటల్ టెక్నాలజీల్లో నైపుణ్యాల కొరత ప్రధాన సమస్యగా ఉంది. తూర్పు యూరప్ దేశాల నుంచి పెరుగుతున్న పోటీ కూడా సమస్యగా మారింది. 15,000 కోట్ల డాలర్ల ఐటి,బిపిఎం రంగం తీవ్రమైన ఒత్తిడిలో ఉంది.

ఒబిసి నష్టం రూ.486 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగంలోని ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఒబిసి) జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి 486.20 కోట్ల రూపాయల నష్టాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంకు 100.69 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. తక్కువ ఆదాయం, ఎన్‌పిఎల కోసం ఎక్కువ కేటాయింపులు జరపడం వల్ల నష్టాలు వచ్చినట్టు బ్యాంకు పేర్కొంది. జూన్ త్రైమాసికంలో మొత్తం ఆదాయం 5,397.92 కోట్ల రూపాయల నుంచి 5,204.45 కోట్ల రూపాయలకు తగ్గింది. ఎన్‌పిఎలు స్థూలంగా 11.45 శాతం నుంచి 14.83 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పిఎలు కూడా 8.11 శాతం నుంచి 9.56 శాతానికి ఎగబాకాయి. ఎన్‌పిఎలు పెరిగిన ఫలితంగా ఆ మేరకు కేటాయింపులు 1,147.49 కోట్ల రూపాయల నుంచి 1,591.48 కోట్ల రూపాయలకు చేరాయి. శుక్రవారం బిఎస్ఇలో ఒబిసి షేరు 7.09 శాతం నష్టంతో 117.90 రూపాయలకు చేరింది.

లాభాల్లోకి జివికె పవర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జివికె పవర్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ లాభాల్లోకి అడుగుపెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కంపెనీ స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన 6.77 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ 51.04 కోట్ల రూపాయల నికర నష్టాలను నమోదు చేసింది. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం రాబడులు 16.85 కోట్ల రూపాయల నుంచి 22.42 కోట్ల రూపాయలకు పెరిగాయి. రుణ చెల్లింపుల్లో జాప్యం, వడ్డీల భారం, కొన్ని రుణాలను మొండి బకాయిలుగా బ్యాంకులు ప్రకటించటంతో గడచిన రెండు సంవత్సరాలుగా కంపెనీ నష్టాలను ప్రకటిస్తూ వస్తోంది. కాగా జివికె కోల్‌ను గాడిలో పెట్టేందుకు నాన్ కంట్రోలింగ్ వాటాదారులతో చర్చలు సాగించటంతో పాటు ఇన్వెస్టర్ల నుంచి అదనపు నిధులను సమీకరించేందుకు కసరత్తు చేస్తోందని జివికె పవర్ తెలిపింది. అలాగే పరిస్థితులను సాధారణ స్థాయికి చేర్చేందుకు రుణ దాతలతో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొంది. లాభదాయక కార్యకలాపాలను నిర్వహించటం ద్వారా కంపెనీని గాడిలో పెట్టవచ్చని కంపెనీ భావిస్తోంది. మరోవైపు అనుబంధ సంస్థలు, వాటాల విక్రయం ద్వారా రుణ భారాన్ని తగ్గించుకునేందుకు జివికె గత కొంతకాలంగా ప్రయత్నిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే.

మరింత పెరిగిన సెయిల్ నష్టాలు

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి ఉక్కు దిగ్గజం సెయిల్ స్టాండ్‌ఎలోన్ నికర లాభం 810.38 కోట్ల రూపాయలకు పెరిగింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ నష్టం 535.52 కోట్ల రూపాయలుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం 25.39 శాతం వృద్ధి చెంది 10,424.95 కోట్ల రూపాయల నుంచి 13,072.77 కోట్ల రూపాయలకు చేరుకుంది. మొత్తం వ్యయాలు 27 శాతం పెరిగి 11,296.16 కోట్ల రూపాయల నుంచి 14,349.89 కోట్ల రూపాయల దూసుకుపోయినట్టు కంపెనీ తెలిపింది.

ఎస్‌బిఐ లాభం రూ.2,006 కోట్లు

జూన్ త్రైమాసికంలో 20 శాతం తగ్గుదల



ఎస్‌బిఐ చైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన 2,005.53 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన నికర లాభం (2,520 కోట్ల రూపాయలు)తో పోల్చితే 20.44 శాతం క్షీణత నమోదైంది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం 190 శాతం వృద్ధితో 3,031.88 కోట్ల రూపాయలకు చేరింది. ఏప్రిల్ నుంచి 5 అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంక్‌ను విలీనం చేసుకున్న నేపథ్యంలో సమీక్షా త్రైమాసికంలో ఆర్థిక ఫలితాలను పోల్చి చూడలేమని ఎస్‌బిఐ పేర్కొంది. స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 22 శాతం మేర పెరిగి 14,437.31 కోట్ల రూపాయల నుంచి 17,606 కోట్ల రూపాయలకు చేరుకుంది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఎన్ఐఐ 1.78 శాతం క్షీణించి 19,323.11 కోట్ల రూపాయలకు తగ్గిపోయింది. స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన ఎస్‌బిఐ స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ) 6.90 శాతం నుంచి 9.97 శాతానికి పెరిగాయి. ఎన్‌పిఎల కోసం కేటాయింపులు 91.26 శాతం పెరిగి 639.56 కోట్ల రూపాయల నుంచి 12,125.26 కోట్ల రూపాయలకు ఎగబాకాయి. జూన్ త్రైమాసికంలో డిపాజిట్లు 13.28 శాతం మేర పెరిగి 22,97,426 కోట్ల రూపాయల నుంచి 26,02,534 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. స్థూలంగా జారీ చేసిన రుణాల మొత్తం 1.46 శాతం వృద్ధితో 18,59,513 కోట్ల రూపాయల నుంచి 18,86,666 కోట్ల రూపాయలకు చేరుకుంది.

5 శాతం క్షీణించిన షేరు

జూన్ త్రైమాసికానికి మొండి పద్దులు పెరిగిన నేపథ్యంలో ఎస్‌బిఐ షేరు శుక్రవారం 5 శాతానికి పైగా క్షీణించింది. దీంతో బ్యాంకు మార్కెట్ విలువ 13,724.51 కోట్ల రూపాయలు కరిగిపోయింది. బిఎస్ఇలో ఎస్‌బిఐ షేరు 5.36 శాతం మేర క్షీణించి 280.65 రూపాయల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 278.25 రూపాయల స్థాయికి కూడా ఈ షేరు చేరింది. ఎన్ఎస్ఇలో షేరు ధర 5.57 శాతం తగ్గి 280.15 రూపాయలకు చేరుకుంది.

బిఒబి లాభంలో 52 శాతం క్షీణత

న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) నికర లాభం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో 52 శాతం క్షీణించి 203.39 కోట్ల రూపాయలకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ 423.62 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. ఎన్‌పిఎలు పెద్దగా పెరగకపోయినప్పటికీ కేటాయింపులు పెరిగినందు వల్ల లాభాలపై ప్రభావం పడినట్టు బ్యాంకు పేర్కొంది. జూన్ త్రైమాసికంలో మొత్తం ఆదాయం 11,877.91 కోట్ల రూపాయల నుంచి 12,103.86 కోట్ల రూపాయలకు చేరుకుంది. స్థూల ఎన్‌పిఎలు 42,991.68 కోట్ల రూపాయల (11.15 శాతం) నుంచి 46,172.77 కోట్ల రూపాయల (11.40 శాతం)కు పెరిగాయి. నికర ఎన్‌పిఎలు 20,783.77 కోట్ల రూపాయల (5.73 శాతం) నుంచి 19,519.31 కోట్ల రూపాయల (5.17 శాతం)కు తగ్గాయి.

కార్పొరేషన్ బ్యాంక్ లాభంలో 67 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి కార్పొరేషన్ బ్యాంక్ 60.15 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో (35.92 కోట్ల రూపాయలు) పోల్చితే లాభంలో 67.5 శాతం వృద్ధి నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం 5,241.11 కోట్ల రూపాయల నుంచి 5,112.99 కోట్ల రూపాయలకు తగ్గింది. హోల్‌సేల్, రిటైల్ రాబడులు తగ్గడం వల్లనే ఆదాయం తగ్గినట్టు బ్యాంకు పేర్కొంది. జూన్ త్రైమాసికంలో స్థూల మొండి పద్దులు (ఎన్‌పిఎ) 11.01 శాతం నుంచి 15.49 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పిఎలు 7.22 శాతం నుంచి 11.14 శాతానికి ఎగబాకాయి.

85 శాతం కోటాకు సుప్రీంలోనూ చుక్కెదురు



చెన్నై, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని వైద్య విద్యా సంస్థల్లో స్టేట్ బోర్డు సిలబస్ విద్యార్థులకు 85 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఆ రిజర్వేషన్లను రద్దు చేస్తూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించింది. నీట్ పరీక్షలో స్టేట్ బోర్డు సిలబస్ విద్యార్థులు తక్కువ మార్కులు పొందటంతో ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి వైద్య కోర్సుల్లో అడ్మిషన్లు పొందలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనితో స్టేట్‌బోర్డు సిలబస్ విద్యార్థులకు వైద్య విద్య కోర్సుల అడ్మిషన్లలో 85% రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. దీనిని సవాలు చేస్తూ సీబీఎస్‌ఈ విద్యార్థుల తరఫున దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు న్యాయమూర్తి రవిచంద్రబాబు.. ఆ ఆర్డినెన్స్‌ను రద్దు చేశారు. చివరికి కేసు సుప్రీంకోర్టుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను అంగీకరించలేమంటూ సుప్రీంకోర్టు కూడా పిటిషన్‌ను తోసిపుచ్చింది.

బట్టతలపై జుట్టు మొలిపించే సూది మందు



భారతీయ వైద్యుల ఔషధానికి అమెరికా పేటెంట్

- **'ఆంధ్రజ్యోతి'కి డాక్టర్ దేవ్‌రాజ్ సోమ్ ఇంటర్వ్యూ**



"ఇసక పిండి నూనె తియొచ్చు.. ఎండమావిలో నీళ్లు తాగొచ్చేమోగానీ.. బట్టతల మీద జుట్టు మొలిపించడం మాత్రం కష్టమబ్బా" ..చాలా మంది బట్టతల బాధితుల మనసులో మాట ఇది! ఏదో వీవింగ్‌తోనో.. హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌తోనో సరిపెట్టుకోవాల్సిందేగానీ దీనికి సరైన మందు లేదని వారు తెగ బాధపడిపోతుంటారు. అలాంటి వారికి ఒక శుభవార్త. అపోలో స్పెక్ట్రా ఆసుపత్రికి చెందిన డాక్టర్ దేవ్‌రాజ్ సోమ్, డాక్టర్ రింకీ కపూర్ పరిశోధనల ఫలితంగా ఆ కొరత కూడా తీరిపోయింది. వారు తయారుచేసిన క్యూఆర్ 678 అనే మందు (ఇంజెక్షన్)కు అమెరికా పేటెంట్ లభించింది. దీనికి సంబంధించి డాక్టర్ దేవ్‌రాజ్ 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు..

క్యూఆర్ 678.. బట్టతల బాధితుల ఆశాదీపం.. ఈ మందును తయారుచేయటానికి మీకు ఎంత కాలం పట్టింది? ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారు?

ఈ మందును 2008లో తయారుచేశాం. 2010లో క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించాం. 2013లో యునైటెడ్ స్టేట్స్ పేటెంట్ అండ్ ట్రేడ్‌మార్క్ ఆఫీసులో పేటెంట్ కోసం దరఖాస్తు చేశాం. క్యూఆర్ 678 అనే ఈ ఇంజెక్షన్‌ను మన దేశంలో ప్రవేశపెట్టడం కోసం డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా అనుమతి అడిగాం. ఇది రావడానికి మరో తొమ్మిది నెలలు పట్టవచ్చు. అప్పుడు ఈ మందు దేశమంతా దొరుకుతుంది. ఇప్పుడు మాత్రం ముంబైలోని అపోలో ఆసుపత్రి స్టడీ క్లీనిక్‌లో లభిస్తుంది.

ఈ ఔషధాన్ని ఎలా ప్రయోగిస్తారు?

మన జుట్టు కింద సూక్ష్మమైన రక్తనాళాలు ఉంటాయి. ఈ రక్తనాళాలలో సమస్య ఏర్పడితే జుట్టు ఊడిపోతుంది. ఈ సమస్యకు జన్యుపరమైన పరిస్థితులు, వాతావరణ పరిస్థితులు, జీవన శైలి, హార్మోన్ల సమతౌల్యం లోపించడం ఇలా రకరకాల కారణాలుంటాయి. క్యూఆర్ 678ను మీసోథెరపి అనే టెక్నిక్ ద్వారా కుదుళ్లలోకి ఎక్కిస్తాం. అది మళ్లీ జుట్టు మొలిచేలా చేస్తుంది. ఈ చికిత్స కూడా చాలా సింపుల్‌గా ఉంటుంది.

బట్టతల ఉన్నవారందరికీ జుట్టు వస్తుందా? పరిమితులేవైనా ఉన్నాయా?

బట్టతల వచ్చి ఎంత కాలమయిందనే విషయంపై ఇది ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు 30 ఏళ్ల వ్యక్తికి బట్టతల వచ్చిందనుకుందాం. రాగానే ఈ ఇంజెక్షన్ చేయించుకుంటే పూర్వం ఎలా ఉందో అదే రీతిలో జుట్టు వస్తుంది. బట్టతల వచ్చి 15 ఏళ్లు అయిపోయిన వ్యక్తికి అంత జుట్టు రాకపోవచ్చు.

ఎన్ని ఇంజెక్షన్లు తీసుకోవాలి? ఎంత ఖర్చవుతుంది?

ఈ ఇంజెక్షన్ ఖరీదు రూ.6 వేలు. జుట్టు పూర్తిగా మొలవడానికి ఎనిమిది నుంచి పది ఇంజెక్షన్లు తీసుకోవాలి. అంటే దాదాపు అరవై వేల రూపాయల ఖర్చు అవుతుంది.

అలా వచ్చిన జుట్టు ఎంత కాలం ఉంటుంది?

ఈ చికిత్సతో ఒకసారి వెంట్రుక వచ్చిన తర్వాత అది పెరుగుతూ ఉంటుంది. ఏవైనా తీవ్రమైన కారణాలుంటేనే అది ఊడిపోతుంది. మేము చేసిన క్లినికల్ ట్రయల్స్‌లో అలాంటి సమస్యలేమి ఏర్పడలేదు. ఒకవేళ ఊడినా మళ్లీ ఇంజెక్షన్ చేయించుకుంటే తిరిగి మొలుస్తుంది.



కన్న బిడ్డలను కోల్పోయిన తల్లుల రోదన

ఆక్సిజన్ కొరత.. 30మంది పిల్లలు మృతి

- **ఉత్తర ప్రదేశ్ ఆస్పత్రిలో ఘోరం**

గోరఖ్‌పూర్ (యూపీ), ఆగస్టు 11: ఓ ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యం 30మంది చిన్నారుల నిండు ప్రాణాలను బలితీసుకుంది. వారి తల్లిదండ్రుల్లో తీరని గర్భశోకాన్ని మిగిల్చింది. యూపీలోని గోరఖ్‌పూర్‌లో జరిగిందీ ఘోరం! ఆక్సిజన్ అందక పట్టణంలోని బాబా భార్గవ్ దాస్ ఆస్పత్రి (బీఆర్డీ)లో కేవలం 48 గంటల వ్యవధిలో 30మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. బీఆర్డీ ఆస్పత్రిలో వైద్య సేవలపై పలు ఫిర్యాదులు రావడం, అక్కడ పెద్ద ఎత్తున చిన్నారుల మరణాలు సంభవిస్తుండటంతో సోమవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఆయన వచ్చివెళ్లిన రెండు రోజులకే ఆస్పత్రిలో ఈ దారుణం చోటుచేసుకోవడం గమనార్హం. ఎన్‌సిఫలిటిస్‌తో బాధపడుతున్న పిల్లల వార్డు సహా మూడు వార్డుల్లో గురువారం 20మంది చనిపోగా.. శుక్రవారం సాయంత్రానికి మరో 10మంది ప్రాణాలు కోల్పోయారు. కాగా ఈ ఘటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆక్సిజన్ సరఫరాను కాంట్రాక్టరు నిలిపివేయడంతోనే చిన్నారుల ప్రాణాలు పోయాయని ఆస్పత్రిలోని ఓ వర్గం పేర్కొంది. వైద్యులేమో చిన్నారుల మరణానికి ఆక్సిజన్‌లేమి కారణం కాదని.. ఎన్‌సిఫలిటిస్‌తోనే వారు చనిపోయారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆక్సిజన్ సరఫరా చేసే కంపెనీకి ఈ ఆస్పత్రి యాజమాన్యం రూ.66 లక్షలదాకా బకాయి ఉన్నట్టు బయటపడటం గమనార్హం. మొండిబకాయిలు చెల్లించని కారణంగానే గురువారం ఆక్సిజన్ సరఫరాను కంపెనీవారు నిలిపివేయడంతో 20మంది ప్రాణాలు కోల్పోయారు. తేరుకున్న యాజమాన్యం కంపెనీతో మాట్లాడి ఆక్సిజన్ సరఫరా చేయించేందుకు ఒప్పించినా.. మళ్లీ వారు సప్లయ్‌నినిలిపివేయడంతో మరిన్ని మరణాలు సంభవించాయి. కాగా బీఆర్డీ ఆస్పత్రిలో ఈ ఏడాదిలో ఇప్పటిదాకా 114మంది చిన్నారులు ఎన్‌సిఫలిటిస్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు.

మరో ఐఏఎస్ ఆత్మహత్య..!

ఘజియాబాద్, ఆగస్టు 11: మరో ఐఏఎస్ అధికారి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బిహార్‌లోని బక్సర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ముకేశ్ కుమార్ పాండే మృతదేహం గురువారం రాత్రి ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ రైల్వే జంక్షన్‌లో రైలు పట్టాలపై లభించింది. ఆయన జేబులో ఓ లేఖ లభించిందని, తన స్యూసైడ్ నోట్‌ను ఢిల్లీలోని ఓ ఫైవ్ స్టార్ హోటల్ రూం నెం. 742లో గల తన బ్యాగులో ఉంచానని అందులో రాసినట్లు పోలీసు సూపరింటెండెంట్ హెచ్‌ఎన్ సింగ్ తెలిపారు. బ్యాగులో పరిశీలించగా 'మనుషులపై నమ్మకం పోయింది. జీవితంపై విరక్తి చెందాను. హోటల్ 10వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నాను. నన్ను క్షమించండి. అందరినీ ప్రేమిస్తున్నాను' అని సూసైడ్ నోట్‌లో ఉంది. అస్సాంలోని గువహటికి చెందిన ముకేశ్ 2012 బ్యాచ్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి.

- **చంకన బిడ్డతో కండక్టర్**



బస్ కండక్టర్‌గా విధులు నిర్వహించడం పెనుసవాలు. అలాంటి బాధ్యతలను చంకన బిడ్డతో నిర్వహించాల్సిన పరిస్థితి ఆలియా జహాన్‌ది! భర్త రవీందర్ కూడా ఓ సంస్థలో ఉద్యోగి. పైగా వీరిది మతాంతర వివాహం కావడంతో బంధువులు దూరమయ్యారు. దీంతో.. ఇంట బిడ్డని చూసేవారు లేక, వెంటే ఉంచుకొని డ్యూటీ చేస్తోంది. సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఆలియా..ఆర్టీసీ కార్యాలయంలో పని చేసే అవకాశం కల్పించాలని చాన్నాళ్లుగా అధికారులను కోరుతోంది

\- సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి

దోస్త్ మేరా దోస్త్

- **దివ్యాంగుడి కోసం మేస్త్రీలుగా విద్యార్థులు**
- **ర్యాంప్ నిర్మించి ఔదార్యం..**

మెదక్ రూరల్, ఆగస్టు 11: అభిమానం, వాత్సల్యం, నిస్వార్థ చింతన.. స్నేహంలో మాత్రమే ఉండే గొప్ప లక్షణాలేమో!! వీటి స్ఫూర్తితోనే రెండు కాళ్లు పనిచేయని తమ ప్రాణస్నేహితుడి కష్టాన్ని తీర్చారా విద్యార్థులు! మెదక్ జిల్లా హవేళీఘణపూర్ హైస్కూల్లో మస్తాన్ బాబు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. పుట్టుకతోనే రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. ట్రై సైకిల్‌పై స్కూల్‌కు వచ్చి, మెట్లపై పాకుతూ క్లాస్‌రూంలోకి వెళ్లేవాడు. మస్తాన్ బాబు ఇలా రోజూ పడుతున్న ఇబ్బందిని చూసి తోటి విద్యార్థుల మనసు చలించింది. ఓ ర్యాంప్‌ను నిర్మిస్తే.. మస్తాన్‌బాబు ఇబ్బందులు తొలగిపోతాయని భావించారు. స్కూల్లోని టీచర్ నాగేందర్‌తో తమ ఆలోచనను పంచుకున్నారు. స్నేహితుడి పట్ల వారి సహృదయతకు ఆయన కరిగిపోయారు. తన సొంత ఖర్చులతో సిమెంటు, ఇతర సామాగ్రి తెప్పించారు. అంతే.. స్నేహితుడి కోసం తోటి విద్యార్థులంతా శుక్రవారం మేస్త్రీలుగా మారి తాపీ పట్టారు. తరగతి గదిలోకి వెళ్లేందుకు ర్యాంపు నిర్మించారు.



ర్యాంప్ నిర్మిస్తున్న విద్యార్థులు, (ఇన్‌సెట్లో)మస్తాన్ బాబు

జీఎస్టీతో 'బుక్' అయ్యారు!



- **ప్రింటింగ్, బైండింగ్, రాయల్టీపై 12% జీఎస్టీ**
- **మెడికల్, ఇంజనీరింగ్, లా పుస్తకాలు మరింత ప్రియం**
- **పుస్తకాల విక్రయంపై ప్రభావం.. పబ్లిషర్లు ఆందోళన**

ఆంధ్రజ్యోతి, విజయవాడ: పుస్తకాలపై నేరుగా ఎలాంటి సుంకం లేదు. అయితే, ప్రింటింగ్, బైండింగ్, రాయల్టీలపై 12 శాతం జీఎస్టీ చెల్లించాలి. ఈ మెలికే పబ్లిషర్ల పాలిట గుదిబండగా మారనుంది. పుస్తక ప్రియులకు భారం కానుంది. పుస్తక ప్రచురణ కేంద్రంగా పేరుగాంచిన విజయవాడలో పబ్లిషర్లు 'జీఎస్టీ' అంటేనే ఉలిక్కిపడుతున్నారు. దాని ప్రభావం ఏ రూపంలో తమపై పడుతుందో తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు. విజయవాడలో సుమారు 40 మంది ప్రముఖ పబ్లిషర్లు ఉన్నారు. ఏటా కొన్ని వందల పాఠ్య గ్రంథాలు, గైడ్లు, టెస్ట్ పేపర్లు, క్వశ్చన్‌బ్యాంకులు తదితర వాటిని ముద్రిస్తుంటారు. ఇప్పటి వరకు వీటి విక్రయాలపై ఎలాంటి పన్నులు లేవు. తాజాగా జీఎస్టీలో ప్రింటింగ్, బైండింగ్, రాయల్టీపై 12 శాతం పన్ను విధించారు. మరోవైపు పబ్లిషర్లకు ఇన్‌పుట్ సబ్సిడీ లేదని స్పష్టం చేయడంతో ఆ 12 శాతం భారాన్ని భరించేందుకు పబ్లిషర్లు సుముఖంగా లేరు. దీంతో ఆ భారం వినియోగదారులపైనే పడనుంది. ధర ఎక్కువగా ఉండే ఇంజినీరింగ్, మెడికల్, లా, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాల ధరలు మరింత పెరగనున్నాయి.

పాఠ్యపుస్తకాలపైనా భారం

ప్రైవేట్ పబ్లిషర్లు ముద్రించే పాఠ్యపుస్తకాల రేట్లు పెరిగే అవకాశం ఉంది. ఎక్సర్‌సైజ్ పుస్తకాలపై 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. దీంతో ఈ పుస్తకాలు ధరలు అందుబాటులో ఉండటం లేదు. ఇప్పటికే పుస్తకాల కొనుగోళ్లు తగ్గాయని, జీఎస్టీ కారణంగా ధరలు పెంచాల్సి వస్తే వ్యాపారాలు మరింత తగ్గిపోతాయని పబ్లిషర్లు అభిప్రాయపడుతున్నారు. ఇంటర్నెట్ వినియోగం పెరగడంతో ఇప్పటికే పుస్తకాలను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడు చేసుకుని చదువుతున్నారని, మరీ అవసరమనుకుంటే కానీ కొనుగోలు చేయడం లేదని ఓ వ్యాపారి తెలిపారు.

జీఎస్టీపై పూర్తి అవగాహన రావాలి

జీఎస్టీపై పబ్లిషర్లుకు కానీ, పుస్తకవిక్రేతలకు కానీ పూర్తి స్థాయి అవగాహన లేదు. దీనిపై మరింత అవగాహన పెంచుకోవాల్సి ఉంది. మేం ముడిసరుకుకు పన్ను కడుతున్నాం. ఇప్పుడు మళ్లీమళ్లీ పన్నులు అంటే కష్టమే. ఆ భారాన్ని వినియోగదారుడే భరించాల్సి ఉంటుంది. ఇది పుస్తకాల విక్రయంపై పడుతుంది.

\- విశ్వేశ్వరరావు, పబ్లిషర్



బజ్జున్న వ్యాపారాలు!

జీఎస్టీ ప్రభావంతో కుదేలు

హోటల్ 30%, ఫర్నిచర్ 50% క్షీణత

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): హోటల్ కుదేలు! ఫర్నిచర్ బెంబేలు! ఏ రంగం చూసినా ఏమున్నది గర్వకారణం వ్యాపారం సమస్తం జీఎస్టీతో కుయ్యో మొర్రో! హోల్‌సేల్ మార్కెట్ నుంచి మాల్స్, రీటెయిల్ మార్కెట్ వరకూ ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. తమ తమ రంగాలు సంక్షోభంలో కూరుకుపోతాయన్న ఆందోళన దాదాపు ప్రతి రంగంలోనూ వ్యక్తమవుతోంది. జీఎస్టీ దెబ్బకు హోటల్ రంగం కుదేలవుతోంది. ఏసీ హోటళ్లలో అమలవుతున్న 18 శాతం జీఎస్టీతో ఒక్కసారిగా 25-30 శాతం వ్యాపారం పడిపోయిందని పలు హోటళ్ల నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. నష్టాలను భరించలేక కొంతమంది మూసేస్తున్నారు. దీని ప్రభావంతో హోటళ్లతోపాటు టూరిజం కూడా సంక్షోభంలో పడక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, ఏసీ, నాన్ ఏసీ సంక్షోభం ఇప్పుడు హోటళ్లను కుదిపేస్తోంది. చాలా హోటళ్లలో ఏసీ, నాన్ ఏసీ సెక్షన్లు రెండూ ఉంటాయి. నాన్ ఏసీలో టిఫిన్, భోజనం చేసినా 18% జీఎస్టీ వడ్డించక తప్పడం లేదని, ఏసీ ఉందంటే జీఎస్టీ తప్పదని అధికారులు స్పష్టం చేస్తున్నారని హోటళ్ల యజమానులు చెబుతున్నారు.

పడిపోయిన ఫర్నిచర్ కొనుగోళ్లు

ఫర్నిచర్ కొనుగోలు చేస్తే గతంలో 14.5 శాతం పన్ను చెల్లిస్తే సరిపోయేది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అది కాస్తా 28 శాతానికి పెరిగింది. సోఫా సెట్లు, మంచాలు, టేబుల్స్, కుర్చీలు.. ఇలా వస్తువుల ధరలన్నీ పెరిగాయి. అంతేనా, వాటిని తయారు చేసే రా మెటీరియల్ అయిన ప్లైవుడ్, చెక్కలు, ఫోం, క్లాత్, లెదర్, హార్డ్‌వేర్ తదితరాల ధరలూ పెరిగాయి. గతంలో సోఫా సెట్ రూ.12 వేలు ఉంటే, ఇప్పుడు వెయ్యి నుంచి రూ.2000 ఎక్కువ చెబుతున్నారు. దాంతో, ఫర్నిచర్ వ్యాపారం ఒక్కసారిగా 50 శాతానికి పడిపోయింది.

కమలంపై కదనమెలా?

- **సోనియా సారథ్యంలో మంతనాలు**
- **ఎన్‌సీపీ డుమ్మా.. జేడీయూ ఎంపీ హాజరు**
- **ఢిల్లీలో 16 విపక్షాల కీలక భేటీ**

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ప్రధాని మోదీని, బీజేపీని ఎదుర్కొనేందుకు సమర్థ ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటు చేయాలని 16 ప్రతిపక్షాలు సంకల్పించాయి. ఇందుకోసం ఉమ్మడి వ్యూహం రూపొందించాలని నిర్ణయించాయి. ఈ పార్టీలు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ సారథ్యంలో శుక్రవారమిక్కడ కీలక సమావేశం నిర్వహించాయి. అయితే దీనికి శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్‌సీపీ డుమ్మాకొట్టింది. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో తమ అభ్యర్థి అహ్మద్ పటేల్‌కు ఓట్లేస్తామని హామీ ఇచ్చి పవార్ మోసగించారని కాంగ్రెస్ నేతలు ఆరోపించడంతో ఆ పార్టీ ఆగ్రహంతో ఉంది. బిహార్‌లో మహాకూటమి నుంచి వైదొలగిన జేడీయూ నుంచి ఆ పార్టీ అసంతుష్ట ఎంపీ ఆలీ అన్వర్ ఈ సమావేశానికి హాజరు కావడం గమనార్హం. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో లేవనెత్తాల్సిన ప్రజాసమస్యలపై విపక్షాలను సమన్వయపరిచేందుకు ఓ సబ్‌గ్రూపును ఏర్పాటు చేయాలని భేటీలో నిర్ణయించారు. ఈ గ్రూపును ఏర్పాటుచేసే అధికారాన్ని సోనియాకు అప్పగించారని రాజ్యసభలో విపక్ష నేత గులాం నబీ ఆజాద్ ఆ తర్వాత మీడియాకు తెలిపారు. ఈ సమావేశానికి కేరళ కాంగ్రెస్ (మణి) కూడా రాలేదని, ఆ పార్టీకి ఆ రాష్ట్రంలో వేరే కార్యక్రమం ఉండడంతో నేతలెవరూ రాలేకపోయారని చెప్పారు. వైరల్ జ్వరం కారణంగా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ కూడా హాజరు కాలేదు. కాగా... ఈ భేటీకి మన్మోహన్‌సింగ్, అహ్మద్ పటేల్, ఏకే ఆంటోనీ (కాంగ్రెస్), బెంగాల్ సీఎం మమతా బెనర్జీ (తృణమూల్ కాంగ్రెస్), సీతారాం ఏచూరి (సీపీఎం), డి.రాజా (సీపీఐ), జైప్రకాశ్ యాదవ్ (ఆర్‌జేడీ), అజిత్‌సింగ్ (ఆర్‌ఎల్‌డీ), తిరుచి శివ (డీఎంకే), సతీశ్ మిశ్రా (బీఎస్పీ), నరేశ్ అగర్వాల్ (ఎస్‌పీ), ఒమర్ అబ్దుల్లా (ఎన్‌సీ), సంజీవ్‌కుమార్ (జేఎంఎం), డానిష్ ఆలీ (జేడీఎస్), బద్రుద్దీన్ అజ్మల్ (ఏఐయూడీఎఫ్), ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ (ఆర్‌ఎస్‌పీ), మొహమ్మద్ బషీర్ (ఐయూఎంఎల్) కూడా వచ్చారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విపక్షాల కూటమి తరపున పోటీచేసేందుకు అంగీకరించిన మాజీ స్పీకర్ మీరాకుమార్, మాజీ గవర్నర్ గోపాలకృష్ణ గాంధీలకు వీరు ధన్యవాదాలు తెలియజేశారు.



వివిధ పార్టీల నేతలతో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా

ఆలీ అన్వర్‌పై జేడీయూ వేటు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన విపక్షాల భేటీకి హాజరైనందుకు తమ రాజ్యసభ సభ్యుడు ఆలీ అన్వర్ అన్సారీని జేడీయూ సస్పెండ్ చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఆయనపై వేటు వేసినట్లు ప్రకటించింది. తద్వారా తమ అధ్యక్షుడు, బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌ను విమర్శిస్తున్న పార్టీ మాజీ అధ్యక్షుడు శరద్ యాదవ్‌కు కూడా హెచ్చరిక చేసింది. జేడీయూలో అసమ్మతిని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు సోనియా ప్రయత్నిస్తున్నారని, తమ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని పార్టీ అధికార ప్రతినిధి కేసీ త్యాగి ఆరోపించారు. శరద్ యాదవ్‌పైనా చర్య తీసుకుంటారా అని అడుగగా.. ఈ నెల 19న పట్నాలో జాతీయ కార్యవర్గ భేటీలో ఆయన తన అభిప్రాయాలను వ్యక్తంచేయాలని కోరుకుంటున్నామని బదులిచ్చారు.

కాంగ్రెస్ ఏమవుతుందో!



- **మనకున్నది 44 మంది ఎంపీలే.. అయ్యర్ ఆందోళన**

న్యూఢిల్లీ, ఆగస్టు 11: కాంగ్రెస్ ఉనికి ప్రమాదంలో పడిందని ఆ పార్టీ నాయకుడు జైరాం రమేశ్ ఆందోళన స్వరం వినిపించిన వెంటనే మరో సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ సైతం ఆయనకు జత కలిశారు. లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యులు 44 మంది మాత్రమే ఉన్నారని గుర్తు చేస్తూ.. దేశ రాజకీయాల్లో మనగలగాలంటే కొత్త ఆలోచనలను అభివృద్ధి చేసుకోవడం అవసరమని అభిప్రాయపడ్డారు. "కాంగ్రెస్‌వాదులు వాస్తవాన్ని గ్రహించాలి. మనకు ఉన్నది 44 మంది ఎంపీలే. పైగా తీవ్రమైన ఎదురుదెబ్బలు తింటున్నాం" అని అయ్యర్ అన్నారు. కాంగ్రెస్‌కు కొత్త ఆలోచనలు, కొత్త విధానాలు, కొత్త మార్గాలు అవసరమని చెప్పారు. నాలుగు రోజుల కిందట ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జైరాం రమేశ్ కాంగ్రెస్ మునుపెన్నడూ లేని.. ఉనికికి సంబంధించిన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ద్వయాన్ని ఆషామాషీగా తీసుకోకూడదని హెచ్చరించారు. వారి నుంచి ఎదురవుతున్న సవాళ్లను అధిగమించాలంటే సమష్టి ప్రయత్నాలు అవసరమని సూచించారు. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ వ్యూహం నుంచి కాంగ్రెస్ చచ్చీచెడి బయటపడింది. కమలనాథులు ఎగరేసుకుపోతారనుకున్న రాజ్యసభ సీటును అతి కష్టం మీద అహ్మద్ పటేల్ దక్కించుకోగలిగారు. ఆ ఎన్నికల్లో అనుభవాల అనంతరం.. కాంగ్రెస్ భవితవ్యంపై సీనియర్ నేతల ఆందోళన ప్రాధాన్యత సంతరించుకుంది.

కలిసి సాగండి

- **తమిళనాడు సీఎంకు బీజేపీ పెద్దల సూచన**
- **మోదీ, పలువురు నేతలతో ఎడప్పాడి భేటీ**

చెన్నై, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్) ప్రధాని మోదీని కలిశారు. శుక్రవారం ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడి ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన ఈపీఎస్.. మోదీతోపాటు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ, పలువురు బీజేపీ పెద్దలనూ కలుసుకున్నారు. అన్నాడీఎంకేలోని ఇరువర్గాలూ విలీనం కాబోతున్నాయని వార్తలొస్తున్న నేపథ్యంలో కేవలం 20 రోజుల వ్యవధిలోనే పళనిస్వామి రెండుసార్లు మోదీని కలవడం విశేషం. అన్నాడీఎంకేలోని ఇరువర్గాల (ఈపీఎస్, ఓపీఎస్) విలీనంపై ఈ సందర్భంగా ప్రధాని ఆరా తీసినట్లు సమాచారం. సాధ్యమైనంత త్వరగా అన్నాడీఎంకే వర్గాలు విలీనమై ప్రభుత్వాన్ని చక్కగా నడుపుకోవాలని బీజేపీ పెద్దలు కూడా ఈపీఎస్‌కు సూచించినట్లు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం కూడా ఢిల్లీలోనే ఉన్నారు. ఆయన శనివారం పలువురు బీజేపీ అగ్రనేతలతో భేటీ కానున్నట్లు సమాచారం. కాగా, అన్నాడీఎంకే జయలలిత నియమించిన కార్యవర్గమే పార్టీని నడుపుతోందని, తరువాత వచ్చిన పదవులు చెల్లవంటూ ఈపీఎస్ నేతృత్వంలోని 27 మంది నేతలు తీర్మానించిన ప్రతులను ఓపీఎస్ వర్గం శుక్రవారం కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సమర్పించింది. వారి పదవులను రద్దు చేయాలని కోరింది. ఇదిలావుండగా, ప్రభుత్వంపై కక్ష తీర్చుకునేందుకు దినకరన్ సిద్ధమవుతున్నారు. తనకు అండగా నిలిచే ఎమ్మెల్యేలను సేకరించే పనిలో తలమునకలయ్యారు. కాగా, ప్రభుత్వంపై అవిశ్వాసం పెడతామని డీఎంకే నేత స్టాలిన్ ప్రకటించారు.



ఉప రాష్ట్రపతి వెంకయ్యతో ఎడప్పాడి బృందం

ప్రో కబడ్డీలో నేటి మ్యాచ్‌లు

టైటాన్స్ X యూపీ యోధా రాత్రి 8.గం

గుజరాత్ X ఢిల్లీ రాత్రి 9.గం

9 ఈ మ్యాచ్‌లో భారత్ నెగ్గితే లంకపై అత్యధికంగా 9 విజయాలు సాధించిన జట్టుగా పాకిస్థాన్‌ను అధిగమిస్తుంది.

1 ఈ సీజన్‌లో పుజారా అత్యధిక స్కోరర్. అతను 76.63 సగటుతో 843 పరుగులు చేశాడు. కరుణరత్నె 43.85 సగటుతో 614 పరుగులు చేసి నాలుగో స్థానంలో ఉన్నాడు.

18 గత మూడేళ్లుగా శ్రీలంకలో జరిగిన మ్యాచ్‌ల్లో ఒక్క డ్రా కూడా కాలేదు. 18 మ్యాచ్‌ల్లో ఫలితం తేలింది.

అడుగేస్తే చరిత్రే...

సోనీ సిక్స్ టెన్-3లలో ఉ.10 నుంచి

- విదేశాల్లో తొలి క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి
- పరువు కోసం శ్రీలంక పోరాటం
- నేటి నుంచే మూడో టెస్టు

తొలి టెస్టులో బ్యాటింగ్ పిచ్‌పై లంకను మట్టి కరిపించాం... మలిపోరులో స్పిన్ వికెట్‌పై ప్రత్యర్థిని చిత్తు చేసేశాం.. ఇప్పుడు మూడో మ్యాచ్ కోసం పచ్చిక స్వాగతం పలుకుతోంది..! పేస్‌తోనూ లంకేయులను కొట్టేస్తే.. ఓ పనైపోతుంది..! విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన జట్టుగా కోహ్లీసేన చరిత్ర సృష్టిస్తుంది..! మరి, రెండేళ్లుగా విజయాలనే శ్వాసగా మలుచుకున్న భారత జైత్రయాత్రను అడ్డుకునే దమ్ము ఆతిథ్య జట్టుకు ఉందా..! సిరీస్ ఎలాగూ పోయింది.. కనీసం ఆఖరాటలో గెలిచి సొంతగడ్డపై పరువైనా కాపాడుకుంటుందా..!


కోహ్లీ

జట్లు (అంచనా)

భారత్: ధవన్, రాహుల్, పుజారా, కోహ్లీ (కెప్టెన్), రహానె, అశ్విన్, సాహా (కీపర్), హార్దిక్/కుల్దీప్, భువనేశ్వర్, ఉమేష్, షమి.

శ్రీలంక: తరంగ, కరుణరత్నె, కుశాల్ మెండిస్, చాందిమల్ (కెప్టెన్), మాథ్యూస్, డిక్‌వెలా (కీపర్), డిసిల్వ, దిల్‌రువాన్ పెరీర, చమీర/లక్షణ్, ఫెర్నాండో, లాహిరు కుమార.

పిచ్/వాతావరణం

పల్లెకెలె పిచ్ ఫాస్ట్ బౌలర్లకు అనుకూలిస్తుంది. మంచి పేస్‌తోపాటు బౌన్స్ లభిస్తుంది. ఈ మ్యాచ్‌కు వాన ముప్పు ఉంది. మ్యాచ్ రోజుల్లో ఎంతో కొంత వర్షం కురిసే అవకాశం ఉంది.

కాండీ: విరాట్ కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా చరిత్ర ముంగిట నిలిచింది. విదేశాల్లో మూడు టెస్టుల సిరీస్‌ను తొలిసారి వైట్‌వాష్ చేసిన జట్టుగా నిలిచేందుకు మరో విజ యం దూరంలో ఉంది. ఇప్పటికే 2-0తో సిరీస్ నెగ్గి జోరు మీదున్న కోహ్లీసేన.. సొంతగడ్డపై పేలవ ఆటతీరుతో నిరాశపరుస్తున్న లంకతో శనివారం మొదలయ్యే మూడో, చివరి టెస్టులో గెలిచి రికార్డు సృష్టించాలని భావిస్తోంది. నెంబర్ వన్ హోదాలో శ్రీలంక గడ్డపై అడుగుపెట్టిన భారత్.. తొలి రెండు టెస్టుల్లో అసాధారణ ప్రదర్శన చేసింది. గాలెలో 304 పరుగులతో, కొలంబోలో ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో ఘన విజయాలు సొంతం చేసుకొని తిరుగులేని ఫామ్‌లో ఉంది. మరోవైపు ప్రస్తుతం సంధి దశలో ఉన్న లంక వరుస వైఫల్యాలతో కొట్టు మిట్టాడుతోంది. కనీసం ఈ మ్యాచ్‌లో అయినా గెలిచి పరువు నిలబెట్టుకోవాలని ఆరాట పడుతోంది. అందుకోసం పల్లెకెలె మైదానంలో పచ్చికతో కూడిన వికెట్‌ను సిద్ధం చేసుకున్న శ్రీలంక పేస్‌తో భారత్‌ను కొట్టాలని భావిస్తోంది.

భారత్ ముగ్గురు పేసర్లతో..: తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత్ అమోఘంగా రాణించింది. ఓపెనర్ల నుంచి తొమ్మిదో నెంబర్ వరకూ బ్యాట్స్‌మన్ అందరూ అద్భుత ఫామ్‌లో ఉన్నా రు. ముఖ్యంగా ఈ సీజన్‌లో అత్యధిక పరుగుల వీరుడు పుజారా లంకపై చెలరేగిపోతున్నాడు. ఈ మ్యాచ్‌లోనూ పుజారా శతకం చేస్తే.. విదేశాల్లో మూడు టెస్టుల సిరీస్‌లో మూడు సెంచరీలు చేసిన భారత తొలి క్రికెటర్‌గా నిలుస్తాడు. బ్యాట్స్‌మెన్ మరోసారి సమష్టి ప్రదర్శన చేస్తే క్లీన్‌స్వీప్ చేయడం కోహ్లీసేనకు పెద్ద కష్టమేమీ కాదు. పిచ్ స్వభావం దృష్ట్యా జడేజా స్థానాన్ని భువనేశ్వర్‌తో భర్తీ చేసే ఆలోచనలో ఉన్నాడు కోహ్లీ. హార్దిక్‌కు బదులు రెండో స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి రావొచ్చు. ఇక, తొలి రెండు మ్యాచ్‌ల్లో ఘోర పరాజయాలతో లంక ఆత్మస్థయిర్యం దెబ్బతిన్నది. కొలంబోలో సెంచరీలు చేసిన కరుణరత్నె, కుశాల్ మెండిస్‌పై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. గాయ పడ్డ స్టార్ పేసర్ నువాన్ ప్రదీప్, ఏస్ స్పిన్నర్ రంగన హెరాత్ స్థానాల్లో యువ పేసర్లు కుమార, ఫెర్నాండోలను రంగంలోకి దింపుతోంది. మరి, పేస్ పిచ్‌ను, సీమర్లను నమ్ముకొని బరిలోకి దిగుతున్న శ్రీలంక ఏ మాత్రం పోటీ ఇస్తుందో చూడాలి.


లంక సారథి చాందిమల్

బోల్ట్ ఆఖరి రేస్..!


4 x100 రిలే నేడు ● మ. 3:25కి హీట్స్

రాత్రి 2:20కి ఫైనల్ ● స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్-2లో



లండన్: స్ప్రింట్ కింగ్ ఉసేన్ బోల్ట్ ఆఖరాటకు సమయం ఆసన్నమైంది. లండన్ వేదికగా జరుగుతున్న వరల్డ్ అథ్లెటిక్స్‌తో కెరీర్‌కు వీడ్కోలు పలకనున్న జమైకా చిరుత.. ఆఖరి పరుగుకు సిద్ధమయ్యాడు. శనివారం జరిగే పురుషుల 4 x100 రిలేతో బోల్ట్ తనకు ప్రాణపదమైన ట్రాక్‌కు గుడ్‌బై చెప్పనున్నాడు. ఈ మెగా ఈవెంట్‌లో 11 స్వర్ణాలు నెగ్గిన బోల్ట్ నేతృత్వంలోని జమైకా టీమ్ శనివారం మధ్యాహ్నం 3:25 గంటలకు జరిగే హీట్స్‌లో పోటీపడనుంది. ఈ జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తే శనివారం అర్ధరాత్రి.. అంటే భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 2:20కి మొదలవుతుంది. ఈ రేస్‌లో విజయం సాధిస్తే బోల్ట్ ఖాతాలో 12వ స్వర్ణం చేరుతుంది.

వీరికి..బాస్కెట్‌బాల్ కావాల్సి వచ్చిందా ?


డ్యురాంట్

న్యూఢిల్లీ: కెవిన్ డ్యురాంట్.. అమెరికా మేటి బాస్కెట్‌బాల్ ఆటగాడు. గోల్డెన్ స్టేట్ వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహించే ఇతడు..ఆ జట్టుకు ఎన్‌బీఏ టైటిల్ సాధించిపెట్టాడు. అంతేకాదు..ఆ జట్టు విజేతగా నిలిచిన ఫైనల్లో కెవిన్ అత్యంత విలువైన ఆటగాడి అవార్డు అందుకున్నాడు. ఇటీవల భారత్‌లో పర్యటించిన అతడు న్యూఢిల్లీలో 3,459 మంది చిన్నారులకు బాస్కెట్‌బాల్ ఓనమాలు నేర్పాడు. ఇది అతిపెద్ద 'బాస్కెట్‌బాల్ క్లాస్'గా గిన్నిస్‌బుక్‌లోకెక్కింది. తన ఫౌండేషన్ తరపున రెండు బంతులనూ నిర్వాహకులకు అందజేశాడు. అనంతరం అతడు తాజ్‌మహల్‌ను సందర్శించాడు. తన భారత పర్యటన ప్రత్యేకమైనదిగా పేర్కొన్న డ్యురాంట్.. ఇక్కడి పరిస్థితులపై ఆశ్చర్యం ప్రకటించాడు. 'ఇండియా పర్యటన అనూహ్యంగా జరిగింది. ఇండియా అంటే ఏదో గొప్పగా అనుకున్నా. కానీ దిగాక తెలిసింది ఇక్కడ నాగరికత, ప్రజల జీవన విధానం ఎంత నాటుగా ఉందో' అని చెప్పాడు. విజ్ఞానం విషయంలో భారత్ 20 ఏళ్లు వెనక ఉందని కెవిన్ అభిప్రాయపడ్డాడు. నాగరికత అంతగా తెలియని ఇక్కడి ప్రజలకు బాస్కెట్‌బాల్ ఆట నేర్చుకోవాలనుకోవడం ఆశ్చర్యం కలిగించిందని వ్యాఖ్యానించాడు. 'తాజ్‌మహల్‌కు వెళ్లే దారి పొడవునా ఆవులు కనిపించాయి. ఇక కోతులైతే ఎక్కడపడితే అక్కడే. రోడ్లపక్కన వందలాదిమంది ప్రజలు నడుస్తుండడం గమనించాను. లక్షలాది కార్లు. మొత్తంగా నాగరికత అంతగా అబ్బని ఈ సమూహాలకు బాస్కెట్‌బాల్ ఆట కావాల్సి వచ్చింది' అని కెవిన్ పేర్కొన్నాడు.



వింటర్‌లో జహీర్, సాగరికల పెళ్లి

ముంబై: ప్రేమపక్షులు జహీర్‌ఖాన్, బాలీవుడ్ నటి సాగరిక ఘట్గే వచ్చే చలికాలంలో ఓ ఇంటివారు కానున్నారు. అయితే తేదీ నిర్ణయం కాలేదు. ఈ సంవత్సరాంతంలో తామిద్దరం పెళ్లి చేసుకోనున్నట్టు సాగరిక వెల్లడించింది. 38 ఏళ్ల టీమిండియా మాజీ పేసర్ జహీర్, సాగరికల ఎంగేజ్‌మెంట్ గత ఏప్రిల్‌లో జరిగిన సంగతి తెలిసిందే.

నడాల్‌కు షాక్

- షపోవలోవ్ సంచలన విజయం
- మాంట్రియల్ మాస్టర్స్ టోర్నీ


షపోవలోవ్

మాంట్రియల్ (కెనడా): ఏటీపీ మాంట్రియల్ మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో స్పెయిన్ దిగ్గజం రఫెల్ నడాల్ అనామక ఆటగాడి చేతిలో ఓటమి ఎదుర్కొన్నాడు. ప్రీ క్వార్టర్స్‌లో నడాల్‌కు కెనడా టీనేజర్ డెనిస్ షపోవలోవ్ దిమ్మదిరిగే షాకిచ్చి సంచలనం సృష్టించాడు. గురువారం రాత్రి జరిగిన రౌండ్-16 పోరులో వైల్డ్‌కార్డ్ ఎంట్రీ షపోవలోవ్ 3-6, 6-4, 7-6 (7/4)తో మూడు సెట్లలో టాప్ సీడ్ నడాల్‌పై అద్భుత విజయం సాధించాడు.

ఆనంద్ ఎనిమిదో రౌండ్ డ్రా

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్‌ఫీల్డ్ కప్ ఎనిమిదో రౌండ్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ డ్రాగా ముగించాడు. తెల్లపావులతో తలపడిన ఆనంద్.. ఫ్రాన్స్‌కు చెందిన మాగ్జిమ్ వాషిర్ లగ్రావ్‌తో ఈ రౌండ్‌ను 30 ఎత్తుల్లో డ్రా చేసుకున్నాడు.

గుజరాత్ జోరు

- యు ముంబాపై అలవోక విజయం



అహ్మదాబాద్: ప్రో కబడ్డీ లీగ్ ఐదో అంచెలో అరంగేట్రం జట్టు గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ అదరగొడుతోంది. సొంతగడ్డపై జరిగిన తమ తొలి మ్యాచ్‌లో కెప్టెన్ సుఖేష్ హెగ్డే, రోహిత్ గుల్లా, సచిన్ తిరుగులేని ప్రదర్శన చేయడంతో యు ముంబాతో శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 39-21తో అద్భుత విజయం సాధించింది. జోన్-ఎ పోరులో గుజరాత్‌కిది రెండో విజయం కాగా.. పటిష్ఠమైన ముంబాకిది రెండో ఓటమి. రోహిత్ (9), సచిన్ (8), అబోజర్ మిగాని (5) గుజరాత్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆరంభం నుంచే ముంబా డిఫెన్స్‌ను ఛేదించిన సుఖేష్ సేన రెండో నిమిషంలోనే 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 6-0తో ఆధిక్యంలో ఉన్న దశలో రైడ్‌కు వెళ్లిన సచిన్ రెండు పాయింట్లు తెచ్చాడు. ఆ వెంటనే ముంబై రైడర్‌ను పట్టేసిన గుజరాత్ ప్రత్యర్థిని ఆరో నిమిషంలోనే ఆలౌట్ చేసి 9-1తో ఆధిక్యంలో నిలిచింది. ముంబా కెప్టెన్ అనూప్ కుమార్ వైఫల్యం కూడా ఫలితంపై ప్రభావం చూపింది. రోహిత్, సచిన్ రైడింగ్‌లో రాణించడంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి గుజరాత్ 20-6తో స్పష్టమైన ఆధిక్యం సాధించింది. బ్రేక్ తర్వాత కూడా గుజరాత్ జోరు తగ్గలేదు.


గులియెవ్ (200మీ)

2007 తర్వాత జమైకా చిరుత ఉసేన్ బోల్ట్ లేకుండా జరిగిన 200 మీటర్ల రేస్..! దీంతో ఈ పరుగుపై సర్వత్రా ఆసక్తి..! బోల్ట్ తర్వాత ఈ స్థానం దక్కేదెవరికి..! ఉసేన్ వారసుడెవరు..! అంటే.. దక్షిణాఫ్రికా యువ సంచలనం వేన్ వాన్ నీకెర్క్‌పైనే అందరి దృష్టి నెలకొంది. బోల్ట్ స్థానాన్ని భర్తీ చేసే సత్తా అతనికే ఉందంటూ క్రీడా పండితులు విశ్లేషించారు. కానీ.. రేసు మొదలైన సెకన్ల వ్యవధిలో అంచనాలన్నీ తారుమారయ్యాయి. నీకెర్క్ ఆశలపై నీళ్లు కుమ్మరిస్తూ టర్కీకి చెందిన రామిల్ గులియెవ్ 200 మీటర్ల విజేతగా నిలిచాడు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో డిఫెండింగ్ చాంపియన్ క్రిస్టియన్ టేలర్ స్వర్ణం నెగ్గగా.. మహిళల 400 మీ. హర్డిల్స్‌లో కార్టర్ గోల్డ్ సాధించింది.

గోల్డెన్ గులియెవ్!

- టర్కీ రన్నర్ సంచలనం
- టేలర్‌కు 'ట్రిపుల్' స్వర్ణం

లండన్: పురుషుల 200 మీటర్ల ఫైనల్లో టర్కీకి చెందిన రామిల్ గులియెవ్ స్వర్ణం సాధించి అథ్లెటిక్ సామ్రాజ్యాన్ని అబ్బురపరిచాడు. క్రీడా పండితులు బోల్ట్ వారసుడిగా భావిస్తున్న సఫారీ స్టార్ రన్నర్ వేడ్ వాన్ నీకెర్క్‌కు షాకిచ్చిన గులియెవ్ ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో సరికొత్త రికార్డు సృష్టించాడు. గురువారం రాత్రి ఇక్కడ ఉత్కంఠగా సాగిన ఫైనల్లో గులియెవ్ 20.09 సెకన్లలోనే రేసును పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచాడు. తద్వారా ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్స్‌లో టర్కీ తరపున తొలి స్వర్ణం నెగ్గిన ఆటగాడిగా తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించాడు. కాగా వరల్డ్ చాంపియన్‌షిప్స్ 400మీ., 200 మీ. విభాగాల్లో స్వర్ణాలు నెగ్గి మైకేల్ జాన్సన్ తర్వాత ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పాలని చూసిన నీకెర్క్ ఆశ నెరవేరలేదు. 1995లో మైకేల్ ఈ రెండు విభాగాల్లోనూ గోల్డ్ సాధించాడు. రేసుకు ముందు హాట్ టాపిక్‌గా మారిన ఇస్సాక్ మక్వాలా (బోత్సువానా) ఆరో స్థానంతో నిరాశపరిచాడు.


టేలర్‌కు 'ట్రిపుల్' గోల్డ్

పురుషుల ట్రిపుల్ జంప్‌లో అమెరికా అథ్లెట్ క్రిస్టియన్ టేలర్ ముచ్చటగా మూడో స్వర్ణం సాధించాడు. ఫైనల్లో టేలర్ 17.68 మీటర్లు దూకి గోల్డ్ అందుకున్నాడు. 2012, 2016 ఒలింపిక్స్‌లోనూ స్వర్ణం కొల్లగొట్టిన టేలర్ వరల్డ్ చాంపియన్‌షిప్స్ ట్రిపుల్ జంప్‌లో పసిడి నెగ్గడం గెలవడం ఇది మూడోసారి. కాగా.. అమెరికాకే చెందిన రియో విల్ క్లే 17.63మీ. రెండో స్థానంలో నిలిచాడు.


కోరి కార్టర్

400 మీ. హర్డిల్స్‌లో కార్టర్‌కు స్వర్ణం

మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో అమెరికా స్టార్ కోరి కార్టర్ స్వర్ణం సాధించింది. ఫైనల్లో కార్టర్ 53.07 సెకన్లతో రేసును పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. అమెరికా అథ్లెట్ దలైలా మహమ్మద్ 53.50 సె.తో రజతం అందుకుంది. ట్రేసీ (జమైకా) 53.74 సె.తో మూడో స్థానం సాధించింది.


దేవిందర్

జావెలిన్ ఫైనల్లో దేవిందర్

జావెలిన్ త్రోలో పతకంపై ఆశలు రేపిన యువ సంచలనం నీరజ్ చోప్రా తీవ్రంగా నిరాశపరిచాడు. నీరజ్ అర్హత పోటీల్లోనే నిష్క్రమించగా.. దేవిందర్ సింగ్ కాంగ్ మాత్రం అంచనాలకు మించి రాణించి ఫైనల్లో అడుగుపెట్టాడు. క్వాలిఫికేషన్ రౌండ్ గ్రూప్-బి పోరులో జావెలిన్‌ను 84.22 మీటర్లు విసిరిన దేవిందర్ ఫైనల్‌కు అర్హత సాధించాడు.



దేవుడి కంటే ఎక్కువేంకాదు ?

న్యూఢిల్లీ: 'బీసీసీఐ దేవుడికంటే ఎక్కువేం కాదు' అని పేస్ బౌలర్ శ్రీశాంత్ ఆగ్రహించాడు. తనపై విధించిన జీవితకాల నిషేధాన్ని కేరళ హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చినా..బోర్డు దానిపై డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేయాలని నిర్ణయించడంపై అతడు తీవ్రంగా స్పందించాడు. 'బీసీసీఐని నేను బిచ్చమడగడంలేదు. నా బతుకుదెరువును మళ్లీ ఇమ్మంటున్నాను. ఇది నా హక్కు. అయినా మీరు భగవంతుడి కంటే ఎక్కువేం కాదు' అని ట్విట్టర్‌లో వ్యాఖ్యానించాడు.

భారత్ మరో ఓటమి

న్యూఢిల్లీ: యూరప్ పర్యటనలో భారత పురుషుల హాకీ జట్టు వరుసగా రెండో పరాజయం చవి చూసింది. భారత్ 1-3తో ఆతిథ్య బెల్జియం చేతిలో ఓడింది. ఖురేషి భారత్ తరపున గోల్ చేశాడు.

రాజ్యాంగ పీఠంపై మనోడు!





ఉపరాష్ట్రపతిగా వెంకయ్య ప్రమాణస్వీకార కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి కామినేని, ఎంపీలు సీఎం రమేశ్, మాగంటి బాబు

ఉప రాష్ట్రపతిగా వెంకయ్య ప్రమాణ స్వీకారం.. ఈ పదవి చేపట్టిన రెండో తెలుగు వాడు

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగువాడు మరోసారి కేంద్రంలో ప్రతిష్ఠాత్మక పదవిని అలంకరించాడు. మన తెలుగు బిడ్డ రాజ్యాంగపరంగా దేశంలోనే రెండో అత్యున్నత పదవిని అధిష్ఠించాడు. ఉషాపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు భారత 15వ ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం ఉదయం 10.15 గంటలకు హిందీలో ఆయనతో ప్రమాణం స్వీకారం చేయించారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్ హాల్‌లో అత్యంత అట్టహాసంగా జరిగిన ఈ వేడుకకు అతిరథ మహారథులంతా హాజరయ్యారు. ఉప రాష్ట్రపతిగా రిజిస్టర్‌లో సంతకం చేసిన వెంకయ్య.. ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ కురువృద్ధులు అడ్వాణీ, మురళీ మనోహర్ జోషి వద్దకు వెళ్లి నమస్కరించారు. అందరితో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో జన్మించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత తొలి ఉపరాష్ట్రపతిగా పనిచేశారు. ఆ తర్వాత తెలుగువాడు ఈ పదవికి ఎంపిక కావడం ఇదే తొలిసారి. అలాగే, వెంకయ్య ఈ పదవిని చేపట్టిన 13వ వ్యక్తి. గతంలో సర్వేపల్లి రాధాకృష్ణన్, హమీద్ అన్సారీలు రెండేసిసార్లు ఉప రాష్ట్రపతిగా పని చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మాగాంధీ సమాధి వద్ద వెంకయ్య అంజలి ఘటించారు. బీజేపీ వ్యవస్థాపకుల్లో ఒకరైన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రమాణ స్వీకారం తర్వాత పార్లమెంటుకు వచ్చి అక్కడున్న అంబేడ్కర్ విగ్రహానికి అంజలి ఘటించారు. అనంతరం రాజ్యసభకు వెళ్లి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, బిహార్, ఢిల్లీ ముఖ్యమంత్రులు నితీశ్ కుమార్, కేజ్రీవాల్, బీజేపీ ముఖ్యమంత్రులు ఫడణవీస్, శివరాజ్‌సింగ్ చౌహాన్, రమణ్ సింగ్, వసుంధరా రాజే, యోగి ఆదిత్యనాథ్, మనోహర్ పర్రీకర్, మనోహర్‌లాల్ ఖట్టర్, సోనోవాల్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎన్వీ రమణ, తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ సహా పలువురు గవర్నర్లు, కేంద్ర మంత్రులు, ఎంపీలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధినేత్రి సోనియా హాజరు కాలేదు.

- రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సభాపతి స్థానంలో కూర్చోవడానికి వచ్చిన వెంకయ్యకు ఎంపీలు బల్లలు చరిచి ఘన స్వాగతం పలికారు.
- జై శ్రీరాం.. భారత్ మాతాకి జై... జైహింద్ నినాదాలతో సభ మార్మోగింది.
- ఆంగ్ల అక్షరమాలలో 'నాయుడు' అంటే... 'నౌ ఆల్ ఇండియా డియరెస్ట్ అంపైర్' అని తృణమూల్ ఎంపీ డెరిక్ ఒబ్రీన్ అభివర్ణించారు.
- తెలుగులో మాట్లాడాల్సిందిగా సీపీఎం ఎంపీ సీతారాం ఏచూరిని కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి గద్దించారు. దాంతో కాసేపు ఆయన తెలుగులో మాట్లాడారు. టీడీపీ ఎంపీ సీఎం రమేశ్ పూర్తిగా తెలుగులోనే ప్రసంగించారు.
- తమిళనాడు మాజీ సీఎం జయలలితకు వెంకయ్య సన్నిహితులని, ఆమె బతికి ఉంటే ఇప్పుడు సంతోషించేవారని అన్నాడీఎంకే ఎంపీ నవనీత్ కృష్ణన్ అన్నారు.
- బాల్ ఠాక్రే జీవించి ఉంటే వెంకయ్య ఉప రాష్ట్రపతి అయినందుకు ఆనందం వ్యక్తం చేసేవారని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. వెంకయ్య తెలుగు బిడ్డ మాత్రమే కాదని, హిందుస్థాన్ బిడ్డ అని అన్నారు.
- గందరగోళ పరిస్థితుల్లో బిల్లులను పాస్ చేయవద్దని వెంకయ్యకు చాలా మంది ఎంపీలు సూచించారు.
- అన్ని ప్రాంతీయ భాషల్లో ఏకకాలంలో అనువాదమయ్యే వ్యవస్థను ఏర్పాటు చేయాలని పలువురు ఎంపీలు విజ్ఞప్తి చేశారు.



రాష్ట్రపతి కోవింద్‌తో ఉపరాష్ట్రపతి వెంకయ్య కరచాలనం


నాలుగు పీఠాల్లోనూ కమలనాథులు

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తొలిసారిగా దేశంలోని నాలుగు కీలక రాజ్యాంగ పదవుల్లో బీజేపీ నేతలే కొలువుదీరారు. రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు, ప్రధాన మంత్రిగా మోదీ, లోక్‌సభ స్పీకర్‌గా కొనసాగుతున్న సుమిత్రా మహాజన్ బీజేపీ నేతలే. వీరికి ఆరెస్సెస్ నేపథ్యం కూడా ఉండడం గమనార్హం. వీరంతా వారసత్వాలు ఏమీ లేకుండా జవసత్వంతో ఉన్నత స్థానాలకు చేరిన సామాన్యులు కావడం మరో విశేషం.



వెంకయ్య ఓఎస్డీగా సత్యకుమార్

న్యూఢిల్లీ, ఆగస్టు(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు కార్యదర్శివర్గం(సెక్రటేరియట్)లో తొలి నియామకం జరిగింది. ఓఎస్డీగా వై సత్యకుమార్‌ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సత్యకుమార్ ఏబీవీపీ కార్యకర్తగా విద్యార్థి రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించారు. 24 ఏళ్ల క్రితం వెంకయ్యనాయుడు ఉమ్మడి ఏపీ బీజేపీ శాఖ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఆయనతో సాన్నిహిత్యం కలిగింది. అప్పటినుంచి ఆయనకు కార్యదర్శిగా ఉంటూ వచ్చారు. వెంకయ్య కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉండగా అదనపు కార్యదర్శిగా, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు మంత్రికి ఓఎస్డీగా సత్యకుమార్ బాధ్యతలు నిర్వర్తించారు. తొలిసారిగా ఆలిండియా సర్వీసుకు చెందని వ్యక్తి ఓఎస్డీగా సత్య నియామకం జరగడం విశేషం.




నేను వెళ్తున్నా.. ఆయన వస్తున్నారు

- సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వెంకయ్య రాజ్యసభ చైర్మన్ అయ్యారని, తాను రాజ్యసభ నుంచి రిటైర్ అవుతున్నానని, 'నేను వెళ్తున్నా.. ఆయన వస్తున్నారు' అని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. సభలో ఇదే తన చివరి ప్రసంగమన్నారు. శుక్రవారం రాజ్యసభలో వెంకయ్యకు స్వాగతం పలికిన ఆయన మాట్లాడారు. వెంకయ్యతో తనకు 40 ఏళ్ల పరిచయముందన్నారు. సభలో లేవనెత్తే అంశాలకు న్యాయం చేయాలని వెంకయ్యను కోరారు.

రాజ్యాంగ పదవుల్లో సామాన్యులు

ఇది మన ప్రజాస్వామ్య గొప్పదనం.. స్వతంత్ర భారతంలో జన్మించిన తొలి ఉప రాష్ట్రపతి వెంకయ్యే



- రాజ్యసభలో వెంకయ్యకు స్వాగతం పలికిన మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): "స్వతంత్ర భారతదేశంలో జన్మించిన తొలి ఉప రాష్ట్రపతి వెంకయ్యే! పార్లమెంటు సభ్యుడిగా ఆయనకు అపారమైన అనుభవం ఉంది. పార్లమెంటరీ కార్యకలాపాలపై పూర్తి అవగాహన ఉంది. క్రియాశీల నేతగా, పార్లమెంటేరియన్‌గా ఆయన గడించిన అపారమైన అనుభవం మాకు మార్గదర్శకం" అని ప్రధాని మోదీ కొనియాడారు. తొలిసారి సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన వారితో రాజ్యాంగ పదవులు నిండిపోయాయని, ఇది ప్రజాస్వామ్య గొప్పదనమని కొనియాడారు. అనేక ఏళ్లు ప్రజల్లో ఉన్న వ్యక్తి ఉప రాష్ట్రపతి కావడం ఇదే తొలిసారన్నారు. వెంకయ్య రాజ్యసభ చైర్మన్ హోదాలో శుక్రవారం తొలిసారిగా సభాపతి స్థానంలో ఆశీనులయ్యారు. సభ్యులంతా ఆయనకు స్వాగతం పలికారు. తొలుత ప్రధాని శుభాకాంక్షలు తెలుపుతూ ప్రసంగించారు. "రైతు బిడ్డ వెంకయ్య.. సోషలిస్టు నేత జయప్రకాశ్ నారాయణ్ ఇచ్చిన పిలుపుతో విద్యార్థి ఉద్యమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి వెనుదిరిగి చూడకుండా ప్రయాణించి ఇప్పుడు దేశ రెండో అతి పెద్ద రాజ్యాంగ పదవిలో కూర్చున్నారు. ఎప్పుడూ రైతులు, గ్రామాలు, పేదల గురించే ఆలోచించేవారు. పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నా కేబినెట్ సమావేశాల్లో ఎక్కువగా గ్రామాలు, రైతుల గురించే మాట్లాడేవారు" అని అన్నారు. ఆయన ఆలోచనల్లో నుంచి పుట్టిన 'ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన'తో ఎన్నో గ్రామాలకు కనెక్టివిటీ అందిందన్నారు. "వెంకయ్య తెలుగులో సూపర్ ఫాస్ట్‌గా ప్రసంగిస్తారు. హిందీలో ప్రసంగిస్తున్నప్పుడు తెలుగు పదాలు కూడా వాడతారు. అయినా ప్రసంగంలో స్పష్టత ఉంటుంది. ప్రాసలు అల్లడంలో వెంకయ్య దిట్ట. న్యాయవాది న్యాయమూర్తి అయితే ఎలానో.. చాలా ఏళ్లపాటు రాజ్యసభలో ఉన్న ఆయన ముందు కొంత కాలం ఇబ్బందిపడతారు" అని చమత్కరించారు. వెంకయ్యతో తనకు 50 ఏళ్ల అనుబంధం ఉందని, రాజకీయ రంగంలో చాలా కష్టపడి ఆయనీ స్థాయికి చేరుకున్నారని ఆర్థిక మంత్రి జైట్లీ కొనియాడారు. పార్లమెంటరీ వ్యవహారాలపై వెంకయ్యకు అపారమైన అనుభవం ఉందని, సభను సజావుగా నడపడానికి ఆయన దాన్ని ఉపయోగిస్తారని ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలుగు ప్రజలకు గర్వకారణం

- సుజనా చౌదరి, సీఎం రమేశ్

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సామాన్య కుటుంబం నుంచి దేశంలోనే అత్యున్నత స్థానానికి ఎదిగిన వెంకయ్య నాయుడు తెలుగు ప్రజలకు గర్వకారణమని టీడీపీ ఎంపీ సీఎం రమేశ్ వ్యాఖ్యానించారు. రాజ్యసభ చైర్మన్‌గా వెంకయ్య తొలిసారి సభకు వచ్చిన నేపథ్యంలో శుక్రవారం సభలో రమేశ్ మాట్లాడారు. వెంకయ్య ఉపరాష్ట్రపతి అయినందుకు సంతోషంగా ఉన్నా, తెలుగు ప్రజలకు పెద్ద దిక్కయిన వెంకయ్య క్రియాశీల రాజకీయాల్లో లేకపోవడం బాధ కలిగిస్తోందన్నారు. చిన్నప్పటి నుంచి తాను వెంకయ్య గురించి వింటూ, ఆయన ప్రకటనలు పత్రికల్లో చదువుతూ పెరిగానన్నారు. అసెంబ్లీలో వెంకయ్య ప్రసంగం అద్భుతంగా ఉండేదని కొనియాడారు. వెంకయ్యతోపాటు జైపాల్ రెడ్డి, గౌతు లచ్చన్న లాంటి ఉద్ధండుల ప్రసంగాలు చాలా బాగుండేవని, ఈ రోజుల్లో అలాంటి ప్రసంగాలు ఎవ్వరూ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యులను అలాంటి ప్రసంగాలు చేసేలా వెంకయ్య ప్రోత్సహించాలని రమేశ్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి సుజనా చౌదరి మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్‌లో జన్మించి వెంకయ్య అత్యున్నత స్థానాన్ని అధిష్ఠించినందుకు సంతోషంగా ఉందన్నారు. వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి మాట్లాడుతూ.. వెంకయ్యతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

వాదించండి.. విభేదించండి..
బహిష్కరించకండి!

- చర్చల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం
- రాజ్యసభ చైర్మన్‌గా వెంకయ్య తొలి ప్రసంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): "ప్రజాస్వామ్యంలో చర్చల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం కనుక్కోవాలి. అధికార పక్షంతో విభేదించినా, వాదించినా అంతిమ ప్రయోజనం ప్రజా సంక్షేమమే కావాలి. వాదించండి. చర్చించండి. వివిధ అంశాలపై నిర్ణయాలు తీసుకోండి. కానీ, అంతరాయాలు కల్పించవద్దు. సభను బహిష్కరించవద్దు" అని రాజ్యసభ చైర్మన్‌గా వెంకయ్య నాయుడు తనదైన శైలిలో సభ్యులకు హితవు పలికారు. ఉప రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాజ్యసభ చైర్మన్‌గా పదవీ బాధ్యతలను చేపట్టిన వెంకయ్య తొలి ప్రసంగం సభికులందర్నీ ఆకట్టుకుంది. సభ్యులు తమకు కల్పించిన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఇంకా ఎక్కువ రోజులు సభను జరిపేలా ప్రభుత్వాన్ని కోరతానని చెప్పారు. "1998లో నేను తొలిసారిగా రాజ్యసభలోకి అడుగు పెట్టినప్పుడు ఇదే సభకు చైర్మన్ అవుతానని కలలో కూడా ఊహించలేదు. ఎటువంటి రాజకీయ వారసత్వం లేని నాలాంటి సామాన్యులను కూడా అందలం ఎక్కించగల ఘనత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఉంది" అని వ్యాఖ్యానించారు. రాజ్యసభ ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు ప్రతి సభ్యుడూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. "ప్రపంచంలో ఆర్థికంగా అత్యంత వేగంగా ఎదుగుతున్న అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌ను బలీయమైన దేశంగా నిలబెట్టేందుకు సమర్థ చట్టాలు అవసరం. మానవ, సహజ వనరులను సమర్థంగా ఉపయోగించుకోగలిగితే త్వరితగతిన అభివృద్ధిని సాధించగలం" అని వివరించారు. తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నామా? లేదా? అని పార్లమెంటు సభ్యులు ఆత్మ విమర్శ చేసుకోవాలని చెప్పారు. సభలను అడ్డుకోవడమే తమ ప్రథమ కర్తవ్యమన్న ధోరణి ప్రమాదకరమని హెచ్చరించారు.

అర్థవంతమైన చర్చలకే ప్రాధాన్యం ఇవ్వాలి

సభలో జరిగే అర్థవంతమైన చర్చలను ప్రోత్సహించేలా పత్రికలు కథనాలు ప్రచురించాలని వెంకయ్య సూచించారు. వ్యవసాయ రంగంపై గతంలో తాను చేసిన ప్రసంగాన్ని స్వామినాథన్ వంటి నిపుణులు అభినందిస్తే మరుసటి రోజు పత్రికల్లో ఒక్క ముక్క కూడా రాయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికలు తమ ప్రాధాన్యాలను మార్చుకుంటే సభలో సభ్యుల తీరు మారే అవకాశముందని అభిప్రాయపడ్డారు.



వెంకయ్య కంటతడి

రాజ్యసభ చైర్మన్‌గా ప్రసంగిస్తున్న సమయంలో వెంకయ్య నాయుడు తల్లిదండ్రులను గుర్తు చేసుకుని కంటతడి పెట్టుకున్నారు. తనకు చిన్న వయసులోనే తల్లిదండ్రులు పోయారని చెప్పారు. తన చిన్న తనాన్ని గుర్తు చేసుకున్నారు. చిన్నతనం నుంచి తాను పార్టీనే తల్లిలా భావిస్తున్నానని చెప్పారు.

ప్రమాణస్వీకారానంతరం సంతకం చేస్తున్న వెంకయ్యనాయుడు

మీ సంగతి 2019లో చూస్తా..

పార్లమెంటుకు రారా?.. ఇలాగైతే టిక్కెట్లు ఇవ్వం.. బీజేపీ ఎంపీలకు మోదీ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): "మీరు పార్లమెంటుకు ఎందుకు ఎన్నికయ్యారు? సభకు హాజరు కావడానికా లేక సంతకం చేసి ఇళ్లకు వెళ్లి విశ్రాంతి తీసుకోవడానికా? మీలాగే పార్టీలో సేవ చేసిన వారు చాలామంది ఉన్నారు. వారందర్నీ కాదని మీకు సీట్లు ఇచ్చి గెలిపిస్తే పార్లమెంటుకు సరిగ్గా హాజరు కాకపోవడం శోచనీయం. మీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే 2019లో మా ఇష్టం వచ్చినట్లు మేం సీట్లు ఇవ్వాల్సి ఉంటుంది" అని ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ ఎంపీలకు హెచ్చరిక జారీ చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగింపు సందర్భంగా గురువారం నిర్వహించిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని కన్నెర్ర చేశారు. ఎంపీల తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు ఉంటాయని

సభకు గైర్హాజరవడంపై ఆగ్రహం

స్పష్టం చేశారు. ఓబీసీ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టినప్పుడు తగినంత మంది బీజేపీ ఎంపీలు హాజరు కాకపోవడంతో ఆ బిల్లులో కాంగ్రెస్ కొన్ని సవరణలను ప్రవేశపెట్టి నెగ్గింది. ఓబీసీల చాంపియన్‌గా చెప్పుకునే బీజేపీ ప్రవేశపెట్టిన బిల్లుకు మంగళం పాడడాన్ని ప్రధాని జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ పార్టీ సమావేశంలో తన ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా రాజ్యసభలో అడుగుపెడుతున్నారని, ఇకపై ఎంపీల ఆటలు సాగవన్న అర్థం వచ్చేలా మాట్లాడిన ప్రధాని రాబోయే ఎన్నికల్లో ఎంపీల పని తీరు ఆధారంగానే సీట్ల కేటాయింపు ఉంటుందని తేల్చి చెప్పారు. గతంలో ఇవే విషయాలను అమిత్ షా ఎంపీలకు చెప్పినా పెద్దగా పట్టించుకోకపోవడంతో ప్రధాని ఎంపీలతో కటువుగా మాట్లాడాల్సి వచ్చిందని బీజేపీ నేతలు అంటున్నారు. ఓబీసీ బిల్లు రాజ్యసభలో ప్రవేశపెట్టినప్పుడు సీనియర్ మంత్రులతో పాటు 31 మంది ఎంపీలు గైర్హాజరయ్యారు. ప్రధాని తాజా హెచ్చరికతో బీజేపీ ఎంపీలు కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ నియోజకవర్గాల్లో పనులు బాగానే చేస్తున్నామని, పార్లమెంటులో విప్‌లు తమకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వకపోవడంతో చిన్న చిన్న తప్పులు జరుగుతున్నాయని అంటున్నారు. మరి మోదీ హెచ్చరికలు ఎంపీలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయో తెలియాలంటే వచ్చే పార్లమెంటు సమావేశాల వరకూ వేచిచూడాల్సిందే.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.